సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
visit us @ https://www.suryaepaper.com

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.



సంపుటి 19 | సంచిక 142
గురువారం | 12 మార్చి 2026 | హైదరాబాద్
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, ఫాల్గుణ మాసం బహుళ పక్షం, నవమి తె.4.20, మూల రా.11.00, వర్జ్యం రా.9.14 నుంచి 11.00 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.10.14 నుంచి 11.01 వరకు తిరిగి 2.55 నుంచి 3.42 వరకు

# చేనేత రుణమాఫీ నిధులు ఇస్తాం



3 లో

● 16.9కోట్ల చేనేత రుణమాఫీ నిధులు విడుదలకై వినతి ● నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాష్ట్రంలో మిగిలిపోయిన చేనేత కార్మికుల రుణమాఫీ నిధులు 16.9 లక్షల కోట్ల రూపాయలు రేపే విడుదల చేయనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు చేనేత సమస్యలైన రుణమాఫీ నేతన్న భరోసా నిధులు, ప్రభుత్వ వాటా నిధులను విడుదల చేయాలని వ్యవసాయ చేనేత శాఖామాత్యులు తుమ్మలను అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమ్మర్తపు మురళి మరియు అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్‌ల ఆధ్వర్యంలో సెక్రటేరియట్లో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగింది

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై

# కాంగ్రెస్ రాజకీయం

● అక్కడి ఘటనపై కాంగ్రెస్ నేతలు రీల్స్ చేస్తారన్న ప్రధాని ● కొచ్చి రిఫైనరీలో 5 వేల 500 కోట్లతో నిర్మించే పాలీప్రొఫైలిన్ యూనిట్‌కు శంకుస్థాపన ● దేశాన్ని విదేశాలపై ఎక్కువగా ఆధారపడేలా చేసి ఆనందించారు ● దేశంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వారికి తెలియదని విమర్శలు ● దేశాన్ని 'ఆత్మనిర్భర్'గా మార్చడానికి అవిశ్రాంత బీజేపీ-ఎన్డీఏ కృషి ● కేరళలో పర్యటిస్తోన్న ప్రధాని మోడీ



6 లో

# కాలుష్యాన్ని నియంత్రించాలి

● పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి ● కరీంనగర్ డంపింగ్ యార్డు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ● ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన చెత్త కుప్పలు - త్వరలో తరలింపు ప్రక్రియ ప్రారంభం

కరీంనగర్ పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న డంపింగ్ యార్డును రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. డంపింగ్ యార్డు వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. ఇటీవల చొప్పదండి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ ప్రజలకు హామీ ఇస్తూ డంపింగ్ యార్డును శాశ్వతంగా తరలిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.




3 లో

## గ్యాస్ సిలిండర్లకు ఇబ్బందిలేదు

### మోడీ సర్కార్ కీలక ప్రకటన

దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ల కొరతపై నెలకొన్న ఆందోళనలకు మోదీ సర్కార్ తెరదించింది. వినియోగదారులకు ఊరటనిచ్చేలా కీలక ప్రకటన విడుదల చేసింది కేంద్ర ప్రభుత్వం. గ్యాస్ బుక్ చేసిన రెండున్నర రోజుల్లోనే సిలిండర్ డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది.



6 లో




రాష్ట్రీయం తెలంగాణ

# ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

## స్పీకర్ గడ్డం ప్రసాద్ తీర్పుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఫైర్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు అన్నారు. బుధవారం తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎమ్మెల్యేల పార్టీ మార్పు తీర్పుపై మాట్లాడారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ ఒక వ్యక్తి ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఆరు నెలల లోపే మరో పార్టీలో చేరి అదే పార్టీ తరఫున లోక్‌సభకు పోటీ చేయడం మొత్తం రాష్ట్ర ప్రజలు చూసిన విషయమే. ఇంత స్పష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ దాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించలేమని చెప్పడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఒక పార్టీ నుంచి గెలిచిన వ్యక్తి మరో పార్టీ అభ్యర్థికి ప్రచారం చేయడం, అదే పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేయడం వంటి స్పష్టమైన రికార్డులు ఉన్నప్పటికీ కూడా ఇది పార్టీ ఫిరాయింపు కాదని చెప్పడం ప్రజాస్వామ్యాన్ని అవమానించే తీర్పు. ఇది ప్రజలు ఇచ్చిన తీర్పును కూడా అగౌరవపరిచినట్లే అని అన్నారు. యాంటీ డిఫెక్షన్ చట్టాన్ని తీసుకొచ్చింది రాజీవ్ గాంధీ ఆ సమయంలో రాజ్యాంగ సవరణ ద్వారా ఆ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. కాబట్టి ఈ అంశంపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అదే యాంటీ డిఫెక్షన్ చట్టం స్పష్టంగా ఉల్లంఘనకు గురవుతున్న పరిస్థితుల్లో స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కడమే అని అన్నారు.

రాహుల్ గాంధీ మీరు ఒకవైపు రాజ్యాంగాన్ని కాపాడుతున్నామని చెప్పుకుంటూ తిరుగుతున్నారు. కానీ మరోవైపు మీ పార్టీకి చెందిన నాయకుల చర్యలను సమర్థించే విధంగా ఇలాంటి తీర్పులు రావడం ఎలా సమర్థించగలరు అని ప్రశ్నించారు? తీర్పు కేవలం ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కాదు, రాజ్యాంగాన్ని మరియు ప్రజల తీర్పును కూడా అగౌరవపర్చడమే, అవమానించడమే. ఈ తీర్పుపై భారతీయ జనతా పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందన్నారు.

## బీజేపీ నిర్లక్ష్యంతో ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం దెబ్బతింటోంది

● ఉత్పత్తి సామర్థ్యం పూర్తిగా వినియోగం కావడం లేదు

● పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రామగుండం ఆర్ ఎఫ్ సి ఎల్ సంస్థ పనితీరు దెబ్బతింటోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థలో జరుగుతున్న మిస్ మేనేజ్మెంట్, పరిపాలనా నిర్లక్ష్యంపై పలుమార్లు కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖలు రాసినట్లు తెలిపారు. వ్యక్తిగతంగా కలసి సమస్యలను వివరించినప్పటికీ కేంద్రం నుంచి సరైన స్పందన రాలేదని విమర్శించారు. రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో పనిచేయడం లేదని, సుమారు 70 శాతం ఉత్పత్తి మాత్రమే కొనసాగుతోందని పేర్కొన్నారు. సంస్థ హెడ్ఆఫీస్ ఢిల్లీలో ఉండటం వల్ల ఇక్కడి సమస్యలపై తగిన శ్రద్ధ పడటం లేదని అన్నారు. అందువల్ల హెడ్ఆఫీస్‌ను హైదరాబాద్‌కు మార్చాలని పలుమార్లు లేఖలు, విజ్ఞప్తులు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదని తెలిపారు. అధికారికంగా కూడా హెడ్ఆఫీస్ మార్పు సాధ్యం కాదని కేంద్రం లేఖ ద్వారా తెలియజేసిందని చెప్పారు. గతంలో మూతపడిన ఈ సంస్థను తిరిగి ప్రారంభించేందుకు మాజీ కేంద్ర మంత్రి జి. వెంకటస్వామి (కాకా) అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్తో చర్చలు జరిపి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అనంతరం మాజీ ఎంపీ జి. వివేక్ వెంకటస్వామి కూడా ఎంతో కృషి చేసి సంస్థను మళ్లీ ఉత్పత్తిలోకి తీసుకువచ్చారని చెప్పారు. ఈ సంస్థ ద్వారా అనేక మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయని తెలిపారు. రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి యూరియా సరఫరా జరగడంతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఎరువులు పంపిణీ అయ్యే విధంగా వ్యవస్థ పనిచేసిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వంలో యూరియా నిర్వహణలో గందరగోళం నెలకొన్నదని విమర్శించారు. సరైన విధంగా దిగుమతులు చేయకపోవడం, ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పరిస్థితి తెలంగాణ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని, సమస్య పరిష్కారం కోసం నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు.

## ఎన్‌పీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్ కుమార్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : నేషనల్ పీపుల్స్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్ కుమార్‌ను పార్టీ జాతీయ నాయకత్వం నియమించింది. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించి ప్రజలకు చేరువ చేయడంలో గవ్వల భరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తారని పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువతను రాజకీయాల్లోకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. గవ్వల భరత్ కుమార్ గతంలో బీసీ జాతీయ సంక్షేమ సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. అలాగే బీసీ యువజన సంఘం, బీసీ విద్యార్థి సంఘాల్లో నాయకత్వం వహిస్తూ బీసీ వర్గాల హక్కుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. యువత సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పలు ఉద్యమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గవ్వల భరత్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన నేషనల్ పీపుల్స్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మేఘాలయ ముఖ్యమంత్రి కోన్‌రాడ్ సంగ్మా, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు జేమ్స్ సంగ్మా, జాతీయ ప్రధాన కార్యదర్శి పక్నా బాగే, జాతీయ యువజన సంఘం అధ్యక్షులు నీఖా నంక్ల తదితర నేతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని ఆయన తెలిపారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధి కోసం అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతామని, ముఖ్యంగా యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చి కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని గవ్వల భరత్ కుమార్ పేర్కొన్నారు.

## సభలో మాట్లాడే అవకాశం రాహుల్‌కి ఇవ్వలేదు: ఎంపీ మల్లు రవి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తీరుపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం న్యూఢిల్లీలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం సందర్భంగా లోక్ సభలో ఎంపీ మల్లు రవి మాట్లాడారు. పార్లమెంట్ సంస్థలు పార్టీల రాజకీయాలను మించి ఉండాలని అభిప్రాయపడ్డారు. సభలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వ లేదని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల స్వరాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్పీకర్ పదవి రాజకీయాలకు అతీతంగా ఉండాలని ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. మహిళా ఎంపీలపై స్పీకర్ ఓం బిర్లా చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. మహిళా ఎంపీల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ ఎంపీ మల్లు రవి విమర్శించారు. ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపీలపై ఉన్న సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలు లేవనెత్తినందుకే సదరు ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలను ఎంపీ మల్లు రవి ఖండించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటూ పూర్తిగా రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 14ను బ్లాక్ డే అనడం తప్పు అంటూ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు.

# పార్టీ ఫిరాయింపులను స్పీకర్ ప్రోత్సహిస్తారా

● ఫిరాయింపు ఎమ్మెల్యేలపై క్లీన్ చిట్ ఇవ్వడం సిగ్గుచేటు ● తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ తీరును ఖండించిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యానికి అడుగడుగునా అగౌరవం ఎదురవుతోంది. దానం నాగేందర్, కడియం శ్రీహరి లాంటి పార్టీ ఫిరాయింపుదారులకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ 'క్లీన్ చిట్' ఇవ్వడం తెలంగాణ ప్రజల తీర్పును కాలరాయడమే. ఈ విషయంలో నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరునే బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఈ రెండు పార్టీల ఆలోచన శైలి, వ్యవహార శైలిలో ఏమార్పూ లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి, తర్వాత ముఖ్యమంత్రి సమక్షంలో కండువా మార్చుకుని, ఏకంగా కాంగ్రెస్ బీ-ఫామ్ మీద ఎంపీగా నా మీద పోటీ చేసిన సాక్ష్యాలు సరిపోవా స్పీకర్ అని ప్రశ్నించారు. సామాన్యులందరికీ కనిపించిన సాక్ష్యాలు మీకు ఎందుకు కనిపించడం లేదు? ఫిరాయింపులను అరికట్టాల్సిన అత్యున్నతమైన, బాధ్యతాయుతమైన స్పీకర్ పదవిలో ఉండి, వాటికి చట్టబద్ధత కల్పించడం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం. రక్షించాల్సిన వారే భక్షకులుగా మారి రాజ్యాంగ వ్యవస్థలను అధికార పార్టీ చేతిలో బందీగా మార్చారన్నారు. ఇది ప్రజల తీర్పును కాంగ్రెస్ పార్టీ అపహాస్యం చేసిన తీరుకు నిదర్శనం. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, పదవుల కోసం ప్రజా తీర్పును అంగట్లో సరకులాగా మారిస్తే దానికి స్పీకర్ గారు వత్తాసు పలకడం దురదృష్టకరం అని ఆయన అన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గుర్తుమీద ఎన్నికైన శాసనసభ్యులు బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేస్తారు. పార్టీ ఫిరాయింపుల చట్టానికి తూట్లుపొడిచి ప్రజాస్వామ్యాన్ని కాలరాసి.. కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్ పార్టీలోకి పార్టీ ఫిరాయించడం కారు గుర్తుపై గుర్తుపై ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధి కాంగ్రెస్ గుర్తుపై పోటీచేశారు. ఈ రెండు పార్టీలు తెలంగాణలో పార్టీఫిరాయింపుల చట్టాన్ని కాలరాయడం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడంలో ఒకరికొకరు పోటీపడి ప్రజాతీర్పునకు వెన్నుపోటుపొడుస్తున్నారన్నారు. అధికార దుర్వినియోగంతో వ్యవస్థలను మేనేజ్ చేయవచ్చు కానీ, ప్రజల ఆగ్రహాన్ని మేనేజ్ చేయలేరు.



కళ్లముందు జరుగుతున్న ఈ అన్యాయాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోంది. రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న వారికి ప్రజా క్షేత్రంలో తగిన శాస్తి తప్పదన్నారు.

# సీఎం బంధువులు సహజ వనరుల దోపిడీ

● సీఎం బంధువులు బినామీల పేరుతో సహజ వనరులను దోచుకుంటున్నారు

● జీవో 111ను తుంగలో తొక్కి అక్రమ క్రషింగ్ ప్రభుత్వం, మైనింగ్ అధికారులు కుమ్మక్కు ● ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: హైదరాబాద్ సమీపంలోని హిమాయత్‌సాగర్ పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్, క్రషింగ్ కార్యకలాపాల గుట్టు రట్టు చేయడానికి బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్యాక్ట్ ఫైండింగ్ టీమ్ ఈరోజు ఉదయం కొకాపేట్ సమీపంలోని నియోపోలిస్ ప్రాంతంలో ఉన్న భాగ్యలక్ష్మి మినరల్స్ క్రషింగ్ యూనిట్‌ను సందర్శించి పరిశీలించింది. ఈ క్రషింగ్ యూనిట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేనల్లుడు రమేష్ రెడ్డి అనుచరులకు సంబంధించినదిగా ఆరోపణలు ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ నాయకులు అక్కడ జరుగుతున్న పలు అక్రమాలను బయటపెట్టారు. ఈ ఫ్యాక్ట్ ఫైండింగ్ టీమ్‌లో ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ కుమార్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ పట్లొళ్ల కార్తీక్ రెడ్డి, ఎస్సీ/ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డా. ఎర్రోళ్ల శ్రీనివాస్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్ గౌడ్, టీఎస్ఎండీసీ మాజీ చైర్మన్ డా. మన్నె క్రిషాంక్, తెలంగాణ వైల్డ్‌లైఫ్ బోర్డు మాజీ సభ్యుడు ఎస్. రాఘవేందర్, ఫైనాన్స్ కమిషన్ మాజీ సభ్యుడు జి. శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకుడు అభిలాష్ రంగినేని సభ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల మానస హిల్స్ ప్రాంతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన బినామీల పేరుతో నడుస్తున్న రాఘవ కన్స్ట్రక్షన్స్ క్రషింగ్ యూనిట్‌ను పరిశీలించి అక్కడ జరుగుతున్న అక్రమాలను బయటపెట్టామని గుర్తు చేశారు. అక్కడ కనిపించిన దృశ్యాలు 'కేజీఎఫ్' సినిమాను తలపించాయని, ఇప్పుడు నియోపోలిస్ ప్రాంతంలో కనిపిస్తున్న దృశ్యాలు దానికంటే ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. భాగ్యలక్ష్మి మినరల్స్ క్రషింగ్ యూనిట్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతి తప్ప ఇతర శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఆరోపించారు. అయినప్పటికీ ఈ యూనిట్‌లో భారీ స్థాయిలో క్రషింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిపారు. నెలకు మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల వరకు ఆదాయం వస్తోందని, ఆ మొత్తం ముఖ్యమంత్రి బంధువుల జేబుల్లోకి వెళ్తోందని విమర్శించారు. జీవో 111 పరిధిలో సాధారణ ప్రజలు చిన్న ఇల్లు కూడా నిర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వని అధికారులు, అదే ప్రాంతంలో 17 ఎకరాల్లో భారీగా క్రషింగ్ జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అధికార యంత్రాంగం పాలకులతో కుమ్మక్కైందా అని నిలదీశారు. మూడు ఆధునిక క్రషర్లతో గుట్టలను కొల్లగొడుతూ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. పర్యావరణ విధ్వంసం జరుగుతున్నా జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి (పి సి బి), మైనింగ్ శాఖలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పదిహేడు ఎకరాల భూమిని నామినేషన్ పద్ధతిలో ఎలా కేటాయించారని, ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఈ క్రషింగ్ యూనిట్ నుంచి తీసిన కంకరనే చుట్టుపక్కల నిర్మాణాలకు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఫత్వా జారీ చేశారనే సమాచారం ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను ఏటీఎంలా ఉపయోగించుకుంటూ ఢిల్లీకి కప్పం కడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ అక్రమాలపై ప్రభుత్వం స్పందించకపోతే కోర్టులను ఆశ్రయిస్తామని, అవసరమైతే గ్రీన్ ట్రిబ్యునల్‌ను కూడా సంప్రదిస్తామని స్పష్టం చేశారు.

# యుద్ధం అక్కడ... కష్టాలు ఇక్కడ

● వంటగదిలో గ్యాస్ మంట ● ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రస్తుతం సామాన్యుడి వంటగదిలో గ్యాస్ మంట పుట్టిస్తోంది. గత కొద్ది రోజులుగా గ్యాస్ సిలిండర్ బుక్ చేసినా సకాలంలో రాకపోవడం, మరోవైపు ధరలు అమాంతం పెరగడం చూస్తుంటే వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. అసలు ఆంధ్రప్రదేశ్‌లో గ్యాస్ కొరత నిజంగా ఉందా? లేక ఇది కృత్రిమంగా సృష్టించిన మాయాజాలమా? దీనికి అంతర్జాతీయ యుద్ధ మేఘాలకు ఉన్న సంబంధం ఏంటి? ఇరాన్ మరియు ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధం మన వంటగదిపై నేరుగా ప్రభావం చూపుతోంది. దీనికి ప్రధాన కారణం 'హోర్ముజ్ జలసంధి' భారతదేశం తనకి కావాల్సిన ఎల్పీజీలో దాదాపు 60 శాతానికి పైగా గల్ఫ్ దేశాల నుండే దిగుమతి చేసుకుంటుంది. యుద్ధం కారణంగా ఈ సముద్ర మార్గంలో నౌకల రాకపోకలకు అంతరాయం కలగడం, బీమా ధరలు పెరగడం వల్ల గ్యాస్ సరఫరా గొలుసు దెబ్బతిన్నది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడంతో పాటు ఎల్పీజీ లభ్యత తగ్గింది.

**ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు**

ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాయి. ముఖ్యంగా గృహ వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు కొన్ని కీలక మార్పులు చేశాయి. 25 రోజుల గ్యాప్ నిబంధన: గ్యాస్ సిలిండర్లను ప్రజలు ముందే స్టాక్ పెట్టుకోకుండా ఉండేందుకు, ఒక బుకింగ్‌కు మరియు తదుపరి బుకింగ్‌కు మధ్య కనీసం 25 రోజుల సమయం ఉండాలని నిబంధన విధించారు. డొమెస్టిక్ గ్యాస్‌కే ప్రాధాన్యత: రిఫైనరీల నుండి వచ్చే గ్యాస్‌ను హోటళ్లు, ఇతర వ్యాపార అవసరాలకు కాకుండా, కేవలం ఇళ్లకే సరఫరా చేయాలని ఆదేశించారు. దీనివల్ల కమర్షియల్ గ్యాస్ ధరలు దాదాపు 144 రూపాయల వరకు పెరగగా, గృహ వినియోగ గ్యాస్ సరఫరాలో కొంత జాప్యం జరుగుతోంది.

**ఏపీలో పరిస్థితి ఏంటి?**

ఆంధ్రప్రదేశ్‌లో గ్యాస్ కొరత లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

విశాఖపట్నం హెచ్‌పీసీఎల్ రిఫైనరీ మరియు మంగళూరు పైప్‌లైన్ ద్వారా రాష్ట్రానికి నిరంతర సరఫరా జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. అయితే, బుకింగ్ చేసినా వారం రోజుల వరకు సిలిండర్లు రాకపోవడానికి కారణం క్షేత్రస్థాయిలో ఉన్న రవాణా సమస్యలు మరియు పెరిగిన డిమాండ్ అని తెలుస్తోంది.

కొరత ఉందనే సాకుతో కొన్ని చోట్ల బ్లాక్ మార్కెట్ దందా కూడా మొదలైనట్లు సమాచారం. గ్యాస్ ఏజెన్సీలు లేదా డెలివరీ బాయ్స్ ద్వారా కృత్రిమ కొరతను





సృష్టించి, ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలో విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేపడుతున్నాయి. అక్రమాలకు పాల్పడితే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

**వినియోగదారులు ఏం చేయాలి?**

ప్రస్తుతానికి గ్యాస్ సరఫరాలో కొంత ఆలస్యం జరగడం వాస్తవమే అయినా, అది తాత్కాలికమేనని నిపుణులు చెబుతున్నారు.

ప్రజలు ఆందోళన చెంది అధికంగా బుక్ చేయవద్దని, ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటించాలని కోరుతున్నారు.

గ్యాస్ సరఫరాలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత ఏజెన్సీకి లేదా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయడం ఉత్తమం. యుద్ధం వల్ల అంతర్జాతీయ సరఫరాలో ఆటంకాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం స్థానిక ఉత్పత్తులను పెంచి సర్దుబాటు చేస్తోంది. కాబట్టి వినియోగదారులు వదంతులను నమ్మకుండా ఓపిక పట్టాల్సిన సమయం ఇది.

# రూ.20 లక్షల కోట్ల జీఎస్‌డీపీ లక్ష్యం

● 15 శాతం వృద్ధి సాధించాలి ● బిలియనీర్ల కోసం కాదు.. పేదల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం

● సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేయాలని దిశానిర్దేశం ● భూ వివాదాలు లేకపోతే 70% సమస్యలు తగ్గుతాయని వ్యాఖ్య ● కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : 'వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగంలో కేపీఐలు మెరుగు పడాలి. రూ.20 లక్షల కోట్లకు స్థూల ఉత్పత్తి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 15.1 శాతం మేర వృద్ధిరేటు లక్ష్యాన్ని కూడా సాధించేలా చర్యలు చేపడుతున్నాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.ప్రభుత్వం బిలియనీర్ల కోసం పని చేయడం లేదని.. పేదల కోసం పని చేస్తోందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి. ఎక్కడా చిన్న పొరపాటు కూడా దొర్లకుండా పారదర్శకంగా అమలు చేయాలి అని దిశానిర్దేశం చేశారు.

ఐటీ, క్వాంటం, ఏఐ వంటి రంగాల్లో కొత్త టెక్నాలజీలు, ల్యాబులు ఏర్పాటు చేస్తున్న తరహాలోనే.. వ్యవసాయానికి మరింత ఊతమిచ్చేలా అలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ క్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేద్దామని సీఎం ప్రకటించారు. రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సమావేశం బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగానికి ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజల్లో ప్రచారం కల్పించాలని.. అలాగే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ఇదే సందర్భంగా ఇటీవల జరిగిన వివిధ ఘటనలపై సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వేట్లపాలెం బాణాసంచా పేలుళ్లు, శ్రీకాకుళంలో డయేరియా, రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనల్లో అధికార యంత్రాంగం అలక్ష్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పేదల కోసమే కూటమి ప్రభుత్వం**

ప్రభుత్వం బిలియనీర్ల కోసం పని చేయడం లేదని.. పేదల కోసం పని చేస్తోందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'ప్రతీ మూడు నెలలకూ పాలనా అంశాలపై సమీక్ష చేసుకుని ముందుకు వెళ్తున్నాం. ఉన్న పరిమిత వనరులతోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్సు చేస్తున్నాం.గతంలో కార్యాలయాల్లో కూర్చుని ఫైల్స్ రాసే పరిస్థితి నుంచి వర్చువల్ పని విధానాన్ని తీసుకువచ్చాం. గడచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకువచ్చాం. ప్రభుత్వం తెచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి. వీటి అమలులో ఉదాసీనత వద్దు'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.'2047 స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా తెచ్చిన 10 సూత్రాలు అమలు చేస్తే సుపరిపాలన అందించేందుకు వీలవుతుంది. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలి. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి. ఎక్కడా చిన్న పొరపాటు కూడా దొర్లకుండా పారదర్శకంగా అమలు చేయాలి. 13 తేదీన అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులు విడుదల చేస్తున్నాం. కేంద్రం ఇచ్చే వాటితో పాటు రాష్ట్రం కూడా రైతుల ఖాతాల్లో మిగతా సొమ్ము జమ చేస్తుంది. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా వేర్వేరు ప్రతినిధులు రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సమర్థంగా తీసుకెళ్దాం. ప్రజల్లోకి వెళ్లి... ఈ పథకం గురించి చెప్పాలి.. డబ్బులు విడుదల చేస్తున్నామని వివరించాలి. ఖరీఫ్ సాగు కోసం మే 15 తేదీన నీటిని విడుదల చేస్తున్నాం.సీజన్‌లో ముందుగానే నీరు ఇస్తాం. మే 15 నుంచే సాగుకు సిద్ధం అవుదాం. ఏఐ అగ్రానమిస్ట్ సేవలు కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ వ్యవసాయ దారుడికి



ఏఐ అగ్రానమిస్ట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలి'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

**భూ వివాదాలు లేకుంటే 70 శాతం సమస్యలు తీరినట్టే**

'ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తాం. జూన్ నెలలో మరికొన్ని ఇళ్లను లబ్ధిదారులకు ఇస్తాం. ఇల్లు, ఇంటి జాగా కూడా మూడేళ్లలో ఇవ్వాల్సి ఉంది. ఇంద్ర ధనస్సు పేరిట దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు మరికొన్ని కార్యక్రమాలు అమలు చేయబోతున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.'గత పాలనలో ట్రూ ఆప్ పేరిట విద్యుత్ చార్జీల భారం వేశారు. తొలిసారి ట్రూ డౌన్ చేశాం. రూ.4,600 కోట్ల భారాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తోంది. ఈ ఏడాది 39 పైసల మేర విద్యుత్ కొనుగోలు ధర తగ్గిస్తాం. కుసుమ్ కింద 3 లక్షల పంప్ సెట్లు ఇస్తున్నాం. సబ్ స్టేషన్ యూనిట్ గా మైక్రో గ్రిడ్ ఏర్పాటుతో పాటు ప్రోజ్యూమర్ కాన్సెప్టును సమర్థంగా అమలు చేయాలి. విద్యుత్ ఉత్పాదన ఓ సంపాదనా మార్గంగా మారాలి. విద్యుత్ వినియోగదారులు.. విక్రయదారులుగా మార్చేలా రూపొందించిన ప్రణాళికను సక్సెస్ చేయాలి. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ కింద 1.12 లక్షల మంది మహిళా మైక్రో ఎంట్రప్రెన్యూర్లను తయారు చేశాం. వచ్చే ఏడాదికి 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేలా లక్ష్యంగా పెట్టుకున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

# ఆ సంస్కృతి మీరే మొదలు పెట్టారు

### కేటీఆర్‌కు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్ట్రాంగ్ కౌంటర్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. మాజీ మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

తెలంగాణలో రాజకీయ ఫిరాయింపులకు బీజం వేసింది కేసీఆర్ కాదా? గతంలో ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకోవడమే కాకుండా, ఏకంగా మంత్రులను చేసిన చరిత్ర మీది కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై విమ్మలు చేసే ముందు బీఆర్ఎస్ గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని ఎమ్మెల్సీ దయాకర్ అన్నారు. జాతీయ స్థాయి నాయకుడైన రాహుల్ గాంధీపై కేటీఆర్ చేస్తున్న సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులు తెలంగాణలో మొదలు పెట్టింది కేసీఆర్.

జాతీయ స్థాయి నాయకుడైన రాహుల్ గాంధీపై కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగినవి కావు.

ఎక్కడో ఉన్న రాహుల్ గాంధీ ముచ్చట మీకెందుకు. ఒకప్పుడు ఎమ్మెల్యేలను మీ పార్టీలో చేర్చుకొని ఏకంగా మంత్రులను చేసిన సంస్కృతి మీది. మీ నాయకత్వం నచ్చకనే 10 మంది బయటికి వచ్చారు.

కడియంతో పాటు పది మంది ఎమ్మెల్యేలను ప్రాధేయపడి మీ పార్టీలోకి ఆహ్వానించు. హరీష్ రావు, కేటీఆర్ మధ్య అంతర్గత గొడవ వల్ల పార్టీలో ఉండలేక పోతున్నామని మీ పార్టీ నేతలు చెబుతున్నారు. మీ పార్టీపై ఎవరికీ నమ్మకం లేదు..



బయటికి వెళ్లిన వాళ్లను మళ్లీ మీ పార్టీలో తెచ్చుకోగలరా? గతంలో కాంగ్రెస్ శాసన సభ పక్షాన్ని బీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎక్కడ ఉన్నావు. ఇప్పుడు నువు మాట్లాడే వాళ్ళు కాంగ్రెస్, తెలుగుదేశం నుండి నీ పార్టీలోకి వచ్చిన వాళ్ళు కాదా..! ప్రజలకి ఇబ్బంది ఐతే స్పందించే గుణం ప్రతిపక్షాలకి ఉండాలి..! అబద్ధపు రాజకీయ ప్రచారాలు కాదు' అని అన్నారు.

## ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్.. తెలంగాణకు మచ్చ

● ఫిరాయింపులకు తెలంగాణని అడ్డాగా మార్చేసారు


● రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ అభివర్ణించారు. ఇది చీకటి రోజు అని పేర్కొన్నారు. బుధవారం పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు దానం, కడియం శ్రీహరిల పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం విచారించారు అనంతరం ఆ పిటిషన్లను ఆయన కొట్టేశారు. ఈ వ్యవహారంపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ న్యూఢిల్లీలో స్పందించారు. ఈ వ్యవహారం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు సైతం ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపులకు నిర్వచనం ఏమిటంటూ సందేహం వ్యక్తం చేశారు. ఒకరు ఎంపీగా పోటీ చేశారని.. ఇంకొకరు ఎన్నికల్లో ప్రచారం చేశారని గుర్తు చేశారు. గతంలో నైతిక విలువలతో అటల్ బీహార్ వాజపేయి రాజీనామా చేసి, ప్రజల్లోకి వెళ్లి ఎన్నికల్లో గెలిచారని సోదాహరణగా వివరించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడం తెలంగాణ రాష్ట్రానికి మచ్చ అని అభిప్రాయపడ్డారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ హోల్‌సేల్‌గా.. నేడు కాంగ్రెస్ పార్టీ రిటైల్‌గా వ్యవహరించిందని వ్యంగ్యంగా అన్నారు. రాహుల్ గాంధీకి ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం ఉంటే.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ విధానంపై స్పందించాలని అభిప్రాయపడ్డారు. శాసనసభ స్పీకర్ వ్యవస్థకు మచ్చ తెచ్చే విధంగా వ్యవహరించారని విమర్శించారు. దేశానికి తలవంపులు తెచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఉందన్నారు. ఇంత గుడ్డిగా వ్యవహరించడం దేని కోసమని సందేహం వ్యక్తం చేశారు. రక్షకులు భక్షకులుగా మారారంటూ బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ ధ్వజమెత్తారు.




# అన్నమయ్య జలధార అందరికీ ఆదర్శ ధార!

● కరవు నేల జలసిరులు కురిపించిన కలెక్టర్ ● జిల్లాలో అంతర్గత కాలువల అనుసంధానం
● వట్టిపోయిన చెరువులకు జలకళ ● 5 నెలల్లో 8.59 మీటర్ల భూగర్భజల మట్టం పెరుగుదల
● కలెక్టర్ల సదస్సులో ఆదర్శపాఠంగా నిలిచిన అన్నమయ్య జిల్లా భగీరథ ప్రయత్నం ● పులకించిన ముఖ్యమంత్రి
● రాష్ట్రమంతటా జలధార అమలుకు ఆదేశం ● కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు సీఎం ప్రశంసల జల్లు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అన్నమయ్య జిల్లా.. సీమ కరవు జిల్లాలో అత్యంత కరవు ప్రభావిత జిల్లాల్లో ఒక్కటి. వార్షిక వర్షపాతం 743 సెంటీమీటర్లే. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. అలాంటి కరవు నేలపై ఆ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు ప్రధానంగా పలుకరించిన సమస్య నీటి సమస్య. ఈ సమస్యకు ఎలాగైనా చరమగీతం పాడాలని కలెక్టర్ వినూత్నంగా ఆలోచించారు. ఇది కరవు ప్రాంతమే అయినప్పటికీ ఉన్న నీటి వనరులు ఎందుకు పనికిరాకుండాపోయాయి అని ఆలోచించారు. జిల్లాలోని చెరువులు, కుంటులకు నీటి ప్రవాహాన్ని తీసుకొచ్చే కాలువలు కొన్ని చోట్ల పూడిపోవడం, కొన్ని చోట్ల పాడైపోవడం లాంటివి ఉన్నాయి. అంతేకాదు ఏ కాలువకు ఆ కాలువ విడిగా ఉండిపోయాయి. చెరువకు చెరువుకు మధ్య కాలువలకు కాలువలకు మధ్య అనుసధానం లేకపోవడంతో వర్షం పడినా నీరు వృథాగా నేలపాలై, జిల్లాలో కరవు పరిస్థితులు నెలకొంటున్న విషయాన్ని గమనించారు. జిల్లాలోని అన్ని నీటి ప్రవాహ కాలువలను అంతర్గతంగా అనుసంధాన కార్యక్రమానికి నడుంబిగించారు. యంత్రాంగాన్ని సమైఖ్యంగా ముందకు నడిపించారు. గ్రామాల్లో ప్రజలను కలిసి వారి భాగస్వామ్యం,వారికున్న స్థానిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, అధికారులు, ప్రజలు మమేకమై యుద్ద ప్రాతిపదికన
కాలువల అనుసంధానం చేశారు. ఆయా ఊర్లో అక్కడి చెరువు ఎందుకు ఎండిపోయింది, గతంలో ఆ చెరువుకు ఎక్కడి నుంచి నీళ్లు వచ్చేవి, ఇప్పుడు ఎందుఎకు రాలేదు అనేది స్థానికుల నుంచే సమాచారం తెలుసుకున్నారు. స్థానికులు, అధికారుల సహకారంతో ఆ చెరువకు గతంలో లాగా నీటి ప్రవాహం వచ్చి చేరేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి మండలానికి ఒక అధికారిని బాధ్యులుగా నియమించి ఆ మండలంలో నీటి వనరుల సద్వినియోగం చేసుకునే బాధ్తలను ఆ అధికారికి కట్టబెట్టారు. ప్రతి కుంటకు నీరు వచ్చి చేరేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. ఫలితంగా చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరుండేలా సాధించడంలో జిల్లా యంత్రాంగం విజయం సాధించింది. ఈ భగీరథ ప్రయత్నానికి జలధార అని పేరు పెట్టి యంత్రాంగం ముందుకు వెళ్లింది. అధికారులు, ప్రజలు అందరూ భాగస్వామ్యమై, శాఖలమధ్య అనుసంధానం సమన్వయంతో విజయవంతంగా చేపట్టారు. ప్రస్తుతం జిల్లాలో నీరులేని చెరువు కుంటలు లేని స్థితి సాధించారు. జిల్లా యంత్రాంగం చేసిన ప్రయత్నాలకు మొంథా తుపాను కూడా కలిసొచ్చింది. వీరు ముందుగానే ఈ పనులు చేసుకోవడంతో మొంథా తపానుతో వర్షపు నీరుతో కుంటలన్నీ నిండిపోయాయి.

**అట్టడుగు నుంచి అగ్రస్థానానికి**

నీటి నిర్వహణలో అట్టడుగున 25వ స్థానంలో ఉన్న అన్నమయ్య జిల్లా ఇప్పుడు జలధార కార్యక్రమంలో అగ్రస్థానాల్లోకి ఎగబాకింది. జలధార కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిరుపయోగంగా మారిన జల వనరులు, కాలువలు, కుంటలను బాగు చేయడంతో నీటి లభ్యత పెరిగింది. ఫలితంగా జిల్లాలో భూగర్భజల మట్టాలు కూడా గణనీయంగా పెరిగాయి. 2025 ఆగస్టులో 14.45 మీటర్ల మట్టంలో ఉన్న భూగర్భ జలాలు అదే ఏడాది డిసెంబరు నెలకు 5.86 మీటర్ల మట్టానికి చేరుకున్నాయి. భూగర్భ జలాల మట్టం పెరగడంతో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. పచ్చదనం పెరిగింది. ఫలితంగా జిల్లా స్థూల విలువ జోడింపు (జీవీఏ) కూడా పెరిగింది.

**రాష్ట్రమంతటా జలధార**

సీఎం అన్నమయ్య జిల్లా చేపట్టిన జలధార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో జలధార విజయగాథను జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా అధికారుల కృషి చూసి ముఖ్యమంత్రి పులకించిపోయారు. మంచి ప్రయత్నం చేశారు. ఎక్సలెంట్, ఇదో క క్లియర్ కేస్ స్టడీ, దీన్ని అందరూ అందిపుచ్చుకోవాలని కలెక్టర్లకు సూచించారు. అన్నమయ్య జిల్లా అత్యంత కరవు ప్రాంతాల్లో ఒకటని, అలాంటి చోట జిల్లా కలెక్టర్, అధికారులు వినూత్నంగా ఆలోచించి చేసిన చిన్న ప్రయత్నం పెద్ద ఫలితం ఇస్తోందని అభినందించారు. జలధారను అదే పేరుతో అడాప్ట్ చేసుకుంటున్నామని, రాష్ట్రమంతటా ఈ జలధార కార్యక్రమానికి అమలు చేస్తున్నట్లు సభలో ముఖ్యమంత్రి ప్రకటించారు. 90 రోజుల పాటు లేదా రాబోయే వర్షాకాలం వరకు అన్ని జిల్లాల్లో జలధార కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. తద్వారా నీటిని సమర్థంగా నిర్వహించుకోగలుగుతామన్నారు. తాను పట్టిసీమ ప్రాజెక్టుద్వారా 100 టీఎంసీల నీరు కృష్ణా డెల్టా ప్రాంతాలకు తీసుకొచ్చానని, తద్వారా శ్రీశైలం నుంచి నీరు రాయలసీమకు మళ్లించడం వీలైందని, దాంతో రాయలసీమంలో రూపురేఖలే మారిపోతున్నాయని చెప్పారు. ఇదే తరహాలో అన్నయ్య జిల్లాలో స్థానికంగా ఉన్న కాలువల అనుసంధానం విజయవంతంగా, తక్కువ ఖర్చుతో చేయడం అభినందనీయమన్నారు.

## పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● కౌలు రైతులకు రుణాలపై అడ్డంకులు తొలగించాలి ● పాలనలో డీప్ టెక్నాలజీ వినియోగం పెంచాలి ● స్వర్ణ గ్రామ, వార్డు సిబ్బందిని అవసరానికి అనుగుణంగా వినియోగించాలి ● రాష్ట్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల కోసం పట్టణాలు పోటీ పడాలి ● ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



ఏపీ స్టేట్ బ్యూరో. అమరావతి : రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న 6వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలోని పట్టణాలు, నగరాలు మరియు గ్రామాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కాకినాడ, సామర్లకోట వంటి పట్టణాల్లో పర్యటించినప్పుడు రహదారుల పక్కన చెత్త కనిపించిందని పేర్కొంటూ మున్సిపల్ కమిషనర్లు స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.రాష్ట్రంలోని పట్టణాలు, నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు సాధించేందుకు పోటీ పడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరిశుభ్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, పట్టణాలు మరియు గ్రామాలు ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని, ఆరోగ్య పరంగా కూడా అది ఎంతో ముఖ్యమని ముఖ్యమంత్రి తెలిపారు.పాలనలో డీప్ టెక్నాలజీ వినియోగం పెంచాలని సీఎం సూచించారు. స్మార్ట్ హెల్త్‌కేర్, వ్యవసాయం, విద్య, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో ఏఐ, బ్లాక్‌చైన్, ఐఓటీ, రోబోటిక్స్ వంటి సాంకేతికతలను ఉపయోగిస్తే తక్కువ ఖర్చుతో వేగంగా ఫలితాలు సాధించవచ్చని చెప్పారు.కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంలో ఎలాంటి నియమాలు అడ్డంకిగా ఉన్నా వాటిని గుర్తించి తొలగించాలని అధికారులకు ఆదేశించారు. వ్యవసాయాన్ని పునర్వ్యవస్థీకరించి పంటలతో పాటు హార్టికల్చర్, పశుసంవర్ధక రంగాలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు.స్వర్ణ గ్రామాలు, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది సేవలను అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా ఆర్ ఉ బి, ఆరోగ్య, మున్సిపల్ శాఖలు ఈ సిబ్బంది సేవలను సమర్థంగా ఉపయోగించుకోవాలని చెప్పారు. సిబ్బంది బదిలీలు సిఫార్సుల ఆధారంగా కాకుండా అవసరానికి అనుగుణంగా జరగాలని స్పష్టం చేశారు.ప్రతి జిల్లాలో హెచ్‌ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాలను పెంచాలని సీఎం సూచించారు. జిల్లా స్థాయిలో ఆర్టీజీఎస్ కేంద్రం ఏర్పాటు చేసి పనితీరును విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అర్హతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కూడా పేర్కొన్నారు.ఈ నెల 16, 17, 18 మరియు 23, 24, 25 తేదీల్లో "రైతు కోసం మీ కార్యక్రమం" నిర్వహించాలని తెలిపారు. యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు రైతులకు ప్రోత్సాహకంగా నానో యూరియా ఉచితంగా అందించే అవకాశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు.

# కాలుష్యాన్ని నియంత్రించాలి

● పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి ● కరీంనగర్ డంపింగ్ యార్డు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్
● ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన చెత్త కుప్పలు - త్వరలో తరలింపు ప్రక్రియ ప్రారంభం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కరీంనగర్ పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న డంపింగ్ యార్డును రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. డంపింగ్ యార్డు వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. ఇటీవల చొప్పదండి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ ప్రజలకు హామీ ఇస్తూ డంపింగ్ యార్డును శాశ్వతంగా తరలిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెద్ద నగరాల్లో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ పెద్ద సమస్యగా మారిందన్నారు. గతంలో కేంద్ర మంత్రి కట్టర్ కరీంనగర్ కు వచ్చినప్పుడు కూడా డంపింగ్ యార్డు వల్ల ప్రజలకు కలుగుతున్న అనారోగ్య సమస్యల గురించి వివరించి, దానిని తరలించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి చొప్పదండి పర్యటనలో జిల్లా నాయకులు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, సభా వేదికపై నుంచే డంపింగ్ యార్డును తరలిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కరీంనగర్ నుంచి తరలించే డంపింగ్ యార్డును వరంగల్--కరీంనగర్ మధ్యలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. రెండు నగరాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డంపింగ్ యార్డు నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో వెస్ట్ మేనేజ్మెంట్ విషయంలో గతంలో సరైన చర్యలు తీసుకోలేదని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డంపింగ్ యార్డు పరిస్థితులను స్వయంగా పరిశీలించామని తెలిపారు. డంపింగ్ యార్డులో రోజూ వచ్చే చెత్తను ఎలా తరలించాలి, ఇప్పటికే పేరుకుపోయిన వ్యర్థాలను ఎలా తరలించాలనే దానిపై ప్రత్యేక విధానం రూపొందిస్తామని చెప్పారు. చెత్త తరలింపులో సహకరించేందుకు ఒక స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చిందని వెల్లడించారు. డంపింగ్ యార్డు కారణంగా కరీంనగర్ ప్రజలు శ్వాసకోశ సమస్యలు సహా అనేక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 40 సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తను ఒక్కరోజులో తరలించడం సాధ్యం కాదని, అయితే ఏడాది లోపే పూర్తిస్థాయిలో తరలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి డంపింగ్ యార్డు తరలింపుకు కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్పొరేటర్ అంజన్ కుమార్, పలువురు కార్పొరేటర్లు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఏపీ టూరిజం రంగంలో కొత్త యుగం

● ఏపీని ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం
● రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ముంబైలో జరుగుతున్న 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఐఎఎపిఐ ) ఎక్స్‌పో రెండో రోజు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరోస్ ఇన్నోవేషన్ బృందంతో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చలు జరిపారు.ప్రపంచంలోనే తొలి 'కల్చరల్ ఏఐ' ఎకోసిస్టమ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే 'లార్జ్ కల్చరల్ మోడల్స్' అభివృద్ధిపై చర్చలు జరిగాయని వెల్లడించారు.ఇకపై దేవాలయాలు, వారసత్వ కట్టడాల్లో పర్యాటకులకు డిజిటల్ ఇమర్సివ్ అనుభవాలు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. సాంకేతిక విప్లవంతో టూరిజం రంగాన్ని కొత్త దిశగా తీసుకెళ్తూ, రాష్ట్ర వారసత్వ సంపదకు డిజిటల్ అందాన్ని జోడించనున్నట్లు తెలిపారు.క్రియేటర్ ఎకానమీ ద్వారా ఆంధ్రప్రదేశ్ యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ అవకాశాలు లభించేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఏపీ టూరిజం రంగం గ్లోబల్ లీడర్‌గా ఎదగబోతోందని అన్నారు.అదే విధంగా కళాకారులు, డిజిటల్ క్రియేటర్లకు భారీ అవకాశాలు కల్పించే 'ఆరెంజ్ ఎకానమీను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. టెక్నాలజీ మరియు సంస్కృతి కలయికతో కొత్త ఆర్థిక అవకాశాలు సృష్టించబడతాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

## స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలపై ప్రభుత్వం దూసుకుపోతోంది



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన 6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు. 2019-2024 మధ్యకాలంలో రాష్ట్రంలో భారీ నష్టం జరిగిందని ఆయన అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినా ప్రభుత్వం 50 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. ఇదే పనిలో నిమగ్నమై ఉండటంతో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ సమావేశానికి హాజరు కాలేకపోయారని చెప్పారు.గత 20 నెలల్లో రాష్ట్రంలో 6.3 లక్షల ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా 165 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.దానికి అనుగుణంగా సైన్డ్ ల్యాండ్స్ చట్టంలో సవరణలు చేశామని తెలిపారు. ఈ సవరణలతో స్వచ్ఛమైన ఇంధన ప్రాజెక్టులకు భూములు లీజ్ ఇవ్వడానికి అవకాశం కలుగుతుందని, దీనివల్ల పంట భూములు మరియు పోడి భూముల రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు.రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను బుల్లెట్ స్పీడ్‌లో భూమి మీదకు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. గవర్నెన్స్ వేగాన్ని మరింత పెంచాలని సూచించారు.జిల్లా కలెక్టర్లు ప్రజల అభిప్రాయం 90 శాతం సానుకూలంగా ఉండేలా పనిచేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్, సిబ్బంది సేవలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.హెరిటేజ్ భూముల రిజిస్ట్రేషన్‌ను తక్కువ ఫీజులతో చేయగల అవకాశంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదిలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి యంత్రాంగం సమర్థంగా పనిచేస్తోందన్నారు. పట్టాదార్ పాస్‌బుక్స్‌ను యుద్ధ ప్రాతిపదికన పంపిణీ చేస్తున్నామని చెప్పారు.వెబ్‌ల్యాండ్ లో నమోదైన 1.95 కోట్ల ఎకరాల భూమి వివరాలను 22ఏ జాబితాలో నమోదు చేశామని తెలిపారు. దీనిపై సీసీఎల్ఏ త్వరలో ఎస్.ఓ.పి విడుదల చేయనున్నారని చెప్పారు. దీంతో 22ఏ జాబితాలో ఉన్న భూముల వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించబడతాయని, భూ సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు.భూ స్వాధీనం పనులు చూసే అధికారులను ఇతర పనులకు మార్చవద్దని సూచించారు.

# గద్దర్ అవార్డ్స్‌తో ప్రజా కళలకు సీఎం రేవంత్ రెడ్డి పట్టం


**తెలంగాణ సాంస్కృతిక సారథి డాక్టర్ జీవీ వెన్నెల**



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కళ కళ కోసమే కాదు, కళ సామాజిక ప్రయోజనం కోసం, పాట వినోదం కోసం కాదు పాట సమాజ హితం కోసం ప్రజల ఆశలు ఆవేదనలే పల్లె పాటలు వారి మనసు ఆకలింపు చేసుకోవడానికి కళ ఒక శక్తివంతమైన ఆయుధం. ప్రజా సంస్కృతికి గొంతుక అయిన గద్దర్, ఆధునిక తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో అత్యంత ప్రభావశీల వ్యక్తుల్లో ఒకరు గద్దర్. తన పాటల ద్వారా, ప్రదర్శనల ద్వారా గద్దర్ సంప్రదాయ జానపద కళలను సామాజిక, రాజకీయ వ్యక్తీకరణకు శక్తివంతమైన మాధ్యమంగా మార్చాడు. జననాట్యమండలితో అనుబంధంగా ఉంటూ బుర్రకథ, ఒగ్గుకథ, జముకుల కథ వంటి జానపద కళారూపాలను వినియోగించి అణగారిన వర్గాల జీవితం, వ్యవసాయ కూలీల కష్టాలు, సామాజిక పోరాటాల కథలను ప్రజలకు వినిపించాడు. గద్దర్ ప్రదర్శనలు ఆట, పాట, మాటల సమ్మేళనంగా ఉండేవి. పురాణ కథలకే పరిమితం కాకుండా భూమిలేని రైతులు, పేదరికం, కుల వివక్ష, దోపిడీ వంటి సమస్యలను తన కళారూపాల ద్వారా ప్రతిబింబించాడు. అతని పాటలు నిరసన స్వరాలుగా మారి విప్లవోద్యమాలకూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికీ సాంస్కృతిక చైతన్యాన్ని కల్పించాయి.తెలంగాణ భాషావ్యాప్తికి, సాంస్కృతిక వికాసానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందనడానికి నిదర్శనం గత రెండు సంవత్సరాలుగా ప్రజాకళలకు, కళాకారులకు, రచయితలకు, దర్శకులకు, సాంకేతిక నిపుణులకు ప్రజా యుద్ధ నౌక గద్దర్ పేరుతో అవార్డులు ఇస్తున్నారు. తెలంగాణలో దశాబ్దాల కాలం నుంచి భాషా, సాహిత్య సాంస్కృతిక, కళల పరిరక్షణకు కృషి చేస్తున్న సంస్థల సేవలను మరింత ప్రోత్సహించేందుకు ఆయా సంస్థలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేయూత ఇస్తూ రేవంత్ రెడ్డి "సృజనాత్మక శతాబ్దం - వినోదరంగ భవిష్యత్తు" అని తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో చిత్రరంగం అత్యున్నత స్థాయికి వెళ్లాలని కాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ ఎదుగుదలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేస్తూ భారత్ ఫ్యూచర్ సిటీలో స్టూడియోలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రపంచ స్థాయిలో ఐరిష్ రచయిత నాటకరంగ పితామహుడు ఆస్కార్ విల్డ్, భారతీయ సినిమాకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, స్వర్ణ కమలం అవార్డు, అస్సాంలో ప్రముఖ గాయకుడు భూపేన్ హజారికాకు ఇచ్చిన గౌరవం ఎంత గొప్పదో, తెలంగాణ ప్రభుత్వం కూడా గద్దర్‌కు అదే స్థాయి గౌరవాన్ని ఇచ్చింది. గద్దర్ పేరుతో అవార్డులు ఇవ్వడం కళాకారులకు మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమాలకు కూడా గౌరవం ఇచ్చినట్టే. కొత్త కథలు, కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఆలోచనతో గద్దర్ అవార్డులు ముందుకు రావడం అభినందనీయం, ఇదే సమయంలో సినీ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలంటే ఇతర రాష్ట్రాలు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా మళ్లీ నంది అవార్డులు కాకుండా ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావ భావలతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుర్రకథా ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించిన బుర్రకథా పితామహుడు నాజర్, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు పేరుతో ముందుకు రావాలి . " గండపెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు" అని తన కళను ప్రజా ప్రయోజనానికే అంకితం చేసిన ప్రజా కళాకారుడు నాజర్. గద్దర్ పేరుతో పురస్కారాలు ఇవ్వడం తెలంగాణ సంస్కృతి, పోరాట చరిత్రకు గుర్తింపుగా నిలుస్తుంది. విప్లవ గాయకుడు గద్దర్ ప్రజల మనసుల్లో ఎప్పటికీ జీవించే వ్యక్తి, ఆయన పాటలు సమాజంలో చైతన్యం తీసుకు వచ్చాయి, ప్రజలను ఆలోచింపజేశాయి. తెలంగాణ గడ్డపై ప్రతి ఇంట్లో గద్దర్ వంటి స్ఫూర్తిదాయక వ్యక్తులు ఉంటారు, అలాంటి మహానుభావుడి పేరుతో ప్రభుత్వం అవార్డులు ఏర్పాటు చేయడం నిజంగా గర్వకారణమం. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చే నంది పురస్కారాలకు ఎంతో గౌరవం ఉండేది, కానీ గత కొన్ని సంవత్సరాలుగా అవి నిలిచిపోవడంతో సినీ పరిశ్రమలో ఒక లోటు ఏర్పడిందని అన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం గద్దర్ పేరుతో అవార్డులు ప్రారంభించడం ద్వారా కళాకారులకు మళ్లీ ప్రోత్సాహం కలిగింది . ముఖ్యంగా ఈ అవార్డుల్లో యువతరానికి ఎక్కువ అవకాశాలు రావడం సంతోషకరం అని తెలంగాణ ప్రజానీకం భావిస్తుంది. ఉత్తమ నటులు, దర్శకులు, గాయకులు వంటి అనేక విభాగాల్లో కొత్త ప్రతిభ కనిపించడం సినీ రంగానికి మంచి సంకేతమని అని భావించి ఉత్తమ పౌర సమాజ నిర్మాణంలో చిత్ర పరిశ్రమకు అంటూ ఒక అర్థం ఉండాలని భావించి కళాకారులను అభివృద్ధి వైపు సంక్షేమం వైపు ఆలోచించడానికి వారిని అభినందించడానికి గద్దర్ ని స్ఫూర్తిగా తీసుకోవడం ప్రజాకళలకు పట్టం కట్టడమే.

# చేనేత రుణమాఫీ నిధులు ఇస్తాం

● 16.9కోట్ల చేనేత రుణమాఫీ నిధులు విడుదలకై వినతి
● నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తెలంగాణ బ్యూరో, ప్రతినిది: రాష్ట్రంలో మిగిలిపోయిన చేనేత కార్మికుల రుణమాఫీ నిధులు 16.9 లక్షల కోట్ల రూపాయలు రేపే విడుదల చేయనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు చేనేత సమస్యలైన రుణమాఫీ నేతన్న భరోసానిధులు,తిఫ్ట్ ఫండ్ ప్రభుత్వ వాటా నిధులను విడుదల చేయాలని వ్యవసాయ చేనేత శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావును అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమ్మర్తపు మురళి మరియు అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్‌ల ఆధ్వర్యంలో బుధవారం సెక్రటేరియట్లో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగింది ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత రుణమాఫీ నిధులను జిల్లాలకు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

అంతేకాకుండా నేతన్న భరోసా కు మరియు తిఫ్ట్ ఫండ్ ప్రభుత్వ వాటాకు ఎన్ని నిధులు కావాలో నివేదిక పంపించాలని కోరారు చేనేత రుణమాఫీలో భాగంగా మొత్తం 49.90 కోట్ల రూపాయలు విడుదల చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పద్మశాలి సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు రేవంత్ రెడ్డికి ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చిక్క వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షులు తడక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పేరుతో జగన్ అబద్ధాల రాజకీయాలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో వ్యవసాయం, రైతుల సమస్యలపై ఎమ్మెల్యే వైఎస్ జగన్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరితమైనవని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా మండిపడ్డారు. రైతుల పేరుతో అబద్ధాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించడం జగన్‌కు అలవాటైపోయిందని ఆయన ఓ ప్రకటనలో ఘాటుగా విమర్శించారు.


గత ఐదేళ్లలో రైతు భరోసా పేరుతో పెద్ద పెద్ద మాటలు చెప్పిన జగన్, తన పాలనలోనే రైతులకు ఇవ్వాల్సిన అనేక చెల్లింపులను నిలిపివేసిన విషయం ప్రజలు మరిచిపోలేదని మంత్రి అన్నారు. ఇప్పుడు అదే విషయంపై నైతిక హక్కు ఉన్నట్లు మాట్లాడటం జగన్ రాజకీయ కపటత్వానికి నిదర్శనమన్నారు. రైతులకు న్యాయం చేయడంలో కూటమి ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందని చెప్పారు.

గత ప్రభుత్వ కాలంలో రైతు భరోసా పేరుతో రాష్ట్రం రూ.13,500 ఇస్తామని ప్రకటించినప్పటికీ రాష్ట్రం నుంచి కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చి, కేంద్రం ఇచ్చిన రూ.6,000ను
కలిపి మొత్తం రాష్ట్రం ఇచ్చినట్లుగా ప్రకటించారని ఆయన విమర్శించారు.
కూటమి ప్రభుత్వం సంవత్సరానికి రూ.20,000ను మూడు విడతలుగా అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రెండు విడతలుగా మొత్తం రూ.6,309.44 కోట్లు రైతు కుటుంబాలకు పంపిణీ చేశామని, ఈ నెల 13వ తేదీన మూడో విడత నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

## గ్రామానికో ఛాంపియన్ ఫార్మర్...

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయం పెంచాలనే లక్ష్యంతో చేపట్టిన 'మిషన్ హోప్' గురించి విజయనగరం కలెక్టర్ రామ సుందర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో వివరించారు. కేవలం వరి, మొక్కజొన్న పండించి నష్టపోతున్న సన్న, చిన్నకారు రైతులను అధిక లాభాలిచ్చే ఉద్యానవన పంటల వైపు మళ్లించేందుకు ఏకంగా 10 వేల ఎకరాల లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ఎలా మొదలుపెట్టామో ఆయన వివరించారు.

## మీడియా అక్రిడిటేషన్ సభ్యులుగా అస్కాని మారుతి సాగర్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులుగా టి యు డబ్ల్యూ జే పక్షాన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ప్రధాన కార్యదర్శి, జై తెలంగాణ టి వి, సి ఇ ఓ ఆస్కాని మారుతి సాగర్ ను నియమిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జర్నలిస్ట్ సంఘాలు ,,ప్రెస్ క్లబ్ నుండి సభ్యులుగా తీసుకుంటూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు వెలువరించింది. ఈ సందర్భంగా మారుతి సాగర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి జర్నలిస్ట్ కు అక్రెడిటేషన్ కార్డు వచ్చే విధంగా కమిటీ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. 252 జి ఓ ప్రకారం కార్డుల సంఖ్య తగ్గుతుండటంతో వాటిని పెంచే విషయంలో గాని, కేబుల్ జర్నలిస్టులకు రాష్ట్ర స్థాయిలో కార్డులు జారీ చేయించే విషయంలో గాని,డెస్క్ జర్నలిస్టులకు ఎడిషన్ ల వారీగా కార్డుల సంఖ్యను పెంచే విషయంలో ఒక సభ్యుడిగా ప్రభుత్వ పెద్దలతో చర్చించి అందరికీ న్యాయం జరిగే వరకు తన వంతు ప్రయత్నం చేస్తానని ప్రకటించారు. ఈ సభ్యుడిగా అవకాశం కల్పించే విషయంలో తనను ప్రతిపాదించిన టి యు డబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్డుల పెంపు విషయంలో న్యాయం జరగకపోతే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం తరపున ఉద్యమ కార్యాచరణ ఉంటుందన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC

మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ : మల్కాజిగిరి జోన్
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

**నిట్ నెం.13/EE-I/MKJZ/MMC/2025-26,** **తేది: 10-03-2026**

**పని పేరు:** మెయింటెనెన్స్ పనులు ఇతరములు - 2. **అంచనా వ్యయం (రూ. లక్షలలో) : 37.50 లక్షలు. బిడ్స్ సమర్పించుటకు ప్రారంభ తేది మరియు సమయం** : 11-03-2026 ఉ॥ 10.30 గం॥లకు. **బిడ్స్ సమర్పించుటకు ముగింపు తేది మరియు సమయం:** 16-03-2026 ఉ॥ 10.30 గం॥లకు. **అధికారి పేరు మరియు చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్: 9154796465,7995009098. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I,
మల్కాజిగిరి జోన్, MMC

DIPR.RO.No.16840-PP/CL/Advt/1/2025-26 , Dt: 11-03-2026

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## ఇరాన్ ఎందుకు తగ్గడం లేదు ?

ప్రస్తుతం పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం అత్యంత భయానకమైన మలుపులు తిరుగుతోంది. ఫిబ్రవరి 28, 2026న అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడిగా ఇరాన్‌పై జరిపిన భారీ దాడులతో ఈ పోరాటం మొదలైంది. ఈ దాడుల్లో ఇరాన్ అగ్ర నాయకత్వంతో పాటు ఆ దేశ అణు, క్షిపణి కేంద్రాలే లక్ష్యంగా నిలిచాయి. ఇరాన్ దీనికి ప్రతిస్పందనగా వందలాది క్షిపణులు, వేల సంఖ్యలో డ్రోన్లతో ఇజ్రాయెల్, దాని మిత్ర దేశాలైన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్‌లలోని లక్ష్యాలపై విరుచుకుపడుతోంది. ఇప్పటికే ఈ యుద్ధం కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు, ప్రపంచవ్యాప్తంగా ప్రయాణ, వాణిజ్య రంగాలు స్తంభించిపోయాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో కూడా ఇరాన్ యుద్ధాన్ని ఆపడానికి మొగ్గు చూపకపోవడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయి. ఇరాన్ తన మనుగడ కోసం, తన గౌరవాన్ని కాపాడుకోవడం కోసం ఈ పోరాటాన్ని చివరి వరకు కొనసాగించాలని నిర్ణయించుకుంది. ఆ దేశం చమురు నిల్వలను ఒక ఆయుధంగా వాడుకుంటూ ప్రపంచ దేశాలపై ఒత్తిడి తీసుకురావాలని చూస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో దాదాపు 20 శాతం వాటా ఉండే హార్ముజ్ జలసంధిని ఇరాన్ దాదాపుగా మూసివేసింది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. ఈ ధరల పెరుగుదల వల్ల చమురు గిరాకీ పెరిగి, దాని ద్వారా వచ్చే ఆదాయంతో యుద్ధం వల్ల కలిగే ఆర్థిక నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చని ఇరాన్ భావిస్తోంది. చమురు గిరాకీ పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తలెత్తుతోంది, దీనివల్ల అగ్ర దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలే ప్రమాదం ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు దిగివచ్చి తమపై ఉన్న కఠినమైన ఆర్థిక ఆంక్షలను ఎత్తివేస్తాయని ఇరాన్ అంచనా వేస్తోంది. ఒకవేళ యుద్ధం ఇప్పుడే ఆగిపోతే, తమకు జరిగిన నష్టానికి ఎలాంటి పరిహారం దక్కదని, పైగా తమ రక్షణ వ్యవస్థ మరింత బలహీనపడుతుందని ఇరాన్ భయపడుతోంది. అందుకే యుద్ధం ఎంత తీవ్రంగా సాగితే, అంతగా చమురు ధరలు పెరిగి ప్రపంచంపై తమ పట్టు పెరుగుతుందని వారు నమ్ముతున్నారు. అంతేకాకుండా, ఇరాన్ తన సిద్ధాంతాల పట్ల ఎంతో పట్టుదలతో ఉంది. తమ దేశ సార్వభౌమాధికారాన్ని సవాలు చేసిన శత్రువులకు తగిన బుద్ధి చెప్పడం ద్వారా మాత్రమే భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా అడ్డుకోవచ్చని వారు భావిస్తున్నారు. ఈ యుద్ధం వల్ల చమురు మార్కెట్లో ఏర్పడే అస్థిరతను ఉపయోగించుకుని, రష్యా వంటి ఇతర చమురు ఉత్పత్తి దేశాల మద్దతును కూడా ఇరాన్ కూడగట్టుకుంటోంది. సంప్రదింపుల ద్వారా లొంగిపోవడం కంటే, యుద్ధం ద్వారా తమ డిమాండ్లను నెగ్గించుకోవడమే సరైన మార్గమని ఇరాన్ పాలకులు భావిస్తున్నారు. ఇరాన్ అనుసరిస్తున్న ఈ మొండి వైఖరి వల్ల ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ అతలాకుతలం అవుతోంది, సామాన్య ప్రజలు ధరల భారంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఇరాన్ తన వ్యూహంలో భాగంగా కేవలం ప్రత్యక్ష యుద్ధానికే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే చమురు సరఫరా మార్గాలను తన అదుపులోకి తెచ్చుకుంది. ముఖ్యంగా పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని కీలక జలసంధుల ద్వారా జరిగే వాణిజ్యాన్ని అడ్డుకోవడం వల్ల ఐరోపా, ఆసియా దేశాలకు ఇంధన సరఫరా నిలిచిపోయింది. దీనివల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడమే కాకుండా, ప్రతి వస్తువు ధర ఆకాశాన్ని తాకుతోంది. ఇరాన్ ఆశిస్తున్నట్లుగానే ప్రపంచ దేశాలన్నీ ఈ ఆర్థిక భారాన్ని భరించలేక యుద్ధాన్ని ఆపాలని అమెరికాపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ ఒత్తిడిని ఆసరాగా చేసుకుని ఇరాన్ తనపై ఉన్న పాత ఆర్థిక ఆంక్షలన్నింటినీ పూర్తిగా ఎత్తివేయించుకోవాలని, తన అణు కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు పొందాలని పట్టుబడుతోంది.

యుద్ధం ఎంత కాలం సాగితే అంతగా చమురు నిల్వల కొరత ఏర్పడుతుంది, అప్పుడు ఇరాన్ వద్ద ఉన్న చమురు నిల్వలకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుంది. ఈ గిరాకీని ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుని ఇరాన్ తన శత్రువుల కూటమిని విడదీయాలని చూస్తోంది. ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చే దేశాలు ఇంధనం లేక ఇబ్బందులు పడితే, అవి క్రమంగా తమ మద్దతును ఉపసంహరించుకుంటాయని ఇరాన్ అంచనా వేస్తోంది. ఇరాన్ అనుసరిస్తున్న ఈ చమురు డిప్లొమసీ వల్ల ఇప్పటికే అనేక దేశాలు తమ విదేశాంగ విధానాలను పునఃసమీక్షించుకుంటున్నాయి. యుద్ధ క్షేత్రంలో సైనికుల కంటే, చమురు బావుల వద్ద జరుగుతున్న పరిణామాలే ఈ యుద్ధ గమనాన్ని శాసిస్తున్నాయి.

మరోవైపు ఇరాన్ తన మిత్ర దేశాలైన రష్యా, చైనా వంటి శక్తుల మద్దతుతో ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తోంది. యుద్ధం కొనసాగుతున్న కొద్దీ పశ్చిమ దేశాల ప్రభావం తగ్గి, తూర్పు దేశాల ఆధిపత్యం పెరుగుతుందని ఇరాన్ భావిస్తోంది. ఈ క్రమంలో చమురు ధరల పెరుగుదల వల్ల వచ్చే అదనపు లాభాలను తన సైనిక శక్తిని ఆధునీకరించుకోవడానికి, కొత్త రకం క్షిపణులను తయారు చేయడానికి ఉపయోగిస్తోంది. ఇరాన్ పాలకుల దృష్టిలో ఈ యుద్ధం కేవలం ఒక ప్రాంతీయ పోరు కాదు, ఇది ప్రపంచ దేశాల మధ్య ఉన్న అధికార సమతుల్యతను మార్చే ఒక గొప్ప అవకాశం. అందుకే ఎన్ని ప్రాణనష్టాలు జరిగినా, ఎన్ని దాడులు ఎదురైనా ఇరాన్ పట్టు వదలకుండా యుద్ధాన్ని కొనసాగిస్తోంది. ఇరాన్ తన వ్యూహంలో భాగంగా కేవలం క్షిపణులతోనే కాకుండా, ప్రపంచ ఆర్థిక మూలాలను దెబ్బతీసే ఆర్థిక యుద్ధాన్ని కూడా సమాంతరంగా నడుపుతోంది. అంతర్జాతీయంగా చమురు సరఫరా చేసే ఓడల పైన, చమురు క్షేత్రాల పైన దాడులు పెరగడం వల్ల బీమా కంపెనీలు తమ ఛార్జీలను విపరీతంగా పెంచేశాయి. దీనివల్ల చమురు రవాణా ఖర్చు పెరిగి, ప్రతి దేశంలోనూ పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. ఇరాన్ ఆశిస్తున్నట్లుగానే ఈ ధరల పెరుగుదల వల్ల ప్రపంచవ్యాప్తంగా అగ్ర దేశాల ప్రభుత్వాలపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ అంతర్గత ఒత్తిడి వల్ల ఆయా దేశాలు యుద్ధాన్ని త్వరగా ముగించాలని ఇజ్రాయెల్, అమెరికాలపై రాయబారాలు నెరుపుతున్నాయి.

చమురు గిరాకీని ఒక ఆయుధంగా వాడుకోవడం వల్ల ఇరాన్ ఆసియా ఖండంలోని పెద్ద దేశాల మద్దతును కూడా పరోక్షంగా పొందుతోంది. చమురు సరఫరా నిలిచిపోతే తమ పరిశ్రమలు మూతపడతాయని భయపడే దేశాలు, ఇరాన్‌తో చర్చలు జరపడానికి మొగ్గు చూపుతున్నాయి. ఇరాన్ ఈ అవకాశాన్ని వాడుకుని తన చమురును రహస్య మార్గాల ద్వారా లేదా ఇతర దేశాల సహకారంతో విక్రయిస్తూ యుద్ధానికి కావలసిన నిధుల ను సమకూర్చుకుంటోంది. యుద్ధం ఎంత సుదీర్ఘంగా సాగితే అంతగా ప్రపంచ ఇంధన నిల్వలు హరించుకుపోతాయని, అప్పుడు తమ వద్ద ఉన్న చమురు నిల్వలకు బంగారం కంటే ఎక్కువ ధర పలుకుతుందని ఇరాన్ అంచనా వేస్తోంది. ఈ ఆర్థిక లాభం కోసమే వారు ఎన్ని నష్టాలు ఎదురైనా పట్టువదలకుండా పోరాడుతున్నారు.

మరోవైపు ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి నిరూపించుకోవడానికి కూడా ఈ యుద్ధాన్ని వాడుకుంటోంది. తమ సొంత సాంకేతికతతో తయారు చేసిన డ్రోన్లు, క్షిపణులు అత్యాధునిక రక్షణ వ్యవస్థలను కూడా ఛేదించగలవని చూపించడం ద్వారా అంతర్జాతీయ ఆయుధ మార్కెట్లో తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలని చూస్తోంది. యుద్ధం ముగిసిన తర్వాత కూడా తమ దేశం ఒక బలమైన శక్తిగా నిలవాలని, మధ్యప్రాచ్యంలో ఏ నిర్ణయమైనా తమ ప్రమేయం లేకుండా జరగకూడదని ఇరాన్ పట్టుబడుతోంది. ఈ మొండితనం వెనుక కేవలం చమురు వ్యాపారమే కాదు, రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ రాజకీయాలను శాసించాలనే బలమైన ఆకాంక్ష కూడా దాగి ఉంది.

ఇరాన్ అనుసరిస్తున్న ఈ మొండి వైఖరి వెనుక కేవలం యుద్ధ కాంక్ష మాత్రమే కాకుండా, ప్రపంచ ఇంధన విపణిని శాసించాలనే లోతైన వ్యూహం కనిపిస్తోంది. చమురు ధరల పెరుగుదల ద్వారా అగ్ర దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీసి, వారిని చర్చల మేజా వద్దకు తీసుకురావడమే ఇరాన్ అసలు లక్ష్యం. యుద్ధం ఎంత సుదీర్ఘంగా సాగితే అంతగా ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత ఏర్పడుతుందని, తద్వారా తమ డిమాండ్లకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని ఆ దేశ పాలకులు గట్టిగా నమ్ముతున్నారు. సామాన్య ప్రజలపై ధరల భారం పడుతున్నప్పటికీ, తన మనుగడ , భౌగోళిక రాజకీయ ఆధిపత్యం కోసం ఇరాన్ చమురును ఒక శక్తివంతమైన ఆయుధంగా వాడుకుంటూ ఈ పోరాటాన్ని కొనసాగిస్తోంది.

# కేంద్ర కొలువుల్లో సామాజిక విప్లవం!




- ప్రత్యక్ష నియామకాలలో ఇతర వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు
- బడుగులకు పాలనా విభాగాల్లో పాలుపంచుకోవాలి అన్నదే ఈ రిజర్వేషన్ల ఆశయం
- పారదర్శకంగా నియామక ప్రక్రియ తో అర్హులైన ప్రతిభావంతులకు సరైన అవకాశాలు
- రాజ్యాంగబద్ధంగా ఉన్న పరిమితులను ఉల్లంఘించకుండానే రిజర్వేషన్ల పంపిణీ
- న్యాయస్థానం నిర్దేశించిన 50 శాతం గరిష్ట పరిమితికి అర శాతం తక్కువగా గా రిజర్వేషన్లు అమలు

తేజస్విని
హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు జరిగే ప్రత్యక్ష నియామకాలలో ఇతర వెనుకబడిన తరగతులకు కచ్చితంగా 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం లోక్‌సభ వేదికగా స్పష్టం చేసింది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం, వారిని అభివృద్ధి పథంలో నడిపించడం ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే అన్ని రకాల విభాగాల్లో ఈ కోటా తప్పనిసరిగా అమలవుతుంది. అట్టడుగు వర్గాలకు కూడా రాజ్యాంగపరమైన హక్కులు దక్కాలి, వారు కూడా పాలనా విభాగాల్లో పాలుపంచుకోవాలి అన్న ఆశయంతో ఈ రిజర్వేషన్ల విధానం రూపుదిద్దుకుంది. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు పరిపాలనలో తగిన ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. దీని ద్వారా దశాబ్దాలుగా వెనుకబడి ఉన్న వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి, సమాజంలో వారికి తగిన గౌరవం దక్కుతుంది.

**కేంద్ర కొలువుల్లో ఓబీసీ వాటా:**

కేంద్ర ప్రభుత్వం చేపట్టే ప్రత్యక్ష నియామకాలన్నింటిలో ఇతర వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేస్తున్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ బ్యాంకులు, ఇతర స్వయంప్రతిపత్తి గల సంస్థలలో ఏ ఉద్యోగ ప్రకటన వెలువడినా ఈ కోటా కచ్చితంగా పాటిస్తారు. నియామక ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడటంతో పాటు, అర్హులైన ప్రతిభావంతులకు సరైన అవకాశాలు దక్కేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఈ 27 శాతం కోటా అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు, ఇది కొన్ని కోట్ల మంది యువత కలలకు ప్రతిరూపం. గ్రామీణ ప్రాంతాల్లో సరైన వసతులు లేక ఇబ్బంది పడే వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఈ రిజర్వేషన్ల ద్వారా దేశ రాజధానిలోని కీలక విభాగాల్లో పనిచేసే అవకాశం పొందుతున్నారు. దీనివల్ల వారి సామాజిక హోదా పెరగడమే కాకుండా, వారి గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయి.

**యాభై శాతం గరిష్ట పరిమితి:**

మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్నది మన దేశ అత్యున్నత న్యాయస్థానం విధించిన కచ్చితమైన నిబంధన. ఈ నిబంధన ఎలా పూర్తవుతుందో చూస్తే మనకు ఒక స్పష్టత వస్తుంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ కులాలకు 15 శాతం, షెడ్యూల్డ్ తెగలకు 7.5 శాతం కోటా ముందు నుంచే అమలులో ఉంది. వీటికి తోడుగా ఇతర వెనుకబడిన తరగతులకు 27 శాతం కేటాయించారు. ఇవన్నీ ఒకచోట చేర్చితే మొత్తం 49.5 శాతం అవుతుంది. అంటే న్యాయస్థానం నిర్దేశించిన 50 శాతం గరిష్ట పరిమితికి ఇది కేవలం అర శాతం మాత్రమే తక్కువగా ఉంది. ఈ విధంగా రాజ్యాంగబద్ధంగా ఉన్న పరిమితులను ఉల్లంఘించకుండానే రిజర్వేషన్ల పంపిణీ శాస్త్రీయంగా జరుగుతోంది. ఇలా గరిష్ట పరిమితి విధించడం వల్ల సమాజంలో ఎవరికీ అన్యాయం జరగకుండా సమాన అవకాశాలు అందుతాయి.

**మండల్ కమిషన్ సిఫార్సులు:**

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి సామాజికంగా, విద్యాపరంగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ఎన్నో కమిషన్లను ఏర్పాటు చేశాయి. ఆ కమిషన్ల సిఫార్సుల మేరకు ఇతర వెనుకబడిన తరగతులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన వాటా దక్కాలన్న ఉద్దేశంతో ఈ 27 శాతం కోటాను నిర్దేశించారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుంది. గతంలో జరిగిన సామాజిక విశ్లేషణల ప్రకారం, ఓబీసీ వర్గాలకు ప్రభుత్వ పాలనలో తగిన ప్రాధాన్యత లేదని గుర్తించారు. అందుకే వారికి ఒక ప్రత్యేక గుర్తింపునిస్తూ, చట్టబద్ధమైన రక్షణ కల్పిస్తూ ఈ రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చారు. దశాబ్దాల పోరాటం తర్వాత సాధించుకున్న ఈ హక్కు నేడు ఎంతో మందికి జీవనాధారంగా మారింది.

**సమానత్వానికి పెద్దపీట:**

దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న వెనుకబడిన వర్గాలకు పరిపాలనలో సరైన భాగస్వామ్యం లేకపోతే ఆశించిన అభివృద్ధి సాధ్యం కాదు. అందుకే ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేసే ప్రతి వంద పోస్టులలో 27 పోస్టులను కచ్చితంగా వీరికి కేటాయించేలా చట్టాలు చేశారు. ఈ కోటా ద్వారా ఎంపికైన యువత తమ నైపుణ్యాలను ప్రదర్శించి దేశ ప్రగతిలో భాగస్వాములు అవుతున్నారు. ప్రతిభావంతులైన యువత వెనుకబడిన తరగతుల్లో ఎంతో మంది ఉన్నప్పటికీ, సరైన ప్రోత్సాహం లేక వారు వెనకబడిపోతున్నారు. ఈ రిజర్వేషన్లు వారికి ఒక ఊతకర్రలా పనిచేసి, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా చేస్తున్నాయి. ఇది కేవలం ఉద్యోగం ఇవ్వడం మాత్రమే కాదు, సమాజంలో ఒక సమానత్వాన్ని తీసుకురావడానికి వేసిన బలమైన అడుగు.

**లోక్‌సభలో ప్రభుత్వ వివరణ:**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీల ప్రాతినిధ్యంపై అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం లోక్‌సభలో స్పష్టమైన సమాధానం ఇచ్చింది. ప్రత్యక్ష నియామకాల్లో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయడమే కాకుండా, వారి కోసం ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. దీనివల్ల ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు కూడా త్వరగా భర్తీ అవుతాయి.

ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం, గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర సర్వీసుల్లో ఓబీసీల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఇది సామాజిక మార్పుకు ఒక సంకేతం. చట్టసభలలో ఇలాంటి చర్చలు జరగడం వల్ల అమలు తీరులో ఉన్న లోపాలు బయటపడతాయి, వాటిని సరిదిద్దుకునే అవకాశం ప్రభుత్వానికి కలుగుతుంది.

**పరిమితి దాటని విధానం:**

కొన్ని ప్రత్యేకమైన, అసాధారణమైన పరిస్థితుల్లో మినహా సాధారణంగా ఏ ప్రభుత్వమైనా ఈ 50 శాతం గీతను దాటకుండానే తమ విధానాలను రూపొందిస్తుంది. రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలకు భంగం కలగకుండా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. రిజర్వేషన్ల శాతం పెంచాలని డిమాండ్లు ఉన్నప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ప్రభుత్వం జాగ్రత్త పడుతోంది. ఒకవేళ రిజర్వేషన్లు 50 శాతం దాటితే అది కోర్టుల్లో సవాలుకు గురయ్యే అవకాశం ఉంటుంది. అందుకే ప్రస్తుతం ఉన్న 49.5 శాతం రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేస్తూనే, అర్హులైన అందరికీ న్యాయం జరిగేలా చూస్తున్నారు. దీనివల్ల అటు సామాజిక న్యాయం, ఇటు న్యాయపరమైన రక్షణ రెండూ సాధ్యమవుతున్నాయి.

**కట్టుదిట్టమైన పర్యవేక్షణ:**

నిర్ణీత శాతంలో రిజర్వేషన్లు కల్పించడం ఎంత ముఖ్యమో, వాటిని క్షేత్రస్థాయిలో లోపాలు లేకుండా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. అందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి శాఖలో ప్రత్యేకంగా ఒక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే సమయంలో రిజర్వేషన్ల వారీగా రోస్టర్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా మార్గదర్శకాలు ఉన్నాయి. ప్రతి ఏటా ఎన్ని ఉద్యోగాలు ఏ కేటగిరీ కింద భర్తీ అయ్యాయో నివేదికలు సిద్ధం చేస్తారు. ఈ పారదర్శకత వల్ల అభ్యర్థుల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది, అనవసరమైన గందరగోళానికి తావుండదు. ఈ విధానం వల్ల సమాజంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న అసమానతలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివి కేంద్ర సర్వీసుల్లోకి అడుగుపెట్టేందుకు ఈ కోటా ఒక వారధిలా పనిచేస్తుంది. అన్ని వర్గాల వారికి పరిపాలనలో భాగస్వామ్యం లభించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్య లక్ష్యం నెరవేరుతుంది. 27 శాతం రిజర్వేషన్ల అమలు అనేది వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. న్యాయస్థానాల పరిమితులను పాటిస్తూనే గరిష్టంగా 50 శాతం లోపు రిజర్వేషన్లు కల్పించడం వల్ల సమాజంలోని అన్ని వర్గాల మధ్య సఖ్యత పెరుగుతుంది. ఇది దేశ సమగ్ర అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది.

**ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం పెంచే వ్యూహాలు**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీ అభ్యర్థుల సంఖ్య కేవలం రిజర్వేషన్లు ప్రకటించినంత మాత్రాన పెరగదు, వాటిని సమర్థవంతంగా భర్తీ చేసినప్పుడే సాధ్యమవుతుంది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక నియామక ప్రక్రియలను చేపడుతోంది. ముఖ్యంగా ఏవైనా కారణాల వల్ల గతంలో భర్తీ కాని ఓబీసీ పోస్టులను గుర్తించి, వాటిని బ్యాక్‌లాగ్ ఖాళీల కింద ప్రత్యేక నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేస్తారు. దీనివల్ల ఏ ఒక్క పోస్టు కూడా వృథా కాకుండా వెనుకబడిన వర్గాల అభ్యర్థులకే దక్కుతుంది. అంతేకాకుండా, పరీక్షా రుసుములలో మినహాయింపు, వయోపరిమితిలో సడలింపు వంటి ప్రోత్సాహకాలు కూడా ఓబీసీ అభ్యర్థులకు అదనపు బలాన్ని ఇస్తున్నాయి. ఇలాంటి సడలింపుల వల్ల మారుమూల ప్రాంతాల్లో ఉండి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే యువత కూడా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం తీసుకునే ఇలాంటి చర్యల వల్ల ఉన్నత స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు అన్ని విభాగాల్లో వెనుకబడిన వర్గాల భాగస్వామ్యం పెరుగుతోంది. భారత రాజ్యాంగంలోని 16(4) అధికరణం ప్రకారం, ప్రభుత్వ సేవల్లో తగినంత ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాల కోసం రిజర్వేషన్లు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఈ రాజ్యాంగ రక్షణ వల్లే ఓబీసీలకు 27 శాతం కోటా చట్టబద్ధంగా అమలు అవుతోంది. ఇది కేవలం ఒక ప్రభుత్వ నిర్ణయం మాత్రమే కాదు, సామాజిక న్యాయం కోసం రాజ్యాంగం కల్పించిన ఒక గొప్ప హక్కు. ఈ హక్కును కాపాడటం ప్రతి ప్రభుత్వం బాధ్యత. రాజ్యాంగం కల్పించిన ఈ రక్షణల వల్ల ఏవైనా కారణాల చేత రిజర్వేషన్ల అమలులో అన్యాయం జరిగితే అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం కూడా ఉంది. ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు పార్లమెంటరీ కమిటీల ద్వారా ఈ రిజర్వేషన్ల అమలు తీరును సమీక్షిస్తుంది. రాజ్యాంగబద్ధమైన ఈ పటిష్టమైన వ్యవస్థ వల్లే దేశంలో రిజర్వేషన్ల ప్రక్రియ ఎన్నో ఏళ్లుగా నిరాటంకంగా కొనసాగుతోంది. ఓబీసీ రిజర్వేషన్ల అమలులో క్రీమీలేయర్ అనే అంశం కీలక పాత్ర పోషిస్తుంది. వెనుకబడిన వర్గాల్లో కూడా ఆర్థికంగా బాగా స్థిరపడిన వారు కాకుండా, నిజమైన పేదవారికి, మధ్యతరగతి వారికి రిజర్వేషన్ల ఫలాలు అందాలన్నదే ఈ విధానం ఉద్దేశం. ఒక నిర్దిష్ట వార్షిక ఆదాయం కంటే ఎక్కువ సంపాదన ఉన్న కుటుంబాలను క్రీమీలేయర్ కింద పరిగణించి వారికి రిజర్వేషన్లు వర్తించకుండా చూస్తారు. దీనివల్ల రిజర్వేషన్ల ప్రయోజనం అట్టడుగున ఉన్న వారికి చేరుతుంది. ఈ ఆదాయ పరిమితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సవరణలు చేస్తుంది. దీనివల్ల మధ్యతరగతి విద్యార్థులకు అన్యాయం జరగకుండా జాగ్రత్త పడుతుంది. ఆర్థిక స్థితిగతులను బట్టి రిజర్వేషన్ల అర్హతను నిర్ణయించడం వల్ల సమాజంలో నిజంగా వెనుకబడిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత దక్కుతుంది. ఇది సామాజిక న్యాయం , ఆర్థిక సమానత్వం రెండింటినీ బ్యాలెన్స్ చేసే ప్రయత్నం.

ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం కోటా పొంది వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఓబీసీ ఉద్యోగులు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రైల్వేలు, రక్షణ రంగం, బ్యాంకింగ్ , పరిపాలనా విభాగాలు ఇలా అన్ని చోట్లా వెనుకబడిన వర్గాల ప్రతిభ ప్రతిబింబిస్తోంది. ఒకప్పుడు కేవలం కొన్ని వర్గాలకే పరిమితమైన ప్రభుత్వ సేవలు నేడు అన్ని సామాజిక వర్గాల సమ్మేళనంగా మారాయి. ఇది మన దేశ ప్రజాస్వామ్య గొప్పతనానికి నిదర్శనం. ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ అవకాశాలను కల్పిస్తోంది. ఒక్కసారి ఒక వెనుకబడిన కుటుంబం నుంచి వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగంలో చేరితే, ఆ కుటుంబం సామాజికంగా ఎంతో ఎత్తుకు ఎదుగుతుంది. ఆ ఒక్క వ్యక్తి తనతో పాటు మరో పది మందిని చదువు వైపు మళ్లించగలడు. ఇలా రిజర్వేషన్ల ద్వారా వచ్చే మార్పు కేవలం ఒక వ్యక్తికే పరిమితం కాకుండా మొత్తం సమాజం మీద సానుకూల ప్రభావం చూపుతుంది.

మొత్తం మీద చూసుకుంటే, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇతర వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం అనేది కేవలం ఒక చట్టపరమైన నిబంధన మాత్రమే కాదు, అది సామాజిక న్యాయం వైపు వేసిన ఒక బలమైన అడుగు. అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించిన 50 శాతం గరిష్ట పరిమితిని గౌరవిస్తూనే, వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన వాటాను ప్రభుత్వం అందిస్తోంది. ఈ 49.5 శాతం రిజర్వేషన్ల ప్రక్రియ ద్వారా అటు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు, ఇటు ఓబీసీ వర్గాలకు సమానమైన ప్రాతినిధ్యం లభిస్తోంది. దీనివల్ల దేశ పరిపాలనలో అన్ని సామాజిక వర్గాల భాగస్వామ్యం పెరిగి, ప్రజాస్వామ్యం మరింత పరిపుష్టం అవుతుంది.

రిజర్వేషన్ల అమలులో పారదర్శకత, క్రీమీలేయర్ వంటి నిబంధనలు పాటించడం వల్ల నిజమైన అర్హులకు మాత్రమే ఈ ఫలాలు అందుతున్నాయి. కేవలం ఉద్యోగం ఇవ్వడమే కాకుండా, ఒక తరాన్ని ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకురావడమే ఈ విధానం అసలు లక్ష్యం. భవిష్యత్తులో కూడా ఇదే పారదర్శకతను కొనసాగిస్తూ, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను త్వరగా భర్తీ చేయడం ద్వారా వెనుకబడిన వర్గాల యువతకు మరింత భరోసా కల్పించవచ్చు. ప్రతిభకు సామాజిక నేపథ్యం అడ్డుకాకూడదన్న ఆశయంతో సాగుతున్న ఈ ప్రయాణం, దేశాన్ని మరింత సమగ్రమైన, సమతుల్యమైన అభివృద్ధి వైపు నడిపిస్తుంది.

# ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు



- శాంతికి సవాలుగా మారుతున్న సంఘర్షణలు
- దాడులు, ప్రతిదాడులతలో పోతున్న వేలాది మంది ప్రజల ప్రాణాలు
- ఇంకా ప్రపంచాన్ని కలవరపెడుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు
- మానవ జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్న వైనం
- యుద్ధంతో ఇతర దేశాలకు శరణార్థులుగా వెళ్లిపోతున్న దేశస్థులు

పులి అమృత్
9948967077

ఇరవై ఒకటవ శతాబ్దంలో ప్రపంచం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందుతున్నా, యుద్ధాలు మరియు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇంకా ప్రపంచాన్ని కలవరపెడుతూనే ఉన్నాయి. రష్యాఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఘర్షణలు, చైనాతైవాన్ ఉద్రిక్తతలు, అలాగే ఇరాన్ఇజ్రాయిల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, అమెరికా పాత్ర వంటి అంశాలు ప్రపంచ శాంతికి పెద్ద సవాలుగా మారుతున్నాయి. ఈ సంఘటనలు కేవలం సంబంధిత దేశాలకే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, రాజకీయ స్థిరత్వం, మానవ జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి.

**రష్యాఉక్రెయిన్ యుద్ధం ప్రపంచాన్ని కుదిపిన ఘర్షణ** 2022లో ప్రారంభమైన రష్యాఉక్రెయిన్ యుద్ధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధం యూరప్ ప్రాంతంలో మాత్రమే కాకుండా ప్రపంచ రాజకీయ సమీకరణాలను కూడా మార్చింది. రష్యా ఉక్రెయిన్‌పై సైనిక దాడి చేయడంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను విడిచి ఇతర దేశాలకు శరణార్థులుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్ర ప్రభావానికి గురైంది. ముఖ్యంగా ఇంధన ధరలు, ధాన్య ధరలు భారీగా పెరిగాయి. ఉక్రెయిన్ ప్రపంచంలో ముఖ్య మైన గోధుమ ఉత్పత్తి దేశాలలో ఒకటి కావడంతో, యుద్ధం కారణంగా ఆహార సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావం పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఎక్కువగా పడింది.

**మధ్యప్రాచ్య ఘర్షణలు ఎప్పటికీ ముగియని సమస్య** మధ్యప్రాచ్యం చాలా కాలంగా యుద్ధాలు మరియు రాజకీయ సంఘర్షణలకు కేంద్రంగా ఉంది. ముఖ్యంగా ఇజ్రాయిల్‌పాలస్తీనా వివాదం ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యగా కొనసాగుతోంది. గాజా ప్రాంతంలో తరచూ జరిగే దాడులు, ప్రతిదాడులు వేలాది మంది ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఈ ఘర్షణల్లో ఎక్కువగా సాధారణ పౌరులే బాధితులవుతున్నారు. ఇళ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమవడంతో ప్రజల జీవనం తీవ్రంగా దెబ్బతింటోంది. పిల్లలు, మహిళలు ఎక్కువగా బాధితులుగా మారుతున్నారు.

**ఇరాన్ ఇజ్రాయిల్ అమెరికా యుద్ధం, ఉద్రిక్తతలు** ఇటీవలి సంవత్సరాల్లో ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధం, ఉద్రిక్తతలు కూడా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేస్తుండగా, ఇజ్రాయిల్ దీనిని తన భద్రతకు ముప్పుగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతు ఉండడం వల్ల ఈ సమస్య అంతర్జాతీయ రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం పొందుతోంది. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు విధించడం, మధ్యప్రాచ్యంలో సైనిక ఉనికి పెంచి చేపడుతున్న యుద్ధ చర్యలు ఈ ప్రాంతాన్ని మరింత ఉద్రిక్తంగా . ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధం పెద్ద స్థాయికి వెళితే అది కేవలం రెండు దేశాల మధ్య మాత్రమే పరిమితం కాకుండా మొత్తం మధ్యప్రాచ్యాన్ని ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. దీనివల్ల ప్రపంచ ఇంధన మార్కెట్, అంతర్జాతీయ భద్రతా పరిస్థితులు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది.

**చైనాతైవాన్ ఉద్రిక్తతలు భవిష్యత్తు ప్రమాద సంకేతం** ప్రపంచ రాజకీయాలలో మరో కీలక అంశం చైనా, తైవాన్ మధ్య ఉన్న ఉద్రిక్తతలు. చైనా తైవాన్‌ను తన భూభాగంగా భావిస్తుండగా, తైవాన్ స్వతంత్ర దేశంగా కొనసాగాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య సైనిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. చైనా తరచుగా తైవాన్ సమీపంలో సైనిక విన్యాసాలు నిర్వహించడం, తైవాన్‌కు అమెరికా మద్దతు ఇవ్వడం వంటి అంశాలు పరిస్థితిని మరింత సున్నితంగా మారుస్తున్నాయి. ఒకవేళ ఈ ప్రాంతంలో యుద్ధం ప్రారంభమైతే అది ప్రపంచ రాజకీయాల్లో పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది. తైవాన్ ప్రపంచంలో ప్రముఖ సెమీకండక్టర్ తయారీ కేంద్రం కావడంతో అక్కడ జరిగే ఏ ఘర్షణైనా ప్రపంచ సాంకేతిక పరిశ్రమను ప్రభావితం చేయగలదు.

**యుద్ధాల మానవీయ ప్రభావం** యుద్ధాలు ఎప్పుడూ సాధారణ ప్రజల జీవితాలను అత్యంత దారుణంగా ప్రభావితం చేస్తాయి. యుద్ధాలలో సైనికులు మాత్రమే కాకుండా పౌరులు కూడా ప్రాణాలు కోల్పోతారు. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి శరణార్థులుగా మారాల్సి వస్తుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా శరణార్థుల సంఖ్య భారీగా పెరుగుతోంది. యుద్ధ ప్రాంతాల నుంచి ప్రజలు ఇతర దేశాలకు వలస వెళ్తుండడంతో ఆ దేశాలపై కూడా అదనపు ఒత్తిడి పడుతోంది. వారికి ఆశ్రయం, ఆహారం, వైద్యం, విద్య వంటి మౌలిక అవసరాలు కల్పించడం పెద్ద సవాలుగా మారుతోంది. పిల్లలపై యుద్ధ ప్రభావం మరింత తీవ్రమైనది. విద్యా వ్యవస్థ దెబ్బతినడం, మానసిక ఒత్తిడి, భయాందోళనలు వంటి సమస్యలు వారి భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి.


**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం** యుద్ధాల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్రంగా పడుతోంది. ఇంధన ధరలు పెరగడం, సరఫరా గొలుసుల్లో అంతరాయం, అంతర్జాతీయ వాణిజ్యంలో సమస్యలు వంటి అంశాలు ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నాయి. అనేక దేశాలు తమ రక్షణ వ్యయాలను పెంచుతున్నాయి. దీని వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించాల్సిన నిధులు తగ్గే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ప్రపంచ మార్కెట్లలో అస్థిరత పెరుగుతోంది.

**శాంతి దిశగా ప్రపంచ ప్రయత్నాలు** ఈ పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు శాంతి, దౌత్యపరమైన పరిష్కారాల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉంది. యుద్ధాలు సమస్యలకు పరిష్కారం కాదని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించింది. సంభాషణలు, చర్చలు, అంతర్జాతీయ సహకారం ద్వారా మాత్రమే దీర్ఘకాలిక శాంతి సాధ్యమవుతుంది. అంతర్జాతీయ సంస్థలు, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాల మధ్య మధ్యవర్తిత్వం చేసి ఘర్షణలను తగ్గించే ప్రయత్నాలు చేయాలి. పెద్ద దేశాలు తమ రాజకీయ ప్రయోజనాల కంటే ప్రపంచ శాంతిని ముఖ్యంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు మానవ సమాజానికి ఒక పెద్ద హెచ్చరికగా నిలుస్తున్నాయి. రష్యాఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య ఘర్షణలు, ఇరాన్ఇజ్రాయిల్, అమెరికా యుద్ధం, అలాగే చైనాతైవాన్ సమస్యలు ప్రపంచ శాంతిని పరీక్షిస్తున్నాయి. ప్రపంచ దేశాలు పరస్పర సహకారం, దౌత్య చర్చలు, శాంతి మార్గాన్ని ఎంచుకుంటేనే స్థిరమైన భవిష్యత్తు సాధ్యమవుతుంది. లేకపోతే యుద్ధాల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మాత్రమే కాకుండా మానవ నాగరికతను కూడా తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉంది.

## చమురు కోసం యుద్ధాలు - వంట గ్యాస్ కష్టాలు

ఇరాన్ – ఇజ్రాయెల్ యుద్ధాలు ఆర్థిక వ్యవస్థను మాత్రమే కాదు సాధారణ కుటుంబాలను ప్రభావితం చేస్తున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు, హార్మూజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాల వల్ల భారత్‌కు వచ్చే ఎల్పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. కేంద్ర ప్రభుత్వం పరిస్థితి అదుపులోనే ఉందని భరోసా ఇచ్చినా, దేశంలోని కొన్ని ప్రధాన నగరాల్లో ఇప్పటికే వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత కనిపిస్తోంది. ముంబయిలో గ్యాస్ కొరత కారణంగా దాదాపు 20 శాతం హోటళ్లు తాత్కాలికంగా మూతపడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. భారత్‌లో ఏటా సుమారు 31.3 మిలియన్ టన్నుల ఎల్పీజీ వినియోగం జరుగుతుంది. ఇందులో దాదాపు 62 శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. అంటే అంతర్జాతీయ పరిస్థితులు మారితే దేశీయ సరఫరాపైనా వెంటనే ప్రభావం పడే అవకాశం ఉంది. ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ మార్కెట్ విక్రయాలు పెరుగుతున్నాయన్న వార్తలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక వాణిజ్య సిలిండర్‌ను రెట్టింపు ధరకు విక్రయిస్తున్న ఘటనలు వెలుగులోకి రావడం పరిస్థితి ఎంత సున్నితంగా మారిందో సూచిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సిలిండర్ బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాపై సమీక్ష కోసం ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. అయితే ప్రభుత్వ చర్యలతో పాటు వినియోగదారుల బాధ్యత కూడా కీలకం. ఇప్పటి పరిస్థితుల్లో గ్యాస్‌ను పొదుపుగా వినియోగించడం ప్రతి కుటుంబానికి అవసరం. గతంలో ఒక సిలిండర్ రెండు మూడు నెలలు సరిపడేది. ఇప్పుడు చాలామందికి ఒక నెల కూడా రావడం కష్టమవుతోంది. అలాంటి సమయంలో కొన్ని చిన్న చిట్కాలు పాటిస్తే గ్యాస్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. వంటకు అవసరమైన పదార్థాలను ముందుగానే సిద్ధం చేసుకోవడం, ప్రెషర్ కుక్కర్ వినియోగించడం, బర్నర్లను శుభ్రంగా ఉంచడం, బియ్యం–పప్పులను ముందుగా నానబెట్టడం వంటి అలవాట్లు గ్యాస్ వినియోగాన్ని తగ్గిస్తాయి. ఇది కేవలం ఆర్థిక లాభం మాత్రమే కాదు, జాతీయ వనరుల పరిరక్షణ కూడా. గ్యాస్‌ను జాగ్రత్తగా వినియోగించడం ద్వారా ఒక కుటుంబం మాత్రమే కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుంది. అందుకే ప్రతి ఇంట్లో ఒక సూత్రం గుర్తుంచుకోవాలి.. గ్యాస్ పొదుపు అంటే కేవలం ఖర్చు తగ్గించడం కాదు, కుటుంబానికి మదుపు చేయడం.

ఈ. శ్రీనివాస్ రావు, 9912121319





# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై కాంగ్రెస్ రాజకీయం

- అక్కడి ఘటనపై కాంగ్రెస్ నేతలు రీల్స్ చేస్తారన్న ప్రధాని
- కొచ్చి రిఫైనరీలో 5 వేల 500 కోట్లతో నిర్మించే పాలీప్రొఫైలిన్ యూనిట్‌కు శంకుస్థాపన
- దేశాన్ని విదేశాలపై ఎక్కువగా ఆధారపడేలా చేసి ఆనందించారిన్నాళ్లు
- దేశంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వారికి తెలియదపి విమర్శలు
- దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడానికి అవిశ్రాంత బీజేపీ-ఎన్‌డీఏ కృషి
- కేరళలో పర్యటిస్తోన్న ప్రధాని మోదీ

తిరువనంతపురం: కేరళ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ కాంగ్రెస్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై కాంగ్రెస్ రాజకీయం చస్తోందని మండిపడ్డారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వారికి తెలియడం లేదన్నారు. ఒకవైపు, బీజేపీ-ఎన్‌డీఏ దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తుంటే, కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఆత్మనిర్భర భారత్ అభియాన్‌ను అపహాస్యం చేయడంలో బిజీగా ఉన్నాయన్నారు. వారు దేశాన్ని విదేశాలపై ఎక్కువగా ఆధారపడేలా చేశారని కాంగ్రెస్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పుడు కాంగ్రెస్, విపక్షాలు కలిసి అసత్యాలను ప్రచారం చేయడంలో నిమగ్నమై ఉన్నారన్నారు. కేరళలో పర్యటించిన ప్రధాని ఎర్నాకుళంలో 10 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కొచ్చి రిఫైనరీలో 5 వేల 500 కోట్లతో నిర్మించనున్న పాలీప్రొఫైలిన్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సభలో ప్రధాని మోదీ మాట్లాడారు.

యుద్ధ సమయంలో కూడా, కాంగ్రెస్, వామపక్షాలు భయాందోళనలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. మరోవైపు, కృత్రిమ మేధస్సు, సాంకేతికతకు కేరళను కేంద్ర బిందువుగా మార్చడానికి బీజేపీ కృషి చేస్తుందని మోదీ అన్నారు. నేటి భారతదేశం తన పౌరులను వేరే చోట చిక్కుకుపోనివ్వదని, గల్ఫ్ ప్రాంతంలో చిక్కుకున్న భారతీయులకు అన్ని రకాల సహాయం అందించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని చెప్పారు. ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు బాధితులతో నిరంతరం సంప్రదింపులు చేస్తూ వారికి సాయం చేస్తున్నాయని వెల్లడించారు.

గల్ఫ్‌లోని మిత్రదేశాల ప్రభుత్వాలు మన పౌరులను జాగ్రత్తగా చూసుకుంటున్నాయి. నేను ఆయా దేశాలకు ధన్యవాదాలు చెబుతున్నాను. ఆ దేశాల్లోని మన రాయబార కార్యాలయాలు, మిషన్లు వారికి నిరంతరం సహాయం అందిస్తున్నాయి. ఎవరికైనా ఆహారం కావాలన్నా, వైద్య సాయం కావాలన్నా, నివాసానికి సాయం కావాలన్నా, చట్టపరమైన సాయం కావాలన్నా అందిస్తున్నాం. కానీ ఇంతపెద్ద సంక్షోభంలో కూడా కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేయడం దురదృష్టకరం. మన ప్రజలు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోతే ఈ వ్యక్తులు (కాంగ్రెస్ నేతలు) మోదీని తిట్టడానికి రీల్స్ చేస్తున్నారు అని ప్రధాని మోదీ అన్నారు.





దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్‌గా తీర్చిదిద్దడంలో పెట్రోలియం రంగం విస్తరణ అత్యంత కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా లక్ష్యాన్ని సాధించడంలో కూడా ఈ రంగం ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. కొచ్చి రిఫైనరీలో ప్రారంభించిన పాలీప్రొపిలిన్ యూనిట్ ప్రతి సంవత్సరం సుమారు నాలుగు లక్షల టన్నుల పాలీప్రొపిలిన్ ఉత్పత్తి చేయగలదని ప్రధాని తెలిపారు. ఈ ఉత్పత్తి ద్వారా ప్యాకేజింగ్, టెక్స్టైల్, ఆటోమొబైల్, మెడికల్ పరికరాలు వంటి అనేక పరిశ్రమలకు ముడి పదార్థం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. దీంతో దేశీయ తయారీ రంగానికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.



# దేశంలో ఇంధన సంక్షోభం..

- పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం
- ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం !
- పలు నగరాల్లో హోటల్స్, రెస్టారెంట్లు మూసివేత



న్యూఢిల్లీః పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేస్తూనే ఉన్నాయి. మరోవైపు ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలపై దాడులు చేస్తోంది. ప్రపంచ దేశాలకు చమురును సరఫరా చేసేందుకు కీలక మార్గమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ ఇప్పటికే మూసివేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో చమురు, గ్యాస్ కొరత నెలకొంది. ఇప్పటికే భారత్‌లో పలు నగరాల్లో హోటల్స్, రెస్టారెంట్లు మూసివేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇంధన కొరతను ఎదుర్కొనేందుకు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం () ఇవ్వాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి.

వెల్స్ ఫార్గో అనే ఫైనాన్సియల్ సర్వీస్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ దీని గురించి తన లింక్డిన్‌లో పోస్టు చేశారు. దేశంలో ఎల్‌పీజీ కొరత నెలకొన్న నేపథ్యంలో కంపెనీలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం కేటాయించాలని సూచించారు. ప్రతిరోజూ వేలాది మంది ఉద్యోగులు దూర ప్రయాణాలు చేస్తారని వాళ్లతో ఇంటి నుంచే పని చేయించుకుంటే ఇంధనం ఆదా అవుతుందన్నారు. దీనివల్ల ఆస్పత్రులు, లాజిస్టిక్స్, ప్రజా రవాణా లాంటి అత్యవసర రంగాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కంపెనీలు సామాజిక బాధ్యతతో ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

సోషల్ మీడియా చంద్రశేఖర్ చేసిన పోస్టు వైరల్ అవుతోంది. అయితే భారత్‌లో ఇంధన కొరత ప్రభావం అంతగా లేదని మీడియా, సోషల్ మీడియాలో మాత్రమే దీనిపై హైప్ క్రియేట్ చేస్తున్నారని కొందరు అంటున్నారు. రాబోయే 10-20 రోజుల్లో ఈ పరిస్థితులు సద్దుమణుగుతాయని చెబుతున్నారు. మరి కొందరు మాత్రం చంద్రశేఖర్ చెప్పిన విషయాన్ని సమర్థి స్తున్నారు. దేశంలోని ప్రతిరోజూ లక్షలాది మంది కార్లు, బైకులపై తమ కంపెనీలకు వెళ్తారని.. దీనివల్ల చమురు ఎక్కువగా అవసరం అవుతుందని అంటున్నారు. ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం కేటాయిస్తే ఇంధన కొరత ఉండదని చెబుతున్నారు. కంపెనీలు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు.మరోవైపు దేశంలో ప్రస్తుతం ఎల్‌పిజి కొరత ప్రభావం కనిపిస్తోంది. ఇప్పటికే ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో హోటళు, రెస్టారెంట్లు మూసివేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. హైదరాబాద్‌లో కూడా ఇలాంటి పరిస్థితులే తలెత్తున్నాయని ప్రచారం నడుస్తోంది. అయితే కేంద్రం మాత్రం దీనిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ఉత్పత్తిని 10 శాతం పెంచినట్లు పేర్కొంది.



# అమెరికాలో ఉండలేం

## అగ్రరాజ్యాన్ని వదిలి వలస వెళ్లిపోతున్న అమెరికన్లు!

వాసింగ్టన్ : అమెరికా స్వాతంత్ర్యం వచ్చి 250 సంవత్సరాలు దాటుతున్న తరుణంలో, ప్రపంచ వలసల ధోరణుల్లో గుర్తించదగిన మార్పు కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వలసదారులను ఆకర్షించడంలో చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన ఈ దేశంలో మార్పును సూచిస్తూ, అమెరికన్ల సంఖ్య పెరుగుతోంది.

అనేక దేశాల రికార్డులను ఉపయోగించి ది వాల్ స్ట్రీట్ జర్నల్ సంకలనం చేసిన ఇటీవలి డేటా ప్రకారం, అమెరికాకు వలస వెళ్లడం కంటే దేశం విడిచి వెళ్ళే వారి సంఖ్య పెరుగుతోంది. నివాస అనుమతులు, ఆస్తి కొనుగోళ్లు, విద్యార్థుల అడ్మిషన్లు వంటి సూచికల ద్వారా 50 కంటే ఎక్కువ దేశాల నుంచి సేకరించిన గణాంకాలు, అమెరికన్లు రికార్డు సంఖ్యలో విదేశాలలో స్థిరపడుతున్నారని చూపిస్తున్నాయి.

**వలసలు మార్పును చూపిస్తున్నాయి** అందుబాటులో ఉన్న డేటా ప్రకారం, గత సంవత్సరం అమెరికా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంది. ఎక్కువ మంది వలస వెళ్లిపోయారు. అంటే వచ్చిన వారి కంటే ఎక్కువ మంది దేశం విడిచి వెళ్ళారు. మహా మాంద్యం తర్వాత ఇటువంటి ధోరణి చూడటం ఇదే మొదటిసారి.

కఠినమైన వలస విధానాలు, బలవంతమైన బహిష్కరణ చర్యలు ప్రభావంతో అభివృద్ధి సాధ్యమవుతుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదే పదే చెబుతున్నారు. అయితే, అమెరికా ప్రభుత్వం విదేశాలకు వెళ్లే పౌరుల రికార్డులను సరిగా ఉంచడం లేదనే విషయాన్ని నిపుణులు చెబుతున్నారు. దీని వలన ప్రతి సంవత్సరం దేశం విడిచి వెళ్ళే వ్యక్తుల సంఖ్యను కచ్చితంగా గుర్తించడం కష్టమవుతుంది.

**బెస్ట్ ఆప్షన్‌గా యూరప్** : విదేశాలకు వెళ్లే చాలా మంది అమెరికన్లు యూరప్‌లోని వివిధ దేశాలను గమ్యస్థానాలను ఎంచుకుంటున్నారు. ఇక్కడ జీవనశైలి ప్రయోజనాలు, స్టాటస్ తరచుగా కీలకంగా మారుతోంది.

పోర్చుగల్, స్పెయిన్, గ్రీస్ వంటి దేశాల్లో ఉన్న పరిస్థితులకు అమెరికన్‌లు ఆకర్షితులవుతున్నారు. హెల్త్‌పై పెట్టే ఖర్చులు తక్కువగా ఉండటం, తక్కువ ధరకు లభించే ఇళ్లు, వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నందన యూరోపియన్ దేశాల్లో స్థిరపడేందుకు అమెరికన్లను మొగ్గు చూపుతున్నారు. కొంతమంది వ్యక్తులు మరింత రిలాక్స్, స్థిరమైన జీవనశైలిని అందించే దేశాల్లో శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకునేదుకు అమెరికాలోని సొంత ఇళ్లను కూడా అమ్ముతున్నారు.

**ట్రెండ్‌ను నడిపించే ఆర్థిక -రాజకీయ అంశాలు :** నివేదికల ప్రకారం, అమెరికాను విడిచి వెళ్ళాలనే నిర్ణయం ఒకే కారణంపై ఆధారపడి ఉంటుందని అమెరికన్ ప్రవాసులతో ఇంటర్వ్యూలు సూచిస్తున్నాయి. చాలా మంది ఆర్థిక ఒత్తిళ్లు, రాజకీయ ఆందోళనలు, జీవనశైలిలో వచ్చిన మార్పులు కారణంగానే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. పెరుగుతున్న జీవన వ్యయాలు, హింసాత్మక నేరాల గురించి ఆందోళన చెందుతున్నారు.

దేశంలో పెరుగుతున్న రాజకీయ అలజడి కూడా వారి మనసును మార్చేస్తోంది. వీటన్నింటి కారణంగానే విదేశాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నారు. మీడియా నివేదికల ప్రకారం, ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన తర్వాత అమెరికా నుంచి పౌరులు వెళ్లిపోతున్న ఈ విధానాన్ని డోనాల్డ్ డాష్ అని వర్ణించారు. అయితే, ఈ ధోరణి ఇటీవల ప్రారంభం కాలేదని విశ్లేషకులు అంటున్నారు. రిమోట్ పని పెరుగుదల, లో పెరుగుతున్న గృహ, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, అంతర్జాతీయ జీవనంపై పెరుగుతున్న ఆసక్తి వంటి అంశాలు క్రమంగా ఎక్కువ మంది అమెరికన్లు విదేశాలకు వెళ్లడాన్ని ప్రోత్సహించాయి.

# స్పీకర్ మమ్మల్ని అడ్డుకున్నారు

- మేము మాట్లాడడానికి అవకాజవం ఇవ్వట్లే
- లోక్ సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆగ్రహం
- ప్రధాని మోదీ ఎప్పుడూ రాజీ పడలేదు
- రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ కౌంటర్



న్యూఢిల్లీ : లోక్సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై వాడివేడి చర్చ జరుగుతోంది. లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ స్పీకర్ పాత్రపై, ప్రధాని మోదీపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని మోదీ రాజీ పడ్డారని పేర్కొన్నారు. భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకంద్ నరవణె రచించిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై కూడా చర్చ జరగకుండా చేశారని పేర్కొన్నారు. లద్ధాఖ్ సంక్షోభ సమయంలో ప్రభుత్వ ప్రతిస్పందన గురించి నరవణె రాసిన విషయాలు చెప్పనివ్వకుండా చేశారని, అందుకే ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చిందని అన్నారు. కాగా, జాతీయ భద్రత లాంటి అంశాలపై మాట్లాడేటప్పుడు ప్రతిపక్షనేత ఆచి తూచి మాట్లాడాలని, పార్లమెంటరీ నిబంధనలను ఊటంకిస్తూ బీజేపీ నేత రవిశంకర్ చేసిన వ్యాఖ్యలపై కూడా రాహుల్ ఘాటుగా స్పందించారు. చర్చా సమయంలో తన పేరును పదేపదే ప్రస్తావిస్తూ, తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు.

ఇక్కడ జరుగుతున్న చర్చ ప్రజాస్వామ్య ప్రక్రియ, స్పీకర్ పాత్ర గురించి. కానీ చాలా సార్లు నా పేరు ప్రస్తావనకు వచ్చింది. నా గురించి అడ్డగోలుగా మాట్లాడారు. వాస్తవానికి ఈ సభ భారత ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం. ఇది కేవలం ఒక పార్టీకి మాత్రమే ప్రాతినిధ్యం వహించదు. పార్లమెంట్ అనేది దేశం మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. కానీ మేము మాట్లాడడానికి ప్రయత్నించిన ప్రతీసారి మమ్మల్ని అడ్డుకున్నారు. ముఖ్యంగా యూఎస్తో ట్రేడ్ డీల్ విషయంలో ప్రధాని మోదీ రాజీపడ్డారని చెప్పినప్పుడు నన్ను మాట్లాడనీయకుండా చేశారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా, ఒక చర్చా సమయంలో ప్రతిపక్ష నేతను మాట్లాడనీయలేదు.- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

నేను ఎం.ఎం.నరవాణె రాసిన పుస్తకం గురించిన అంశాన్ని లేవనెత్తాను. ఎప్స్టీన్ ఫైల్స్ గురించి మాట్లాడాను. అదానీ అంశాన్నీ తెరపైకి తెచ్చాను. కానీ నా గొంతు నొక్కేశారు. ఈ అంశాలు భారత ప్రజలు కచ్చితంగా తెలుసుకోవాల్సిన ముఖ్యమైన అంశాలు. మన ప్రధాని మోదీ రాజీపడ్డారు. దాని ఫలితం అందరికీ తెలుసు అని రాహుల్ గాంధీ అన్నారు.

**ఖండించిన రవిశంకర్ ప్రసాద్**

అంతకు ముందు ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ మాట్లాడారు. స్పీకర్ను తొలగించే తీర్మానాన్ని ఒక నాయకుడి (రాహుల్ గాంధీ) అహాన్ని సంతృప్తి పరచడానికి ఆయుధంగా వాడుకోకూడదు అని అన్నారు. కేవలం ఒక నాయకుడి అహంకారం వల్ల ఈ తీర్మానంపై సభ చర్చించాల్సి రావడం బాధాకరమని వ్యాఖ్యానించారు. పార్లమెంటరీ ప్రాక్టీసులు, ప్రొసీజర్లను ఊటంకిస్తూ, ప్రతిపక్ష నేత జాతీయ భద్రత అంశాలపై ఆచితూచి మాట్లాడాలని, పక్షపాత రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంతేకాదు మోదీపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై రవిశంకర్ ప్రసాద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఎప్పుడూ రాజీపడలేదని పేర్కొన్నారు.ఇప్పుడు స్పీకర్పై అవిశ్వాస తీర్మానం ప్రస్తావన వచ్చింది. అయితే పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తినప్పుడు చర్చకు ఆస్కారం లేదు. ప్రతిపక్ష నేతలు స్పీకర్ను చాలా సార్లు అవమానించారు. ప్రచురించని పుస్తకం గురించి సభలో మాట్లాడడంతోనే వివాదం మొదలైంది. వాస్తవానికి స్పీకర్పై అవిశ్వాసం ఎప్పుడు పెట్టాలో గతంలో మాజీ ప్రధాని నెహ్రూ స్వయంగా చెప్పారు. తీవ్ర ఆరోపణలు, రుజువులు ఉంటేనే స్పీకర్పై అవిశ్వాసం పెట్టాలని ఆయన సూచించారు. ప్రతిపక్ష నేత (రాహుల్ గాంధీ) కూడా సభలో భాగమే. ఆయనకు చక్కటి వ్యక్తిత్వం ఉండడం చాలా అవసరం అని రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. కాగా, రవిశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలపై విపక్షాలు నిరసన చేపట్టాయి. దీనితో సభా కార్యకలాపాలు నిర్వహిస్తున్న దిలీప్ సైకియా, రాహుల్ గాంధీని మళ్లీ మాట్లాడడానికి అనుమతి ఇచ్చారు.

# హర్మూజ్ మూతపడితే జనజీవనం అస్తవ్యస్తం

- ఆహార ధరలు, జీవన వ్యయాలు పెరుగుతాయ్
- - ఐక్యరాజ్యసమితి కీలక హెచ్చరిక
- ఇంధన మార్కెట్లు, సప్లై చైన్లపై ప్రభావం-
- హర్మూజ్ సప్లైలలో 84 శాతం ఆసియా దేశాలకే
- - సైనిక ఉద్రిక్తతలను తగ్గించడమే శ్రేయస్కరమని స్పష్టీకరణ



న్యూఢిల్లీ : పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి కీలక హెచ్చరిక చేసింది. ఒకవేళ హర్మూజ్ జలసంధి మూతపడితే ఆహార ధరలు, జీవన వ్యయాలు పెరుగుతాయని యూఎన్ ఆందోళన వ్యక్తం చేసింది. హర్మూజ్ మీదుగా నౌకలు, ఆయిల్ ట్యాంకర్ల రాకపోకలు ఆగిపోతే అంతర్జాతీయ వాణిజ్యం, అభివృద్ధికి గణనీయమైన ముప్పు కలుగుతుందని వార్నింగ్ ఇచ్చింది. ఈమేరకు యూఎన్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడీ) రూపొందించిన నివేదికను మంగళవారం విడుదల చేశారు. దీనిలోని కీలక వివరాలను ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ అధికార ప్రతినిధి స్టీఫెన్ ద్యుజారిక్ మీడియాకు తెలియజేశారు.

**ఇంధన మార్కెట్లు, సప్లై చైన్లపైనా ప్రభావం**

అమెరికా- ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ ప్రతిదాడుల కారణంగా ఇప్పటికే హర్మూజ్ జలసంధి మీదుగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఐరాస గుర్తుచేసింది. అంతర్జాతీయ వాణిజ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యంత క్లిష్టమైన సముద్ర మార్గంగా హర్మూజ్ జలసంధి ఉందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా జరిగే ముడి చమురు రవాణాలో పావు వంతు, పెద్దమొత్తంలో సహజ వాయువు(ఎల్‌ఎన్‌జీ), ఎరువుల సప్లై ఈ రూట్‌లోనే జరుగుతోందని పేర్కొంది. ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ సైనిక ఘర్షణ ప్రతికూల ప్రభావాలు పశ్చిమాసియా ప్రాంతానికే పరిమితం కావని, ప్రపంచ ఇంధన మార్కెట్లు, సముద్ర రవాణా, అంతర్జాతీయ సప్లై చైన్లపైనా దీని ఎఫెక్ట్ పడుతుందని ఐరాస విశ్లేషించింది. ఇంధనాలు, ఎరువుల ధరలతో పాటు రవాణా ఛార్జీలు, బీమా ప్రీమియంలూ పెరిగిపోతే నిత్యావసరాల రేట్లు రెక్కలు తొడుగుతాయని హెచ్చరించింది. ఫలితంగా ఆహార ధరలు, జీవన వ్యయాల్లో పెరుగుదల సంభవిస్తుందని, దీనివల్ల ప్రత్యేకించి పేదవర్గాల ప్రజలు ఇబ్బందిపడాల్సి వస్తుందని తెలిపింది.

అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లు "అంతర్జాతీయ వాణిజ్యం, అభివృద్ధికి అంతరాయాన్ని తొలగించాలన్నా, పర్యావరణ ముప్పును తగ్గించాలన్నా పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలను తగ్గించడమే ఏకైక మార్గం. సముద్ర రవాణా మార్గాలు, ఓడరేవులు, సముద్ర రవాణా మౌలిక సదుపాయాలు, నావికుల పరిరక్షణకు చర్యలను చేపట్టాలి. అంతర్జాతీయ చట్టాలు, రవాణా స్వేచ్ఛకు అనుగుణంగా వాణిజ్య మార్గాలకు భద్రతను కల్పించాలి. ప్రస్తుత సైనిక ఘర్షణ వల్ల పశ్చిమాసియాతో పాటు యావత్ ప్రపంచంపైనా ఆర్థికపరమైన ప్రభావం పడుతుంది. ఈ ఘర్షణ ఎంత కాలం కొనసాగుతుంది? దీని తీవ్రత ఎలా ఉంటుంది? ఎన్ని దేశాల పరిధిలో ఘర్షణ జరుగుతుంది? అనే అంశాలు ఆర్థిక ప్రభావం స్థాయిని నిర్ణయిస్తాయి. ఇప్పటికే చాలా అభివృద్ధి చెందుతున్న దేశాలు భారీ అప్పుల ఊబిలో ఉన్నాయి. వాటి ఆర్థిక వనరులు చాలా పరిమితంగా ఉన్నాయి ఆయా దేశాలకు తగిన ఆర్థిక వనరులూ లభించడం లేదు. ప్రస్తుత వాణిజ్య సంక్షోభం ఆయా దేశాలపై ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లను మరింత పెంచనుంది. విదేశీ ఇంధన వనరులు, ఎరువులు, ఆహార ధాన్యాలపై ఆధారపడే దేశాలపైనా ఎఫెక్ట్ ఉంటుంది" అని యూఎన్‌సీటీఏడీ నివేదిక విశ్లేషించింది.

**హర్మూజ్ సప్లైలలో 84 శాతం ఆసియా దేశాలకే**

"ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ సైనిక ఘర్షణ మొదలైంది. అప్పటి నుంచి హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు 97 శాతం మేర తగ్గిపోయాయి. దీనివల్ల ప్రధానంగా ఆసియా దేశాలు ప్రభావితం అవుతున్నాయి. ఆయా దేశాలకు ఇంధన వనరుల సప్లైలపై ఎక్కువ ఎఫెక్ట్ పడుతోంది. 2024లో ప్రతిరోజూ హర్మూజ్ మీదుగా సప్లై అయిన ముడి చమురు(14.3 మిలియన్ బ్యారెళ్లు)లో 84 శాతం ఆసియా దేశాలకే వెళ్లింది. కేవలం 16 శాతమే ఐరోపా దేశాలు, ఇతర ప్రాంతాలకు సప్లై అయింది. ఇక 2024లో హర్మూజ్ మీదుగా ప్రతిరోజూ సప్లై అయిన ఎల్‌ఎన్‌జీ(10.4 బిలియన్ క్యూబిక్ ఫీట్లు)లో శాతం ఆసియా దేశాలకే చేరింది" అని ఐరాస నివేదిక వెల్లడించింది.

# కారుణ్య మరణానికి సుప్రీం అనుమతి!

**13 ఏళ్లుగా కోమాలో ఉన్న హరీశ్ రాణా తల్లిదండ్రుల విజ్ఞప్తి, వైద్య నివేదికల ఆధారంగా చికిత్స నిలిపివేయొచ్చని తీర్పు.**



న్యూఢిల్లీ : కోమాలో ఉన్న కుమారుడికి కారుణ్య మరణానికి అనుమతించాలంటూ తల్లిదండ్రులు సాగించిన న్యాయపోరాటం ఎట్టకేలకు ఫలించింది. భవనం నాలుగో అంతస్తు నుంచి కిందపడి తీవ్ర గాయాలకు గురైన హరీశ్ రాణా(32) దాదాపుగా 13ఏళ్ల పాటు కోమాలో జీవచ్ఛవంలా ఉండిపోయాడు. అతడి తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు హరీశ్ రాణా కారుణ్య మరణానికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. రాణాకు చికిత్స నిలిపివేయవచ్చంటూ..అతడి కారుణ్య మరణానికి అనుమతి ఇచ్చింది. ఢిల్లీకి చెందిన 32 ఏళ్ల హరీశ్ రాణా 2013 ఆగస్టు 20న చండీగఢ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో నాలుగో అంతస్తు బాల్కనీ నుంచి కిందపడిపోయాడు. ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమైంది. శరీరం కదలలేని స్థితికి చేరుకుంది. ప్రఖ్యాత ఆసుపత్రులను, వైద్యులను సంప్రదించి చికిత్స అందించినప్పటికి అతడు కోమా నుంచి కోలుకోవడం లేదు. చేసేది లేక అతడి తల్లిదండ్రులు ఇంట్లోనే ఉంచి హరీశ్ బాగోగులు చూసుకుంటున్నారు. కుమారుడి చికిత్స కోసం ఆర్థికంగా, మానసికంగా చితికిపోయిన ఆ తల్లిదండ్రులు అతడి కారుణ్య మరణానికి అనుమతించాలంటూ 2024లో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు వారి పిటిషన్‌ను తిరస్కరించింది. ఆ తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లినా నిరాశే ఎదురైంది. ఇటీవల వైద్యులు హరీశ్ కోలుకునే అవకాశం లేదని మరోసారి ఇచ్చిన నివేదికల ఆసరాతో అతడి కుటుంబం మళ్లీ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మెడికల్ రిపోర్ట్‌లను పరిశీలించిన కోర్టు.. హరీశ్ కేసును విచారణ చేపట్టింది. ఈ ఏడాది జనవరి 13న అతడి తల్లిదండ్రులతో మాట్లాడిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వారి అభిప్రాయాలను విన్నారు. మానవీయకోణంలో మర్యాదపూర్వక చావును ప్రసాదించాలని అప్పుడు వారు కోర్టును అభ్యర్థించారు. వారి వినతి మేరకు ఈ కేసులో ప్రాణాధార వైద్య చికిత్సను ఉపసంహరించే అంశాన్ని మాత్రం తాము పరిశీలిస్తామంటూ తీర్పు రిజర్వ్ చేసింది. తాజాగా కారుణ్య మరణానికి అనుమతి ఇస్తూ తీర్పు వెలువరించింది.

# ఇరాన్ కొత్త అధినేతకు ఉత్తర కొరియా మద్దతు..

**మీ నిర్ణయాన్ని గౌరవిస్తామంటూ కిమ్ జోంగ్ ఉన్ ప్రకటన**



న్యూఢిల్లీ : ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణం తర్వాత ఆయన కుమారుడు మోజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఖమేనీ వారసత్వాన్ని మొజ్తబా అందిపుచ్చుకోవడాన్ని ఉత్తర కొరియా అధికారికంగా సమర్థిం చింది. ఇరాన్ ప్రజల నిర్ణయాన్ని తాము గౌరవిస్తామని ప్రకటిస్తూనే.. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలపై ప్యాంగ్యాంగ్ నిప్పులు చెరిగింది. పశ్చిమాసియాలో శాంతిని తుడిచి పెట్టేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని ఉత్తర కొరియా విదేశాంగ శాఖ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. ఇరాన్ పాలకులను మార్చాలని, అక్కడ తమకు అనుకూలమైన వ్యవస్థను తీసుకు రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను ఉత్తర కొరియా తప్పుబట్టింది. ఒక దేశ రాజకీయ వ్యవస్థలో జోక్యం చేసుకోవడం, ఆ దేశ ప్రాంతీయ సమగ్రతను దెబ్బతీయడం అరాచకమని ఉత్తర కొరియా విదేశాంగ ప్రతినిధి పేర్కొన్నారు. ఇరాన్ సామాజిక వ్యవస్థను కూలదోసేందుకు అమెరికా-ఇజ్రాయెల్ కూటమి పన్నుతున్న కుట్రలను ప్రపంచం తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఇలాగే చైనా, రష్యాలు సైతం ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తబాకు మద్దతు ఇచ్చాయి. రెండ్రోజుల క్రితమే ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించాయి.

**అమెరికా-దక్షిణ కొరియా విన్యాసాలపై ఆగ్రహం:** మరోవైపు అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫ్రీడమ్ షీల్డ్ సైనిక విన్యాసాలను ఉత్తర కొరియా తీవ్రంగా పరిగణిస్తోంది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఈ విన్యాసాలు కేవలం రక్షణ కోసం చేస్తున్నవి కావని, ఇవి తమపై దాడి చేసేందుకు జరుగుతున్న ముందస్తు సన్నాహాలేనని కిమ్ ఆరోపిస్తున్నారు. ఒకవేళ అమెరికా దూకుడు పెంచితే ఊహించని రీతిలో భయంకరమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తాము అణ్వాయుధ దేశమనే నిజాన్ని వాషింగ్టన్ అంగీకరిస్తేనే చర్చలకు తావుం టుందని కిమ్ తెగేసి చెప్పారు.ఇదిలా ఉండగా.. ఉత్తర కొరియా తాజాగా తన సైనిక శక్తిని ప్రదర్శించింది. చో హ్యోన్‌అనే భారీ యుద్ధ నౌక నుంచి వ్యూహాత్మక క్రూయిజ్ క్షిపణులను ఉత్తర కొరియా పరీక్షించింది. ఈ ప్రయోగాన్ని కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా తన కుమార్తె జు ఏతో కలిసి పర్యవేక్షించారు. నౌకాదళాన్ని అణ్వాయ ుధాలతో సన్నద్ధం చేసే ప్రక్రియలో ఇది కీలక అడుగు అని ఉత్తర కొరియా ప్రకటించింది.


# గ్యాస్ సిలిండర్లకు ఇబ్బందేలేదు

**మోదీ సర్కార్ కీలక ప్రకటన**

న్యూఢిల్లీ ః దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ల కొరతపై నెలకొన్న ఆందోళనలకు మోదీ సర్కార్ తెరదించింది. వినియోగదారులకు ఊరటనిచ్చేలా కీలక ప్రకటన విడుదల చేసింది కేంద్ర ప్రభుత్వం. గ్యాస్ బుక్ చేసిన రెండున్నర రోజుల్లోనే సిలిండర్ డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. గతంలో నెలకొన్న జాప్యాన్ని నివారిస్తూ సరఫరా వ్యవస్థను వేగవంతం చేసినట్లు వెల్లడించింది.

**25 శాతం పెంచిన ఎల్పీజీ ఉత్పత్తి..** దేశీయ అవసరాలకు అనుగుణంగా ఎల్ ఎన్‌జి ఉత్పత్తిని 25 శాతం మేర పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది. పారిశ్రామిక అవసరాలతో పాటు గృహ వినియోగదారులకు ఎక్కడా అంతరాయం కలగకుండా చమురు సంస్థలు నిరంతరం పని చేస్తున్నాయి. ఉత్పత్తి సామర్థ్యం పెరగడం వల్ల నిల్వలు పెరిగాయి. దీనివల్ల బుకింగ్ చేసిన వెంటనే సిలిండర్లను పంపే వెసులుబాటు కలిగింది.

**హార్మూజ్ జలసంధితో సంబంధం లేకుండా** అంతర్జాతీయంగా హార్మూజ్ జలసంధి వద్ద నెలకొన్న ఉద్రిక్తతలు సరఫరాపై ప్రభావం చూపుతాయనే ప్రచారం సాగింది. అయితే కేంద్రం ఈ విషయంలో చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించింది. హార్మూజ్ జలసంధితో సంబంధం లేని ఇతర సురక్షిత మార్గాల ద్వారా చమురు దిగుమతులను భారత్ కొనసాగిస్తోంది. ఆ మార్గం ద్వారా నిలిచిపోయిన సప్లై కంటే కూడా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ మొత్తంలోనే చమురును సేకరించినట్లు ప్రభుత్వం గణాంకాలతో వివరించింది. అంతర్జాతీయ సవాళ్లు ఎదురైనా సరే దేశీయ ఇంధన భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని భరోసా ఇచ్చింది గ్యాస్ నిల్వలను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. త్వరలోనే రెండు భారీ ఎల్ ఎన్‌జి కార్గోలు భారత తీరానికి చేరుకోనున్నాయి. ఇవి రావడం వల్ల గ్యాస్ లభ్యత ఇంకా పెరుగుతుంది.




# అసత్యాలతో విషప్రచారం చేస్తున్న జగన్

- ఎవరి పాలనలో ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకుంటున్నారు
- ప్రజల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు

: మంత్రి వాసంశెట్టి సుభాష్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అబద్ధాలు, అసత్యాలతో కూటమి ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రంగా విమర్శించారు. జగన్ పాలనలో జరిగిన మోసాలు, దోపిడీలు ప్రజలకు ఇప్పటికే తెలుసని, అందుకే వైసీపీని ప్రజలు ఎన్నికల్లో ఓడించారని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ జగన్ వైఖరిలో మార్పు కనిపించడం లేదని మంత్రి ఆక్షేపించారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన ఆర్థిక దోపిడీ బాగోతాలు బయటపడుతున్నాయని, వాటికి సమాధానం చెప్పలేక కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు చేస్తున్నారని సుభాష్ విమర్శించారు. రాష్ట్రంలో అప్పులు పెరిగిపోతున్నా యంటూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఒక ప్రకటనలో ఆయన ధ్వజమెత్తారు. అప్పులు ఎలా పెరిగాయి, ఎవరి పాలనలో ఎంత పెరిగాయన్న విషయాలు ప్రజలకు స్పష్టంగా తెలుసని మంత్రి తెలిపారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీశారని, అప్పుల భారంతో రాష్ట్రాన్ని బలహీనపరిచారని విమర్శించారు. అభివృద్ధిని పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం ఉచిత పథకాలు, ప్రచారం పేరుతో భారీగా అప్పులు చేసి రాష్ట్రాన్ని దోపిడీ చేశారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అప్పులు పెట్టుబడులను ఆకర్షించేందుకు, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల సృష్టి కోసం వినియోగిస్తున్నామని సుభాష్ వివరించారు. జగన్ పాలన రాష్ట్రాన్ని అప్పుల భారంతో బలహీనపరిస్తే, కూటమి ప్రభుత్వం అప్పులను అభివృద్ధిగా మార్చే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పదకొండు మంది వైసీపీ ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలను కూడా జగన్ సరిగా అర్థం చేసుకోలేదని మంత్రి ఎద్దేవా చేశారు. పవన్ చేసిన వ్యాఖ్యలను పొగడ్తగా భావిస్తూ వైసీపీ నేతలు చంకలు బాదుకోవడం చూస్తే జాలివేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ప్రధాని అవుతారన్న వార్తలపై జగన్ అక్కసు వెళ్లగక్కడం సరికాదని సుభాష్ వ్యాఖ్యానించారు. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని, రాష్ట్ర ప్రయోజనాల కోసం అవకాశాలను త్యజించిన వ్యక్తి అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితేనే ప్రజలు విశ్వసిస్తారని జగన్‌కు మంత్రి సుభాష్ సూచించారు.

# దశాబ్దాల భూ వివాదాలకు నెల రోజుల్లో పరిష్కారం!

- భూ సమస్యకు శాశ్వత పరిష్కారం
- నెల్లూరు జిల్లా కలెక్టర్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లాలో దశాబ్దాలుగా రైతులను పీడిస్తున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తాము రూపొందించిన పకడ్బందీ విధానాన్ని నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రెజెంట్ చేశారు. పాత రికార్డులు,సరిహద్దు తగాదాల వల్ల భూ సమస్యల పరిష్కారం ఎందుకు కష్టమవుతుందో విశ్లేషిస్తూ, దానికి విరుగుడుగా అధికారులే నేరుగా ఒక గ్రామాన్ని నెల రోజుల వ్యవధిలో నాలుగు దఫాలుగా ఎలా సందర్శిస్తారో ఆయన వివరించారు.మొదటి విడతలో గ్రామస్తుల సమస్యలు వినడం, రెండో విడతలో రికార్డుల పరిశీలన, మూడో విడతలో డిజిటల్ సర్వే ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన, నాలుగో విడతలో పారదర్శకంగా తీర్పు చెప్పి అక్కడికక్కడే పట్టాలు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ అద్భుతమైన ప్రణాళిక ద్వారా కేవలం మూడు నెలల వ్యవధిలోనే 110 గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించగా, అందులో 26 గ్రామాలు పూర్తిగా భూ వివాద రహిత (జీరో పెండెన్సీ) గ్రామాలుగా ఎలా మారాయో కలెక్టర్ గణాంకాలతో సహా ప్రదర్శించారు.

### ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వలస కార్మికులను

# మోసాల నుంచి రక్షిస్తున్న సెంటర్ ఫర్ మైగ్రేషన్

- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

: కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విదేశాలకు వలస వెళ్లే కార్మికుల రక్షణ కోసం తీసుకువచ్చిన 'కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్' ఆవశ్యకతను కోనసీమ కలెక్టర్ ఆర్ మహేశ్ కుమార్ వివరించారు. తమ జిల్లా నుంచి సుమారు 15 వేల మంది గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నారని అయితే నకిలీ ఏజెంట్ల చేతిలో యువత మోసపోతూ పడుతున్న ఇబ్బందులను గమనించే జిల్లా రెవెన్యూ అధికారి నోడల్ అధికారిగా 5గురు సిబ్బందితో ఈకేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా 24 గంటలు పనిచేసే హెల్ప్‌లైన్ ప్రారంభించి ఇప్పటికే 199 దరఖాస్తులు పరిష్కరించామని,ఇబ్బందుల్లో ఉన్న 40 మంది వలస కార్మికులను సురక్షితంగా స్వదేశానికి రప్పించామని కలెక్టర్ తెలిపారు. ల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్ళే వారిలో చాలా మందికి అక్కడ ఉండే ఉపాధి పనులు, ఆహార అలవాట్లు,ఏఏ రంగాల్లో పనులు ఉంటాయనే వివరాలేమీ ముందుగా తెలియక అక్కడికి వెళ్లాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రయాణానికి ముందే యువతకు కౌన్సెలింగ్ ఇస్తూ, వారి పాస్‌పోర్ట్, వీసా, వెళ్లే కంపెనీ వివరాలను పోలీసుల సమన్వయంతో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వారిని విదేశాలకు పంపుతూ, హైదరాబాద్ పాస్‌పోర్ట్ అధికారుల శిక్షణతో ఈ కేంద్రాన్ని ఎలా నడిపిస్తున్నారో ఆయన చాలా స్పష్టంగా వివరించారు. ఈ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి థియేటర్లలో ప్రదర్శిస్తున్న 2 నిమిషాల వీడియో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.దీనిపై సియం చంద్రబాబు నాయుడు స్పందించి కలక్టర్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈవిధానాన్ని అన్ని జిల్లాలు అడాప్ట్ చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.అంతేక రాష్ట్ర స్థాయిలో జిఏడి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక మైగ్రేషన్ పోర్టల్ ను ఏర్పాటు చేసి రాష్ట్ర మంతటా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

### ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా

# ఏడు జిల్లాల కలెక్టర్ల అద్భుత ప్రజెంటేషన్లు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరో కలెక్టర్ల సదస్సులో భాగంగా మొదటి రోజున ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ఏడు జిల్లాల్లో విజయవంతంగా అమలవుతున్న వినూత్న ప్రాజెక్టుల (రాబషెవంం హ్రోశీతీఅవం) పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లలో ఆయా జిల్లాల కలెక్టర్లు కలెక్టర్లు తమ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధించిన వినూత్న ప్రాజెక్టుల గురించి వివరించారు. ఏఐ టెక్నాలజీతో మారుమూల గ్రామాల్లో సైతం ముందస్తుగానే జబ్బులను గుర్తించి ఉచిత వైద్యం అందిస్తున్న టెక్నాలజీ...చిత్తూరు జిల్లా: సంజీవని ప్రాజెక్ట్, గ్రామీణ ప్రజల ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చే 'సంజీవని ప్రాజెక్ట్' గురించి చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఐఏఎస్ తన ప్రజెంటేషన్‌లో వివరించారు.టాటా సహకారంతో ఏర్పాటు చేసిన 'డిజిటల్ నెర్వ్ సెంటర్' అనే ఏకీకృత ప్లాట్‌ఫామ్ ద్వారా జిల్లాలోని 119 ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేసి ఇప్పటికే 3 లక్షల 10 వేల మందికి పైగా పౌరులకు డిజిటల్ హెల్త్ రికార్డులు సృష్టించినట్లు ఆయన తెలిపారు. డాక్టర్లు అందుబాటులో లేని మారుమూల గ్రామాల్లో సైతం టెలీ కన్సల్టేషన్ ద్వారా రోగులకు సేవలు అందిస్తున్నామని, ఇందుకోసం వైద్యుల కోసం ఏఐ ఆధారిత యాంబియంట్ లిజనింగ్ టెక్నాలజీని కూడా వాడుతున్నామని ఆయన వివరించారు. పౌరుల కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్ తీసుకువచ్చామని, 'ట్రూ వెల్నెస్ మీటర్', 'కేర్ ప్లానోగ్రామ్' ద్వారా 12 రకాల ప్రాథమిక ఆరోగ్య సేవలను అందిస్తూ, సుమారు 63 వేల మందికి పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ప్రాణాపాయం రాకముందే వ్యాధులను పసిగట్టే వ్యవస్థను జిల్లాలో ఎలా అమలు చేస్తున్నారో వివరించారు.

# అనకాపల్లిలో జీరో వేస్ట్ రెసిడెన్షియల్ స్కూళ్లు

- చెత్త ద్వారా సర్క్యులర్ ఎకానమీ
- కలెక్టరుకు సీఎం అభినందనలు
- రాష్ట్రమంతటా ఈ పద్ధతి అమలు చేయాలని ఆదేశం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లను జీరోవేస్ట్ స్కూళ్లుగా మార్చుతూ ఆ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా అధికారులు చేసిన వినూత్న ప్రయత్నం జిల్లా కలెక్టర్ల సదస్సు దృష్టిని ఆకర్షించింది. జిల్లాలో 114 సంస్థల్లో చెత్త, వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడంలో జిల్లా కలెక్టర్ వినూత్నంగా వ్యవహరించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేస్తూ అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఆ దిశగా ఈ విద్యా సంస్థల్లో ఉన్న చదువుతున్న విద్యార్థులు ఈ చెత్తను పొడి చెత్త, తడి చెత్త వేరు చేసి పారేసేలా వారిలో చైతన్యం కల్పించారు. తడి చెత్తను కంపోస్టుగా తయారు చేయడానికి ఆయా స్కూల పరిధిలో ప్రత్యేకంగా గుంత తవ్వి అందులో వేశారు. ఈ చెత్తను కంపోస్టుగా తయారు చేయడానికి ప్రత్యేకంగా గుంతలు తవ్వి వాటిని రైతులకు ఉపయోగపడే ఎరువుగా తయారు చేస్తున్నారు. హాస్టళ్ల నుంచి వృధాగా వెళ్లే నీరులో హానికరం కాని నీరు, హానికర నీరు అని రెండుగా విడదీసి, అవి బయటకు వెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పొడి చెత్తను రీసైక్లింగ్ కోసం ఆయా పరిధిలోని స్వర్ణ సచివాలయానికి అందజేశారు. మురికి నీరును మున్సిపల్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటుకు పంపేలా ఏర్పాటు చేశారు. 114 స్కూళ్లలో 24,775 మంది విద్యార్థులకు ఇది లబ్ది కలిగింది. ఈ సంస్థల నుంచి ప్రతి నెలా 57.1 టన్నుల తడి చెత్త, 24.5 టన్నుల పొడి చెత్త పోగవుతోంది. ఈ చెత్తద్వారా హాస్టళ్లకు ప్రతి నెలా రూ.2.17 లక్షల ఆదాయం సమకూరుతోందని అనకాప్లి జిల్లా కలెక్టరు వివరించారు.

**సీఎం అభినందనలు**

జీరో వేస్ట్ సంస్థలుగా జిల్లాలో రెసిడెన్షియల్ స్కూళ్లను మార్చుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ చేసిన ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు.. ఈ మోడల్‌ను అన్ని జిల్లాల కలెక్టర్లు అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఒక మంచి పేరు సూచించాలన్నారు. కేవలం ఇంతటితో ఆగకుండా అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో వారి అవసరాలకు సరిపడేలా కూరగాయలు పండించేలా తోటలు సాగు కూడా చేపట్టాలని. తద్వారా కూరగాయల అవసరాల్లో సమృద్ధి సాధించవచ్చన్నారు. ఈ దిశగా కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

# దేశంలో ఇంధన సంక్షోభం..

- పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం
- ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం !
- పలు నగరాల్లో హోటల్స్, రెస్టారెంట్లు మూసివేత



న్యూఢిల్లీః పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేస్తూనే ఉన్నాయి. మరోవైపు ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలపై దాడులు చేస్తోంది. ప్రపంచ దేశాలకు చమురును సరఫరా చేసేందుకు కీలక మార్గమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ ఇప్పటికే మూసివేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో చమురు, గ్యాస్ కొరత నెలకొంది. ఇప్పటికే భారత్‌లో పలు నగరాల్లో హోటల్స్, రెస్టారెంట్లు మూసివేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇంధన కొరతను ఎదుర్కొనేందుకు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం (ఔఖీు) ఇవ్వాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. వెల్స్ ఫార్గో అనే ఫైనాన్సియల్ సర్వీస్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ దీని గురించి తన లింక్డిన్‌లో పోస్టు చేశారు. దేశంలో ఎల్‌పీజీ కొరత నెలకొన్న నేపథ్యంలో కంపెనీలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం కేటాయించాలని సూచించారు. ప్రతిరోజూ వేలాది మంది ఉద్యోగులు దూర ప్రయాణాలు చేస్తారని వాళ్లతో ఇంటి నుంచే పని చేయించుకుంటే ఇంధనం ఆదా అవుతుందన్నారు. దీనివల్ల ఆస్పత్రులు, లాజిస్టిక్స్, ప్రజా రవాణా లాంటి అత్యవసర రంగాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కంపెనీలు సామాజిక బాధ్యతతో ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

సోషల్ మీడియా చంద్రశేఖర్ చేసిన పోస్టు వైరల్ అవుతోంది. అయితే భారత్‌లో ఇంధన కొరత ప్రభావం అంతగా లేదని మీడియా, సోషల్ మీడియాలో మాత్రమే దీనిపై హైప్ క్రియేట్ చేస్తున్నారని కొందరు అంటున్నారు. రాబోయే 10-20 రోజుల్లో ఈ పరిస్థితులు సద్దుమణుగుతాయని చెబుతున్నారు.

మరికొందరు మాత్రం చంద్రశేఖర్ చెప్పిన విషయాన్ని సమర్థిస్తున్నారు. దేశంలోని ప్రతిరోజూ లక్షలాది మంది కార్లు, బైకులపై తమ కంపెనీలకు వెళ్తారని.. దీనివల్ల చమురు ఎక్కువగా అవసరం అవుతుందని అంటున్నారు. ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం కేటాయిస్తే ఇంధన కొరత ఉండదని చెబుతున్నారు. కంపెనీలు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

మరోవైపు దేశంలో ప్రస్తుతం ఎల్పిజి కొరత ప్రభావం కనిపిస్తోంది. ఇప్పటికే ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు మూసివేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. హైదరాబాద్‌లో కూడా ఇలాంటి పరిస్థితులే తలెత్తున్నాయని ప్రచారం నడుస్తోంది. అయితే కేంద్రం మాత్రం దీనిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ౹ూ+ ఉత్పత్తిని 10 శాతం పెంచినట్లు పేర్కొంది.

### ఇచ్చిన హామీలు

# అమలు చేయకుండా కొత్త హామీలు

- పెళ్ళి కానుక ఇవ్వని సీఎం మూడో బిడ్డకు డబ్బులు ఎలా ఇస్తారు
- టీడీపీ ప్రభుత్వంపై జగన్ విమర్శలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం తాడేపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కొత్త హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో పెళ్లి అయిన ప్రతి జంటకు 'చంద్రన్న పెళ్లి కానుక'గా ఆర్థిక సహాయం ఇస్తామని ప్రకటించారని జగన్ గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని ఆయన అన్నారు. "పెళ్లి కానుకే ఇవ్వని వారు ఇప్పుడు మూడో బిడ్డ పుడితే డబ్బులు ఇస్తామని చెబుతున్నారు. ప్రజలు ఈ మాటలను ఎలా నమ్మాలి?" అంటూ ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వం జనాభా పెంపు పేరుతో మూడో బిడ్డ పుట్టిన కుటుంబాలకు ప్రోత్సాహకాలు ప్రకటించడం కంటే ముందుగా ఎన్నికల హామీలను అమలు చేయాలని జగన్ సూచించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఇక తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా ఉన్న బీఆర్ నాయుడు నియామకంపై కూడా జగన్ ప్రశ్నలు లేవనెత్తారు. వివాదాలు ఉన్న వ్యక్తికి ఇంత పెద్ద బాధ్యత ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ సమావేశాలపై కూడా జగన్ స్పందిస్తూ, ప్రజా సమస్యలపై సరైన చర్చ జరగలేదన్నారు. రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మృతి చెందిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పెన్షన్‌లే తొలగించాం

- 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ లో కేటాయించిన నిధులకు అదనంగా బేవరేజెస్ కార్పొరేషన్ నిధుల నుండి రూ. 11,140.46 కోట్లు ఖర్చు చేసిందన్న మంత్రి
- గత ప్రభుత్వంలో సిక్స్ స్టెప్ వ్యాలీడేషన్ పేరుతో 11 లక్షల పెన్షన్లను అన్యాయంగా తొలగించారు
- గత ప్రభుత్వంలో 14.54 లక్షల మరణాలు,శాశ్వత వలసల కారణంగా పెన్షన్లు తొలగించింది.సగటున నెలకు 24,244 పెన్షన్లు తగ్గాయి : మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం మృతి చెందిన,శాశ్వతంగా వలసవెళ్లిన పెన్షన్లు మాత్రమే రద్దయ్యాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఖండించారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఆరు నెలలకు సిక్స్ స్టెప్ వ్యాలీడేషన్ పేరుతో 5 ఏళ్లలో ఏకంగా 11 లక్షలకు పైగా పెన్షన్లు రద్దు చేసి పేదల పొట్టగొట్టారని కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు.గత ఐదేళ్ల పాలన కాలంలో ఇష్టం వచ్చినట్టు పెన్షన్లు తొలగించారని, ఈ ప్రభుత్వం 20 నెలల పాలనలో అన్యాయంగా ఒక్క పెన్షన్ కూడా తొలగించలేదని, పేదలకు అన్యాయం చేసే ఉద్దేశం తమకు లేదని మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతి నుంచి, ప్రతీ నెలా స్పౌస్ పెన్షన్ కోటాలో వితంతువులకు పెన్షన్ మంజూరు చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.నెల నెలా స్పౌస్ పెన్షన్ లను మంజూరు చేస్తుంటే, ఏ ఒక్క పెన్షన్ మంజూరు చేయలేదని ఒక మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. వారి సొంత టీవీ ఛానెల్స్ లో, పెయిడ్ మీడియాలో 6 లక్షల పెన్షన్ లు తొలగించారు, ఇంకో 7 లక్షల 46 వేల పెన్షన్ లు తొలగిస్తారు అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని కొండపల్లి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం౼ాజు చీశీ 31 శీట 2021 ప్రకారం బెవరేజెస్ కార్పొరేషన్ నిధుల ద్వారా వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు చట్టం చేశారని, గత ప్రభుత్వం 2021-24 మధ్య కాలంలో బేవరేజెస్ కార్పొరేషన్ నుండి ?18,472.59 కోట్లు ఖర్చు చేసిందని తెలిపిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు రూ. 11 వేల 140.46 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని వివరించారు.

బేవరేజెస్ కార్పొరేషన్ వారు ఇచ్చే నిధుల వివరాలు ప్రభుత్వ బడ్జెట్ లో చూపించడం లేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా సామాజిక భద్రతా పెన్షన్ ల కోసం గానూ, 2026-27 ఆర్థిక సంవత్సరంలో 27 వేల 719 కోట్ల రూపాయలను బడ్జెట్ లో ప్రతిపాదించడం జరిగిందని, పెన్షన్ లకు కావాల్సిన మరో రూ.5 వేల 766 కోట్ల రూపాయలను పైన పేర్కొన్న యాక్ట్ ప్రకారం(ఖఫ్ అశీ 31 అఫ్ 2021) బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి ఖర్చు చేయబడుతుందని మంత్రి వివరించారు. పెన్షన్ లకు ఏ విధమైన ఆర్థిక ఇబ్బందులు రాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం చేసే ఏ విధమైన రాజకీయ ప్రకటనలను ప్రజలు నమ్మవద్దని ప్రజలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# కలిసి పనిచేద్దాం.. కలిసి సాధిద్దాం

- క్వాంటం వ్యాలీ ప్రపంచానికి ఆదర్శంగా నిలవబోతోంది
- 2.4 ట్రిలియన్ ఎకానమీ దిశగా ఏపీ ఎదగబోతోంది
- రూ.55 లక్షల తలసరి ఆదాయ సాధన దిశగా ప్రయత్నాలు
- ప్రభుత్వ ఆశయాలు సాధనకు అధికారులు కృషి చేయాలి
- వాట్సాప్‌గవర్నెన్స్ వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలను ప్రతిఫలించేవిదంగా అధికారులు అంతా కలిసి పనిచేసి, కలిసి సాధించేలా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లు, అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రభుత్వ ఆశయాలు, లక్ష్యాలను జిల్లా కలెక్టర్లకు వివరించారు. ప్రభుత్వ విధానాలను మరింత మెరుగైన రీతిలో అమలు చేసేందుకు అధికారుల పనితీరు మదింపు వేసేందుకు ఈ సమావేశం దోహదపడుతుందన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా రూ.55 లక్షల తలసరి ఆదాయం సాధించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని దీనికి అధికార యంత్రంగం చిత్తశుద్ధితో పని చేయాల్సిన అవసరముందని చెప్పారు. 2.4 ట్రిలియన్ ఎకానమీ దిశగా రాష్ట్రం పయనిస్తోందన్నారు. ప్రభుత్వ సేవల కోసం పౌరులెవ్వరూ కూడా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి మొబైల్ ఫోను ద్వారానే ప్రభుత్వ సేవలన్నీ పొందేలా ముఖ్యమంత్రి ఒక సదాశయంతో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకొచ్చారన్నారు. దీన్ని ప్రజలంతా సమర్థవంతంగా ఉపయోగించుకునేలా, మనమిత్ర ఎక్కువగా వినియోగించుకునేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు రావడానికి అవసరమైన సంస్కరణలు, చర్యలు, విధానాలను సమగ్రంగా అవలంభించాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన విధానాలను సమర్థంగా అమలు చేయడం ద్వరానే ప్రజలకు ప్రయోజనాలు అందుతాయన్నారు. క్వాంటం వ్యాలీ ఏర్పాటుతో కంప్యూటింగ్ రంగంలో అమరావతి దేశంలోనే అగ్రస్థానంలోనే నిలుస్తోందని చెప్పారు. క్వాంటం వ్యాలీ దేశానికి, ప్రపంచానికి ఒక ఆదర్శంగా నిలుస్తుందని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో రూపొందించిన విధనాలు, లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసేలా ఈ కలెక్టర్ల సదస్సు ఉపకరిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనల్ని, నిర్దేశించిన లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేద్దామని తెలిపారు. పీపీపీ విధానంలో కూడా వివిధ ప్రాజెక్టులను అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిచేలా పనిచేద్దామన్నారు.

ప్రైవేటు రంగాన్ని అనుమాన కోణంలో చూడవద్దని కోరుతున్నా, వారిని కూడా పాలనలో భాగస్వామ్యం చేసి, సత్ఫలితాలు సాధించే దిశగా పనిచేయాలని ఆయన సూచించారు.

# జగన్ చిట్టా కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంది

- జగన్ హయాంలో రాష్ట్రం దివాలా తీసింది
- వింత పాలసీలతో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసారు
- జగన్ ప్రభుత్వం మహిళల మాంగల్యాలను తెంపిందని వ్యాఖ్య
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఘాటు వ్యాఖ్యలు



ఏపీ స్టేట్ బ్యూరో,అమరావతి : కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా నాశనం చేసిందంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఘాటుగా స్పందించారు. జగన్ హయాంలో రాష్ట్రం దివాలా తీసిందని, ఇప్పుడు ఆయన ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. "జగన్ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. చివరకు మున్సిపల్ కార్యాలయాలను కూడా తాకట్టు పెట్టారు. దేశంలో ఎక్కడా లేని వింత పాలసీలతో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు" అని కలిశెట్టి ఆరోపించారు. జగన్ చిట్టా మొత్తం కేంద్రం వద్ద ఉందని, ఆయన ఢిల్లీకి లేఖలు రాసినా ప్రయోజనం ఉండదని అన్నారు.ఐదేళ్ల పాలనలో నకిలీ మద్యం విక్రయాల ద్వారా జగన్ ప్రభుత్వం మహిళల మాంగల్యాలను తెంపిందని కలిశెట్టి విమర్శించారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా జగన్ ఇప్పుడు సంస్కరణల గురించి మాట్లాడుతున్నారని, ఆయన ప్రెస్ మీట్లు పెట్టుకోవచ్చు కానీ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు.డిప్యూటీ సీఎం చెప్పినట్టు పవన్ కల్యాణ్ చెప్పినట్లుగా భవిష్యత్తు తరాల సంపద కోసం చంద్రబాబు పాలన అవసరమని, అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని కలిశెట్టి పేర్కొన్నారు. పవన్ వ్యాఖ్యలతో జగన్ గుండెల్లో గుబులు మొదలైందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు, పింఛన్లు ఇస్తోందని.. తల్లికి వందనం, ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమిపై అనవసర ఆరోపణలు చేయడం జగన్ మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

### పన్ను కట్టాలన్నా.. కంప్లైంట్ ఇవ్వాలన్నా

# పడిగాపులు అక్కర్లేదు.. ఒక్క క్లిక్‌చాలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విశాఖ నగరవాసులకు పాలనను మరింత సులభతరం చేసే 'వైజాగ్ వన్' అప్లికేషన్ పనితీరును విశాఖపట్నం కలెక్టర్ హరీంద్ర ప్రసాద్ ప్రజెంటేషన్ చేశారు. పౌరులు తమ ఫిర్యాదులు, పన్నుల చెల్లింపుల కోసం వేర్వేరు యాప్స్ వాడకుండా అన్ని పౌర సేవలను ఒకే గొడుగు కిందికి ఎలా తెచ్చామో తెలిపారు.ఆస్తి పన్ను, నీటి బిల్లులు చెల్లించడంతో పాటు పీజీఆర్ఎస్ అనుసంధానంతో సమస్యలను మొబైల్‌లోనే నమోదు చేసి వాటి పరిష్కార స్థితిని సులభంగా ట్రాక్ చేయవచ్చన్నారు. అంతే కాకుండా ఏఐ చాట్‌బాట్ సాయంతో ప్రజల సందేహాలను 24 గంటలూ పరిష్కరిస్తున్నామని, గాలి నాణ్యతను ఎప్పటికప్పుడు తెలుసుకునే సదుపాయం, ఆసుపత్రులు, అత్యవసర సేవలను ఒకే క్లిక్‌తో తెలుసుకునేలా యాప్‌ను పౌర కేంద్రంగా ఎలా తీర్చిదిద్దారో కలెక్టర్ వివరించారు. నగర ప్రజలకు పౌర సేవలు, ఫిర్యాదుల నమోదు, పన్నుల చెల్లింపులు వంటి వాటన్నింటినీ ఒకే వేదికపై ఎలాంటి ఆటంకాలు లేకుండా అందించే 'సింగిల్ టచ్ పాయింట్' గా ఈ ఏకీకృత మొబైల్ యాప్‌ను ఎలా తీర్చిదిద్దామో ఆయన ప్రదర్శించారు. కేవలం బిల్లులు కట్టడానికే కాకుండా, రియల్ టైమ్‌లో నగరంలోని గాలి నాణ్యత వివరాలను, ఇతర ముఖ్యమైన పౌర సమాచారాన్ని ప్రజలు తమ మొబైల్‌లోనే సులభంగా చూసుకునేలా దీన్ని రూపొందించామన్నారు. అలాగే, అత్యవసర సమయాల్లో ఉపయోగపడే కీలకమైన ఆసుపత్రులు, అధికారుల కాంటాక్ట్ నంబర్లను సులభంగా యాక్సెస్ చేసుకునేలా ఇందులో పొందుపరిచామని, ఎప్పటికప్పుడు నగరవాసులను సమాచారంతో అప్రమత్తం చేసేందుకు వీలుగా 'పుష్ నోటిఫికేషన్స్ మరియు అలర్ట్స్'సదుపాయాన్ని కూడా ఈ యాప్‌లో ఎలా అనుసంధానం చేశామో కలెక్టర్ తమ ప్రజెంటేషన్‌లో తెలిపారు.



# ముగ్గురు ముద్దు

## దేశంలో జనాభా పెరుగుదల అవశ్యం
## జనాభా పెరుగుదల కోసం ఏపీ సర్కారు సరికొత్త యత్నం

**మూడో బిడ్డను కంటే పాతికవేలిస్తాం అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ఆసక్తికర ప్రతిపాదన చేసింది. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటించారు. అంతేకాదు, ముగ్గురు పిల్లల్ని కనేవారి కోసం ఎన్నో హామీలు ప్రకటించారాయన. మరో అడుగు ముందుకేసి ఈ ప్రతిపాదనలను, ఎక్కువ మంది పిల్లల్ని కనాల్సిన అవసరాన్ని చాటి చెబుతూ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు ఏపీ శాసనసభలో సీఎం చంద్రబాబు పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ ప్రకటించారు. జనాభా పెరుగుదల ఆవశ్యకత ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలలకే అవశ్యం అన్నది నిపుణుల చెప్పిన మాట. మరిన్ని వివరాలలోకి వెళితే...**


జనాభా పెరుగుదల మంచిదా.. కాదా. ఈ ప్రశ్నకు ఒక్కోసారి ఒక్కో సమాధానం వస్తుంది. ఎందుకంటే ఎక్కువ జనాభా ఉంటే.. అవకాశాలు, వనరులు, సౌకర్యాలు తక్కువగా ఉంటాయి. అలాంటప్పుడు తక్కువ జనాభా ఉండటమే బాగుంటుంది అనిపిస్తుంది. కానీ.. తక్కువ జనాభా ఉంటే పనిచేసే వారు లేక ఆ దేశంలో ఉత్పత్తులు తగ్గి.. అభివృద్ధి కుంటుపడుతుంది. ఈ క్రమంలోనే ఈ విషయంలో ప్రభుత్వాలు కూడా అయోమయంలో పడుతూ ఉంటాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కొన్ని దేశాలు.. జనాభాను పెంచుకునేందుకు తంటాలు పడుతున్నాయి. ఇందుకోసం అనేక చర్యలు చేపడుతున్నాయి. ప్రపంచ జనాభా ఇప్పటికే 8 బిలియన్లు దాటిపోయింది. అయితే ఇందులో ఎంత మంది పనిచేసేవారు ఉన్నారు. పనిచేసే జనాభా ఎక్కువ ఉన్న దేశాలేవీ. అసలు జనాభాను పెంచేందుకు ప్రభుత్వాలు ఏమేం చేస్తున్నాయో ఈ స్టోరీలో చూద్దాం

జననాల రేటు పెంచడానికి ఏపీ ప్రభుత్వం ఏ . పోషణ-శిక్షా-సురక్ష ప్యాకేజ్ఏ ఇస్తోంది. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇవ్వటం ద్వారా జనాభా నిర్వహణకు మద్ధతు ఇచ్చేలా చర్యలు ప్రారంభించింది. పిల్లలు లేక, ఫెర్టిలిటీ సమస్యతో బాధపడుతున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుంది. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసి సబ్సిడీపై పీపీపీ మోడల్‌లో ఐవీఎఫ్ సేవలు అందించాలని యోచిస్తున్నారు.. “మూడో సంతానం, ఆపై జననాలకు 12 నెలల పేరెంటల్ లీవ్ – తండ్రులకు 2 నెలలు పెటర్నల్ లీవ్ ఇవ్వాలని ఆలోచన చేస్తున్నాం. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీలో భాగంగా చైల్డ్ కేర్ టేకర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని సిఎం చంద్రబాబు. చెప్పారు. “రాష్ట్రంలో 1.5గా ఉన్న టోటల్ ఫెర్టిలిటీ రేట్‌ను 2.1కు తీసుకువెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. మూడో సంతానానికి పోషణ-శిక్షా-సురక్ష ప్యాకేజ్ పేరిట డెలివరీ సమయంలో రూ.25,000 ప్రోత్సాహకం ఇవ్వాలని ప్రతిపాదన చేస్తోంది.. మూడో సంతానానికి 5 సంవత్సరాల పాటు నెలకు పోషణ కింద రూ.1,000 సాయం, 18 ఏళ్ల వరకు ఉచిత విద్య అందిస్తాం అని చంద్రబాబు ప్రకటించారు . దీనిపై ప్రజాభిప్రాయం తీసుకుంటామని ఆయన తెలిపారు. దేశంలో జననాల రేటు పెంచడం కోసం ఒక ప్రభుత్వ శాఖను ఏర్పాటు చేయగా, ఇక గ్రీస్ కూడా ఈ అంశంపై చర్యలు ప్రారంభించడం విశేషం.

చంద్రబాబు ఉద్దేశం సరైనదే అయినప్పటికీ, ఆచరణలో కొన్ని మార్పులు కావాలంటున్నారు విశ్లేషకులు. ఈ రోజుల్లో 25 వేల కోసం మూడో బిడ్డను ఎవరూ కనరు. దానికంటే ఫెర్టిలిటీ సెంటర్ల ముందు క్యూ కడుతోన్న జంటలకు, పిల్లలు పుట్టే నిమిత్తం వైద్యం కోసం సహాయం చేయాలి. రాష్ట్రంలోని ఫెర్టిలిటీ సెంటర్లన్నిటినీ నమోదు చేసి, వారికి ఒక వ్యవస్థ ఏర్పాటు చేసి, అందుకోసం ప్రభుత్వం అవసరమైతే ఒక కమిషనర్‌ను పెట్టి, చికిత్సకు డబ్బులివ్వాలి అని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పెంటపాటి పుల్లారావు అన్నారు. ఆరోగ్యవంతమైన పౌరుల కోసం మేనరికాలు, కజిన్ల మధ్య పెళ్లిళ్లు ఆపాలనీ దాని వల్ల ఆరోగ్యవంతులైన పిల్లలు పుట్టడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. నైపుణ్యాలు నేర్పించాలిఏపీ ప్రభుత్వ ప్రతిపాదనల్లో వృద్ధుల గురించి విస్తృతంగా చర్చించిందని చెప్పారు . వాస్తవానికి అభివృద్ధి చెందిన దేశాల ముందున్న పెద్ద సమస్యల్లో ఇదొకటి. అయితే, ఆ సమస్యను ఎదుర్కోవడానికి వారికి ఉన్న వసతులు, ఆర్థిక పరిస్థితి ఏపీ-భారత్‌కు ఉన్నాయా అన్నదే ప్రశ్న అని అన్నారు. వృద్ధులకు అదనంగా నైపుణ్యాలు నేర్పించడం, వారిని ఆరోగ్యంగా ఉంచడం, ఎవరిపై ఆధారపడకుండా ఉండే పరిస్థితి తెప్పించడం మంచి ఆలోచన అన్నారు. ఇప్పుడు ఈ వృద్ధుల సమస్యపై చర్చ ఎందుకు అంటే, ఆంధ్రాలో వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. 2047 నాటికి 23 శాతం వృద్ధులు ఉండే అవకాశం ఉందని అంచనా. అయితే అంతమంది వృద్ధులకు తగిన వనరులు, వసతులు, ఆర్థిక స్థితి ఆంధ్రప్రదేశ్ దగ్గర లేదని తెలుస్తోంది. యూరోప్‌ను ఉదాహరణగా తీసుకుంటే, అక్కడ అభివృద్ధి, ఆదాయం రెండూ క్రమంగా పెరిగాయి, అదే సమయంలో ఫెర్టిలిటీ నిదానంగా తగ్గింది. ఫ్రాన్స్, స్వీడన్ వంటి దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరగడానికి సుమారు శతాబ్దం పడితే, ఏపీలో 30 ఏళ్లకే ఆ పరిస్థితి వస్తోంది. ఎందుకంటే, అక్కడి కంటే ఇక్కడ కఠినమైన కుటుంబ నియంత్రణ అమలైంది. అంటే, ఆంధ్రప్రదేశ్ ధనవంతమైన రాష్ట్రంగా మారేలోపు వృద్ధాప్య రాష్ట్రంగా మారబోతోంది. యూరోప్ కంటే మూడొంతుల ఎక్కువ వేగంతో ఇక్కడ ఫెర్టిలిటీ పడిపోయింది. అదేసమయంలో, యూరోప్ కంటే 30 రెట్ల తక్కువ తలసరి ఆదాయం ఇక్కడ నమోదైంది. సరిగ్గా ఆ సమస్యను ఏపీ అడ్రస్ చేయాల్సి ఉంది. .

**జనాభా పెరుగుదలకు ప్రపంచ దేశాలు ఏం చేస్తున్నాయి..**

**823 కోట్ల మందిలో పనిచేసేవారు ఎంతమంది?** ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ జనాభా పెరుగుతూనే ఉంది. మరణాల కంటే జననాల రేటు ఎక్కువగా ఉండటంతో.. దాదాపు అన్ని దేశాల్లోనూ జనాభా పెరుగుతోంది. అయితే భారత్ సహా కొన్ని దేశాల్లో యువ జనాభా అధికంగా ఉండి.. పనిచేసే వారి సంఖ్య ఎక్కువగా ఉండటం మంచిదే అయినప్పటికీ.. చైనా సహా మరికొన్ని దేశాల్లో వృద్ధ జనాభా పెరుగుతుండటం ఇప్పుడు తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో ఆయా దేశాలు జనాభాను పెంచుకునేందుకు చర్యలు చేపడుతున్నాయి. పెళ్లిళ్లకు దూరంగా ఉండే యువతీయువకులను.. వివాహబంధంలోకి అడుగుపెట్టేలా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక ఇప్పటికే ప్రపంచ జనాభా 800 కోట్లు దాటిపోయింది. ఇందులో భారత్, చైనా దేశాలే దాదాపుగా 300 కోట్ల జనాభాను కలిగి ఉన్నాయి. ఇందులో పనిచేసే జనాభా కూడా ఈ రెండు దేశాల్లో సంఖ్యాపరంగా అధికంగానే ఉంది. అయితే 4, 5 ఏళ్ల క్రితం వరకు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా చైనా ఉండగా.. ఆ స్థానాన్ని భారత్ అధిగమించింది.



ప్రపంచంలోనే అత్యధిక జనాభా భారత్‌లోనే!ఇటీవల ఐక్యరాజ్యసమితి చెప్పిన వివరాల ప్రకారం.. భారతదేశ జనాభా 146 కోట్లు దాటింది. ప్రపంచంలోనే ఎక్కువ జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించినప్పటికీ.. ఇదే స్థాయిలో జనాభాను కొనసాగించడానికి అవసరమైన జననాల పెరుగుదల కన్నా జననాల రేటు తక్కువగా ఉందని తెలిపింది. దేశంలో జననాల రేటు 1.9కి తగ్గినట్లు వెల్లడించింది. దేశంలో జననాల రేటు తగ్గినా యువ జనాభా బాగానే ఉన్నట్లు పేర్కొంది. మొత్తం జనాభాలో 24 శాతం మంది 0-14 ఏళ్ల వయసు.. 10-19 ఏళ్ల వయసు 17 శాతం మంది.. 10-24 ఏళ్ల మధ్య 26 శాతం మంది ఉన్నారని వివరించింది. ఇక భారతదేశ జనాభాలో 68 శాతం మంది పనిచేసే వయసు (15-64 ఏళ్ల మధ్య)లో ఉన్నారని.. 65 ఏళ్లు దాటిన వారు 7 శాతం ఉన్నట్లు తెలిపింది. రానున్న 10, 20 ఏళ్లల్లో దేశంలో వృద్ధుల జనాభా భారీగా పెరగనుందని స్పష్టం చేసింది.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు.. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు, జనాభా క్షీణత లేదా వృద్ధ జనాభా అనే తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. దీనికి ప్రధాన కారణం జననాల రేటు 2.1 కంటే తక్కువకు పడిపోవడమేనని నిపుణులు చెబుతున్నారు. దీంతో శ్రామిక శక్తి తగ్గిపోయి, వృద్ధుల సంఖ్య పెరిగి తీవ్ర భారం పడుతోంది. ఇలాంటి పరిస్థితిని అరికట్టేందుకు ప్రపంచ దేశాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి.

జనాభాక్షీణతకు ప్రధాన కారణాలు:

**తక్కువ జననాల రేటు :** విద్య, ఉద్యోగ అవకాశాల పట్ల మహిళలకు ఆసక్తి పెరగడం.. పెళ్లి వయసు పెరగడం, ఆర్థిక భారం, పిల్లలను పెంచే ఖర్చు, పెంపకంలో పురుషుల నుంచి భాగస్వామ్యం లేకపోవడం, ఉద్యోగం-కుటుంబ జీవితాన్ని సమన్వయం చేసుకోవడంలో సవాళ్లు వంటివి జననాల రేటు తగ్గడానికి ప్రధాన కారణాలు అని నిపుణులు చెబుతున్నారు.

**జీవన వ్యయం :** పట్టణ ప్రాంతాల్లో భారీగా పెరిగిన జీవన వ్యయం వల్ల.. పిల్లల పెంపకం ఖర్చులు విపరీతంగా పెరగడంతో చాలామంది దంపతులు ఒక్కరు పిల్లలతోనే సంతానోత్పత్తిని ఆపేస్తున్నారు. ఇక మరికొందరు అయితే అసలు పిల్లలనే కనడానికి ఇష్టపడట్లేదు.

**వివాహాల పట్ల నిరాసక్తి:** చాలా దేశాల్లో యువత వివాహాల పట్ల ఆసక్తి చూపడం లేదు. మరికొంత మంది చాలా ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకుంటున్నారు.

**జనాభా క్షీణతను అరికట్టడానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు:** ప్రపంచంలోని వివిధ దేశాలు ఇప్పటికే ఈ జనాభా క్షీణత అనే సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో జనాభాను పెంచేవిధంగా ప్రజలను ప్రోత్సహిస్తున్నాయి. ఇందుకోసం రకరకాల విధానాలను అనుసరిస్తున్నాయి.

**1.—ఆర్థిక ప్రోత్సాహకాలు :**

**పిల్లలు పుడితే బోనస్‌లు, నగదు బహుమతులు:** దక్షిణ కొరియాప్రపంచంలోనే అతి తక్కువ జననాల రేటు (0.72) ఉన్న దేశంగా దక్షిణ కొరియా నిలిచింది. దీంతో పిల్లలను కనే తల్లిదండ్రులను దక్షిణ కొరియా ప్రభుత్వం బాగా ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ప్రతి బిడ్డకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు 59 వేల పౌండ్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 61 లక్షల వరకు నగదు ప్రోత్సాహకం ఇచ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఈ దిశగా కొన్ని పథకాలను అమలు చేస్తోంది.ఫ్రాన్స్ఇక ఫ్రాన్స్‌లో బిడ్డ పుట్టినప్పుడు వెయ్యి డాలర్లు అంటే మన కరెన్సీలో సుమారు రూ. 83 వేల నగదు ప్రోత్సాహం ఇస్తోంది. అంతేకాకుండా పుట్టిన బిడ్డకి 3 ఏళ్లు వచ్చే వరకు నెలవారీగా ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది.స్పెయిన్పిల్లలను కనే తల్లిదండ్రులకు స్పెయిన్ ప్రభుత్వం ట్యాక్స్ నుంచి విముక్తి కల్పిస్తోంది. స్పెయిన్‌లో పిల్లలు పుట్టిన వారికి పన్నుల నుంచి ఏడాది పాటు నెలకు 400 డాలర్లు అంటే సుమారు రూ. 32 వేల మినహాయింపు ఇస్తోంది. అంతేకాకుండా ప్రజా రవాణాలో రాయితీలు కూడా కల్పిస్తోంది. జపాన్జపాన్‌లోని ఫుమియో కిషిడా ప్రభుత్వం పిల్లల సంరక్షణ విధానాల కోసం ఏకంగా 3.6 ట్రిలియన్ యెన్‌లు అంటే సుమారు 2 లక్షల కోట్ల భారీ నిధులను కేటాయించింది. ఇది పిల్లలను కనడానికి ఆసక్తిగా ఉన్న తల్లిదండ్రులకు, శిశు సంరక్షణ కార్మికులకు ఉపయోగిస్తున్నారు. జపాన్‌లో జననాల రేటు 1.1కి పడిపోగా.. వృద్ధ జనాభా 40 శాతానికి చేరుకుంది. దీన్ని సైలెంట్ ఎమర్జెన్సీగా జపాన్ పరిగణిస్తోంది. కొత్తగా పెళ్లి చేసుకున్నవారికి ప్రోత్సాహకాలు, చిల్డ్రన్ కేర్ పాలసీ కింద భారీ నిధులు కేటాయించినప్పటికీ.. పెళ్లిళ్ల పట్ల, పిల్లలను కనడం పట్ల యువతలో ఆసక్తి లేకపోవడం జపాన్‌కు ప్రధాన సమస్యగా మారింది.ఇటలీఇటలీ ప్రభుత్వం మరింత వినూత్నంగా ఆలోచిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మూడో బిడ్డను కన్న వారికి ఉచితంగా భూమిని అందిస్తోం ది. గ్రీస్మారుమూల ద్వీపంలోని గ్రీస్‌లో నివసించేందుకు వచ్చిన వారికి ఇంటిని నిర్మించుకునేందుకు సహాయంతోపాటు ఏటా 3 వేల యూరోలు అంటే సుమారు రూ. 2.7 లక్షలు గ్రాంట్ల రూపంలో అందిస్తోంది.

**2. తల్లిదండ్రులకు సహాయక వ్యవస్థలు:పేరెంట్ లీవ్:** జర్మనీ:పిల్లలకు జన్మనిచ్చిన తండ్రులకు కూడా జీతంతో కూడిన సెలవులు ఇస్తున్నారు. ఏడాది కాలం పాటు 75 శాతం జీతాన్ని అందిస్తున్నారు. ఇలా చేయడం వల్ల పిల్లలను పెంచడంలో తల్లిదండ్రులిద్దరి భాగస్వామ్యం ఉంటుందని భావిస్తున్నారు. జర్మనీ మాత్రమే కాకుండా అనేక యూరోపియన్ దేశాలు కూడా ప్రసూతి, పితృత్వ సెలవులను అందిస్తున్నాయి. చైల్డ్ కేర్ సౌకర్యాలు:డే కేర్ సెంటర్లు, ప్రీ-స్కూల్స్ ఏర్పాటు చేయడం. వర్క్ లైఫ్ బ్యాలెన్స్:వర్క్ లైఫ్ బ్యాలెన్స్ చేసేందుకు తల్లిదండ్రులకు వీలైన సమయంలో వర్కింగ్ అవర్స్, వర్క్ ఫ్రమ్ హోం కల్పించడం వల్ల తల్లిదండ్రులు వృత్తి జీవితంతోపాటు కుటుంబ జీవితాన్ని సమన్వయం చేసుకోవచ్చు.

**3. సామాజిక, సాంస్కృతిక మార్పులు:మహిళల భాగస్వామ్యం:** మహిళలను వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకునేలా ప్రోత్సహించడం. వారిపై ఉన్న సామాజిక భారాన్ని తగ్గించడం. పిల్లల పెంపకంలో పురుషుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం. వృద్ధుల జనాభాను సద్వినియోగం చేసుకోవడం:వృద్ధులను ఆరోగ్యంగా, చురుకుగా ఉంచేందుకు పలు కార్యక్రమాలు చేపట్టడం. వారికి పని చేసే అవకాశాలు కల్పించడం ద్వారా వారు సమాజానికి ఉపయోగపడేలా చేయడం. వలస విధానాలు:జనాభా క్షీణతను ఎదుర్కోవడానికి కొన్ని దేశాలు విదేశాల నుంచి వలసదారులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీనివల్ల శ్రామిక శక్తి కొంత తీర్చుకోవచ్చు. ఇందులో భాగంగానే ఇంటి పనుల భారాన్ని తగ్గించేందుకు దక్షిణ కొరియా విదేశాల నుంచి పనిమనుషులను అనుమతిస్తోంది.


**యువతకు కౌన్సిలింగ్:** పెళ్లి చేసుకోవడానికి, పిల్లలను కనడానికి నిరాకరిస్తున్న యువతకు కౌన్సిలింగ్ అందించడం. జనాభా క్షీణత అనేది కేవలం దేశంలో జనాభా తగ్గిపోవడం మాత్రమే కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థ, సామాజిక నిర్మాణం, సంస్కృతిపై దీర్ఘకాలిక ప్రభావం చూపే ఒక పెద్ద సమస్య. దీన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు, సమాజం, వ్యక్తుల మధ్య సమన్వయంతో కూడిన ప్రయత్నాలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచంలో పనిచేసే జనాభాప్రపంచ జనాభాలో సుమారు 65 శాతం నుంచి 67 శాతం వరకు పని చేసే వయసు (15-64 ఏళ్ల)లో ఉన్నవారు ఉంటారని ఒక అంచనా. అంటే 823 కోట్ల మంది జనాభాలో పనిచేసేవారు 535 కోట్ల నుంచి 551 కోట్ల మధ్య ఉండవచ్చని తెలుస్తోంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ () అంచనాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా మొత్తం శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు సుమారు 60 శాతం నుంచి 63 శాతం వరకు ఉంటుంది. దీని ప్రకారం సుమారు 500 కోట్ల నుంచి 518 కోట్ల మంది వరకు ప్రపంచంలో శ్రామిక శక్తిలో (ఉద్యోగం చేసేవారితోపాటు ఉద్యోగ వేటలో ఉన్నవారు) భాగంగా ఉన్నారు.

**ఏ దేశంలో ఎక్కువ పనిచేసేవారు ఉన్నారు?** పని చేసే జనాభా ఎక్కువ శాతం ఉన్న దేశాలు:ప్రపంచ ఎకనామిక్స్ డేటా ప్రకారం.. ఉపాధి-జనాభా నిష్పత్తి పరంగా 87.1 శాతంతో ఖతార్ తొలి స్థానంలో ఉంది. అయితే ప్రపంచ దేశాల నుంచి ఖతార్‌కు అధికంగా కార్మికులు వలస రావడం వల్ల కావచ్చని తెలుస్తోంది.

ఈ జాబితాలో అధికంగా ఆఫ్రికన్, కొన్ని ఆసియా దేశాలు ఉంటాయి. ఎందుకంటే అక్కడ యువ జనాభా శాతం ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలు వ్యవసాయం, తక్కువ నైపుణ్యం కలిగిన కార్మిక రంగాలపై ఆధారపడి ఉంటాయి. ఇక పనిచేసే వారి సంఖ్య పరంగా చూస్తే మాత్రం.. చైనా, భారత్ వంటి అధిక జనాభా కలిగిన దేశాలు ప్రపంచంలోనే ముందు వరకుసలో ఉంటుంది. జనాభా భారీగా ఉంటుంది కాబట్టి పని చేసే వయసులో ఉన్నవారి సంఖ్య కూడా చాలా ఎక్కువగా ఉంటుంది.

**బి.వి.రమణ**
**94407 40015**

## సుస్థిరత, సంపద, సమృద్ధి సాధ్యం



ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ (ఒక మహిళ సగటున కనే పిల్లల సంఖ్య) 1.5 గా ఉంది. 1993లో ఇది 3.0గా నమోదైంది. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గిపోతే పని చేసే వారి సంఖ్య గణనీయంగా పడిపోయి ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదయ్యాయి. ఇలాగే కొనసాగితే 2047 నాటికి మన జనాభాలో 23 శాతం మంది వృద్ధులు ఉంటారు క్రమంగా ఆంధ్ర వృద్ధుల రాష్ట్రంగా మారిపోతుందనని నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణ భారత రాష్ట్రాలు నష్టపోతాయి. ఇప్పుడు ఒక్కరు వద్దు, ఇద్దరు ఒకే, ముగ్గురు ముద్దు అనే నినాదం తీసుకోవాల్సిన అవసరం వచ్చేసింది. పేదలు, గిరిజనులు ఎక్కువ మంది పిల్లలను కంటున్నారు. కానీ, దారిద్ర్య రేఖకు ఎగువున ఉన్న కుటుంబాల్లో మాత్రం ఈ పరిస్థితి కనిపించటం లేదు. చైనా ఒక్క సంతానంతో ఇప్పుడు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోంది. ఇజ్రాయెల్ లాంటి దేశాల్లో టోటల్ ఫెర్టిలిటీ రేట్ 3గా నమోదు అవుతోంది. ఏపీ జనాభా 5 కోట్లకు తగ్గకుండా నిర్వహిస్తేనే తెలుగు జాతి శక్తిమంతమైనదిగా నిలుస్తుంది. ఇప్పుడు ప్రణాళికలు చేస్తేనే వచ్చే 30-40 ఏళ్లలో సమాజంలో సుస్థిరత, సంపద, సమృద్ధి సాధ్యం అన్నారు చంద్రబాబు.

## ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం




ప్రపంచ సగటు జననాల రేటు ఒక మహిళకు 1963లో 5.3 ఉండగా 2023లో 2.2కి తగ్గింది. అందుకే, నిన్న మొన్నటి వరకూ ఒకరే ముద్దు, ఇద్దరు వద్దు అంటూ ప్రచారం చేసిన ప్రభుత్వాలు, ఇప్పుడు ఇద్దరు కాదు ముగ్గురు ముద్దు అని చెబుతున్నాయి. దానికి రెండు కోణాలు ఉన్నాయి. ఒకటి దక్షిణ భారత జనాభా తగ్గిపోతే పార్లమెంటులో ప్రాతినిధ్యం, కేంద్ర నిధుల్లో వాటా తగ్గిపోవడం. రెండోది, దేశంలో మొత్తంగా యువత తగ్గిపోయి వృద్ధుల సంఖ్య పెరిగిపోవడం. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన సమాజాల్లో కనీసంగా జననాల రేటు 2.1 గా ఉండాలని శాస్త్రవేత్తలు చెబుతారు. అంటే దీన్నే రిప్లేస్మెంట్ లెవెల్ ఆఫ్ ఫెర్టిలిటీ అంటారు. మరణించే వారి సంఖ్యకు సమానంగా కొత్తగా పుట్టే వారి సంఖ్య ఉండి, జనాభా పెరగకుండా లేదా తగ్గకుండా స్థిరంగా ఉండే స్థాయి అని అర్థం. సరిగ్గా ఇప్పుడు ఏపీలో ఆ జననాల రేటు ఉండాల్సిన దానికంటే తగ్గిపోయింది. ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు, దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఈ జననాల రేటు తగ్గుదల కనిపించిందంటున్నారు నిపుణులు. ఈ విషయంలో కేరళ ముందుంది. ఆ తరువాత తమిళనాడు, ఏపీ, ఒడిశా, కర్ణాటకల్లో ఈ జననాల రేటు బాగా తగ్గింది. ఆంధ్రప్రదేశ్ అత్యంత కఠినంగా దీన్ని అమలు చేసింది. డ్వాక్రా వంటి పథకాలు ఇవ్వాలన్నా ఇద్దరు పిల్లలుండాలి, ఆపరేషన్ అయిందా అని ప్రశ్నించేవారు. ప్రభుత్వం 10-15 ఏళ్ల పాటు ఈ నియంత్రణ కొనసాగించడంతో ఇక్కడ జననాల రేటు తగ్గింది.

సూర్య స్పోర్ట్స్

# జేకే రంజీ విజేతలకు ఘన సత్కారం




మంగళవారం సాయంత్రం జమ్మూ కాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జెకెసిఎ) రంజీ ట్రోఫీ విజయాన్ని జరుపుకుంది, జిజిఎం సైన్స్ కాలేజ్ హాస్టల్ గ్రౌండ్‌లో జట్టుకు విందు ఏర్పాటు చేసింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) అధ్యక్షుడు మిథున్ మన్హాస్ ఈ వేడుకల్లో పాల్గొని, తొలిసారి రంజీ ట్రోఫీని గెలుచుకుని చరిత్ర సృష్టించినందుకు జట్టుకు రూ.5 కోట్ల చెక్కును అందజేశారు. జెకెసిఎ తమ అద్భుతమైన ప్రదర్శనకు గాను జట్టుకు రూ. 3 కోట్ల చెక్కును కూడా అందించింది. ఫిబ్రవరి 28న హుబ్బళ్లిలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఎనిమిది సార్లు ఛాంపియన్‌గా నిలిచిన కర్ణాటక జట్టు 291 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సాధించి, జమ్మూ కాశ్మీర్ తొలి రంజీ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఇటీవల విజయ్ మర్చంట్ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌ను గెలుచుకున్న అండర్-16 బాలురు మరియు మహిళల జట్టుతో సహా జెకెసిఎ జట్లను కూడా వేడుకల్లో పాల్గొనమని ఆహ్వానించారు. సీనియర్ పురుషుల జట్టులోని అన్ని ఆటగాళ్లకు వారి విజయం కోసం బహుమతులు మరియు అవార్డులను అందజేశారు మరియు మొత్తం జమ్మూ & కె గర్వపడేలా చేసినందుకు జెకెసిఎ వారిని అభినందించింది. ఆటగాళ్ల కుటుంబాలు మరియు కోచింగ్ సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు, అయితే జట్టు రంజీ ట్రోఫీకి సిద్ధం కావడానికి మరియు ఆట యొక్క దిగ్గజాలను ఓడించి టైటిల్‌ను గెలుచుకోవడానికి వారి కృషికి జెకెసిఎ తన అధికారులను సత్కరించింది. ఒక సాంస్కృతిక కార్యక్రమం కూడా నిర్వహించబడింది, దీనిలో స్థానిక కళాకారులు, ముఖ్యంగా ప్రసిద్ధ స్థానిక గాయని సోనాలి డోగ్రా ప్రదర్శన ఇచ్చారు మరియు ఈ సందర్భాన్ని జరుపుకోవడానికి ఆటగాళ్లను నృత్యంలో నడిపించారు. ఈ స్థాయికి చేరుకోవడానికి జట్టు చేసిన కృషికి బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ అభినందనలు తెలిపారు మరియు బీసీసీఐ అధ్యక్షుడిగా, వారికి మద్దతు ఇవ్వడానికి తాను ఏ ప్రయత్నమూ చేయనని హామీ ఇచ్చారు. సోమవారం, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కేంద్రపాలిత ప్రాంత క్రికెట్ జట్టు సభ్యుల గౌరవార్థం జమ్మూలో విందు ఏర్పాటు చేశారు. అబ్దుల్లా, తన మంత్రివర్గ సహచరులు మరియు సీనియర్ అధికారులతో కలిసి ఆటగాళ్లను హృదయపూర్వకంగా స్వాగతించారు మరియు వారి చారిత్రాత్మక విజయానికి గుర్తింపుగా రూ. 2 కోట్ల అవార్డు డబ్బును అందజేశారు. ఈ సందర్భంగా మన్హాస్ కూడా హాజరయ్యారు.

# సంజు క్రమశిక్షణే విజయ రహస్యం






**అతని దాడి శైలి మరియు టెస్ట్‌లో అతని అవకాశాలను ప్రభావితం చేస్తుందా?**

బిజు జార్జ్: టెస్ట్ క్రికెట్ ఒకప్పుడు జాగ్రత్తకు విలువ ఇచ్చింది. కానీ మాథ్యూ హేడెన్ మరియు ఆడమ్ గిల్‌క్రిస్ట్ వంటి ఆటగాళ్ళు ఆ మనస్తత్వాన్ని మార్చుకున్నారు. జట్లు మొదటి రోజు 400 పరుగులు చేయడం ప్రారంభించాయి. సంజు లాంటి ఆటగాడు టెస్ట్ మ్యాచ్లో క్లిక్ చేస్తే, అతను నాలుగు రోజులు ఆటపై ఆధిపత్యం చెలాయించగలడు. అతను అభిషేక్ శర్మ, రిషబ్ పంత్ మరియు వీరేంద్ర సెహ్వాగ్ వంటి అరుదైన ప్రభావశీల ఆటగాళ్ల వర్గానికి చెందినవాడు. వారు ప్రతి ఆటలో పెద్దగా స్కోరు చేయకపోవచ్చు, కానీ వారు అలా చేసినప్పుడు, వారు మ్యాచ్ను పూర్తిగా మారుస్తారు.

బిజు జార్జ్: ఇది నిర్దిష్ట సాంకేతిక లేదా శారీరక సర్దుబాటు అని నేను అనుకోను. ఇది మనస్తత్వం గురించి – కదలిక మరియు నిర్ణయం తీసుకోవడంలో ప్రతిబింబించే మానసిక మార్పు.

**భారతదేశానికి ఎంపిక కానప్పుడు సంజు ఎప్పుడైనా నిరాశ వ్యక్తం చేశారా?**

బిజు జార్జ్: క్రికెట్లో, 11 మంది ఆటగాళ్ళు మాత్రమే ఆడగలరు. చాలా మంది ప్రతిభావంతులైన క్రికెటర్లు దూరంగా ఉంటారు – కుల్దీప్ యాదవ్ లాంటి వారు కూడా దానిని ఎదుర్కొన్నారు. అవకాశాలు వచ్చినప్పుడు వాటిని అందిపుచ్చుకోవడమే కీలకం. అదే సంజు తత్వశాస్త్రం.

అది 2011లోఎస్ఏఐకోచింగ్ సెంటర్లో జరిగింది. కేరళ క్రికెట్ అసోసియేషన్ స్కోరర్ సుధీర్ అలీ ఇద్దరు అబ్బాయిలను వారి తండ్రి – సంజు మరియు అతని సోదరుడు సాలీతో పాటు తీసుకువచ్చాడు, అతను కేరళ తరపున రంజీ ట్రోఫీ ఆడటానికి వెళ్ళాడు. సంజుకు అప్పుడు కేవలం 11 సంవత్సరాలు, కానీ అతని క్రమశిక్షణ అసాధారణమైనది. వారు విజింజం దాటి నివసించారు మరియు ప్రతిరోజూ రెండు బస్సులలో ప్రయాణించి ఉదయం 6 గంటలకు ముందు మెడికల్ కాలేజ్ గ్రౌండ్ చేరుకునేవారు. ఉదయం తీవ్రమైన ప్రాక్టీస్ తర్వాత, వారు గ్రౌండ్స్మ్యాన్ గది దగ్గర పైపును ఉపయోగించి స్నానం చేసి, బట్టలు మార్చుకుని, సెయింట్ జోసెఫ్ స్కూల్కు వెళ్లి, సాయంత్రం శిక్షణ కోసం తిరిగి వచ్చేవారు. నాకు ఇప్పటికీ గుర్తుంది – అండర్-19 విదేశీ (వెస్టిండీస్) పర్యటన నుండి ఉదయం 4:30 గంటలకు తిరిగి వచ్చిన తర్వాత, సంజు ఉదయం 6 గంటలకు నెట్స్‌కి తిరిగి వచ్చాడు. ఇంత చిన్న వయస్సులో ఆ రకమైన అంకితభావం అతను గొప్పతనాన్ని పొందుతాడని మాకు తెలియజేసింది.

సంజు మొదటి నుండి దూకుడు ఆటగాడా?

బిజు జార్జ్: ఖచ్చితంగా. ఆ దాడి చేసే స్వభావం ఎల్లప్పుడూ ఉండేది. అతను మొదటిసారి అండర్-13 విభాగంలో కేరళకు ప్రాతినిధ్యం వహించినప్పుడు, ఒకే టోర్నమెంట్లో అతని స్కోర్లు: 135, 236, 100, మరియు 87. అతను ఎల్లప్పుడూ ప్రత్యర్థి జట్టుకు ఆటను తీసుకెళ్లే వ్యక్తి.


**సంజు 20 ప్రపంచ కప్ ప్రదర్శనను మీరు ఎలా అంచనా వేస్తారు?**

బిజు జార్జ్: ప్రారంభ దశ – ముఖ్యంగా న్యూజిలాండ్ పర్యటన – కోచ్గా నాతో సహా మనలో చాలా మందికి నిరాశపరిచింది. కానీ సంజు తనకు తెలిసిన ఏకైక విధంగా స్పందించాడు: కష్టపడి పనిచేయడం. అతను కేరళకు తిరిగి వచ్చి మంగళపురలోని ఖజూరా గ్రౌండ్, తుంబాలోని సెయింట్ జేవియర్స్ కాలేజ్ గ్రౌండ్ మరియు కార్యవట్టంలోని స్పోర్ట్స్ హబ్లోని గ్రీన్ఫీల్డ్ స్టేడియంలో ఐదు రోజులు తీవ్రంగా శిక్షణ పొందాడు. మాజీ రాజస్థాన్ రాయల్స్ కోచ్ జుబిన్ భరుచా ఆధ్వర్యంలో, అతను ప్రతిరోజూ నాలుగు నుండి ఐదు గంటలు శిక్షణ పొందాడు. ప్రారంభ ప్రపంచ కప్ మ్యాచ్లలో మెరుగుదల తక్షణమే రాలేదు, కానీ అతను ప్రతి ఆటతో మెరుగయ్యాడు. మరియు ఇది అతని శిఖరం కాదని నేను ఇప్పటికీ నమ్ముతున్నాను. అతను గతంలో బలమైన బౌలింగ్ దాడులకు వ్యతిరేకంగా మరింత మెరుగ్గా రాణించాడు.



## అట్లాంటాపై 6-1 తో బేయర్న్ మ్యూనిచ్

# ఘన విజయం



మంగళవారం జరిగిన ఛాంపియన్స్ లీగ్ క్వార్టర్ ఫైనల్స్లో బేయర్న్ మ్యూనిచ్ జట్టును 6-1 తేడాతో ఓడించి, జర్మన్ దిగ్గజాలు పోటీలో గెలవడానికి ఫేవరెట్లలో ఒకటని నిరూపించింది. బెర్గామోలో జరిగిన 12వ నిమిషంలో జోసిప్ స్టానిసిక్ ద్వారా ఆధిక్యంలో ఉన్న బేయర్న్, అత్యుత్తమ ఆటగాడు మైఖేల్ ఒలిస్ చేసిన అద్భుతమైన బ్రేస్ మరియు సెర్జ్ గ్నాబ్రీ, నికోలస్ జాక్సన్ మరియు జమాల్ ముసియాలా చేసిన మరిన్ని స్ట్రైక్ల ద్వారా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ సీజన్లో బేయర్న్ తన సొంత మైదానంలో ఒక్కసారి మాత్రమే ఓడిపోయింది మరియు మంగళవారం హ్యారీ కేన్ మరియు జమాల్ ముసియాలా ఇద్దరూ బెంచ్పై ఆడటంతో వచ్చిన భయంకరమైన ప్రదర్శన అట్లాంటాకు ఎటువంటి పురోగతి సాధించే అవకాశం లేకుండా చేసింది. మ్యూనిచ్లో వచ్చే వారం జరిగే రెండవ లెగ్లో చారిత్రాత్మక పతనం తప్ప, తదుపరి రౌండ్లో రియల్ మాడ్రిడ్ లేదా మాంచెస్టర్ సిటీతో బ్లాక్బస్టర్ టై బేయర్న్కు ఎదురుచూస్తోంది. "మేము కోరుకున్నది అలాంటి ప్రదర్శననే. మేము మ్యాచ్ అంతటా ప్రమాదకరంగా ఉన్నాము" అని కొంపానీ ప్రైమ్ వీడియోతో అన్నారు."మా జట్టులో ప్రతిభ మరియు నాణ్యత ఉన్నాయి... కాబట్టి కుర్రాళ్ళు ఇలా ఆడటం ఆశ్చర్యం కలిగించదు."బోరుస్సియా డార్ట్మండ్ను అధిగమించి చివరి 16లోకి ప్రవేశించిన ఉత్కంఠభరితమైన మార్గం తర్వాత అట్లాంటాకు ఇది చాలా దూరం తిరిగి వస్తుంది మరియు వారి తొలగింపు ఈ సీజన్లో ఛాంపియన్స్ లీగ్లో ఇటలీ భాగస్వామ్యాన్ని ముగించింది. యూరోపియన్ రాయల్టీ చేతిలో ఓడిపోవడం గత దశాబ్దంలో స్వదేశంలో మరియు విదేశాలలో దాని బరువు కంటే ఎక్కువగా పంచ్ చేసిన సాంప్రదాయకంగా చిన్న క్లబ్కు అవమానం కాదు. కానీ రాఫెల్ పల్లాడినో ఆటగాళ్లకు ఇది ఒక శిక్షార్హమైన రాత్రి, వారు హాఫ్ టైమ్ మరియు ఫైనల్ విజిల్ మరియు ఇటాలియన్ ఫుట్బాల్ రెండింటిలోనూ వారి అరుపుల మద్దతుతో ప్రశంసలు అందుకున్నారు."బేయర్న్ను ప్రశంసించడం తప్ప మీరు ఏమీ చెప్పలేరు.. దురదృష్టవశాత్తు అది మేము ఆశించిన విధంగా జరగలేదు మరియు మేము ఓటమిని అంగీకరించాలి" అని స్టాపేజ్ సమయంలో ఆతిథ్య జట్టుకు ఓదార్పు గోల్ చేసిన మారియో పసాలిక్ అన్నారు."మేము కొంచెం గర్వంగా రెండవ లెగ్ ఆడటానికి ప్రయత్నించాలి."కనికరం లేదు కేన్ మరియు ముసియాలా బేయర్న్ లేకుండానే నేరుగా అట్లాంటా వైపు వచ్చారు, అవిశ్రాంతంగా ఒత్తిడి చేశారు, మరియు మైఖేల్ ఒలిస్ మొదటి ఐదు నిమిషాల్లో ఆతిథ్య గోల్ కీపర్ మార్కో కార్నెసెచ్చిని రెండుసార్లు పరీక్షించారు. లూయిస్ డియాజ్ చేసిన ప్రయత్నం వల్ల కార్నర్ కోసం దారి మళ్లింది, దీని ఫలితంగా ఇ స్టానిసిక్ తదుపరి సెట్ పీస్లో పేలవమైన డిఫెండింగ్ను సద్వినియోగం చేసుకున్నాడు. ఒలిస్ తన కార్నర్ను గ్నాబ్రీకి తిప్పగా, అతను పెనాల్టీ ప్రాంతంలో పూర్తిగా మార్క్ చేయబడలేదు, బంతిని స్టానిసిక్కి దగ్గరగా నెట్టడానికి దగ్గరి నుండి నెట్టాడు. ఒలిస్ 22వ నిమిషంలో అట్లాంటాకు ఒక పర్వతాన్ని ఎక్కే అవకాశాన్ని ఇచ్చాడు, అతను కుడి పార్శ్వం నుండి డ్రిఫ్ట్ అయ్యి సీజన్లో తన రెండవ ఛాంపియన్స్ లీగ్ గోల్ను అందంగా వంగాడు. ఫ్రాన్స్ ఫార్వర్డ్ ఆటగాడుసమర్థవంతంగా ముగించాడు.

## ఐపీఎల్

# షెడ్యూల్ విడుదల

### మార్చి 28న బెంగళూరులో

### ఆర్‌సీబీ VS యస్ ఆర్ హెచ్



ముంబయి: ఐపీఎల్ 2026 షెడ్యూల్ వచ్చేసింది. మార్చి 28 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. బెంగళూరు వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్‌లు తలపడనున్నాయి. 29న ముంబయి కోల్‌కతా; 30న రాజస్థాన్ చెన్నై; 31న పంజాబ్ గుజరాత్; ఏప్రిల్ 1న లఖ్‌నవూ దిల్లీ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

| ATCH NO | DATE | DAY | TIME | HOME | AWAY | VENUE |
|---|---|---|---|---|---|---|
| 1 | 28/03/26 | Sat | 7:30 PM | Royal Challengers Bengaluru | Sunrisers Hyderabad | Bengaluru |
| 2 | 29/03/26 | Sun | 7:30 PM | Mumbai Indians | Kolkata Knight Riders | Mumbai |
| 3 | 30/03/26 | Mon | 7:30 PM | Rajasthan Royals | Chennai Super Kings | Guwahati |
| 4 | 31/03/26 | Tue | 7:30 PM | Punjab Kings | Gujarat Titans | New Chandigarh |
| 5 | 01/04/26 | Wed | 7:30 PM | Lucknow Super Giants | Delhi Capitals | Lucknow |
| 6 | 02/04/26 | Thu | 7:30 PM | Kolkata Knight Riders | Sunrisers Hyderabad | Kolkata |
| 7 | 03/04/26 | Fri | 7:30 PM | Chennai Super Kings | Punjab Kings | Chennai |
| 8 | 04/04/26 | Sat | 3:30 PM | Delhi Capitals | Mumbai Indians | Delhi |
| 9 | 04/04/26 | Sat | 7:30 PM | Gujarat Titans | Rajasthan Royals | Ahmedabad |
| 10 | 05/04/26 | Sun | 3:30 PM | Sunrisers Hyderabad | Lucknow Super Giants | Hyderabad |
| 11 | 05/04/26 | Sun | 7:30 PM | Royal Challengers Bengaluru | Chennai Super Kings | Bengaluru |
| 12 | 06/04/26 | Mon | 7:30 PM | Kolkata Knight Riders | Punjab Kings | Kolkata |
| 13 | 07/04/26 | Tue | 7:30 PM | Rajasthan Royals | Mumbai Indians | Guwahati |
| 14 | 08/04/26 | Wed | 7:30 PM | Delhi Capitals | Gujarat Titans | Delhi |
| 15 | 09/04/26 | Thu | 7:30 PM | Kolkata Knight Riders | Lucknow Super Giants | Kolkata |
| 16 | 10/04/26 | Fri | 7:30 PM | Rajasthan Royals | Royal Challengers Bengaluru | Guwahati |
| 17 | 11/04/26 | Sat | 3:30 PM | Punjab Kings | Sunrisers Hyderabad | New Chandigarh |
| 18 | 11/04/26 | Sat | 7:30 PM | Chennai Super Kings | Delhi Capitals | Chennai |
| 19 | 12/04/26 | Sun | 3:30 PM | Lucknow Super Giants | Gujarat Titans | Lucknow |
| 20 | 12/04/26 | Sun | 7:30 PM | Mumbai Indians | Royal Challengers Bengaluru | Mumbai |

## క్వార్టర్ ఫైనల్స్‌కి సబలెంకా



మంగళవారం జరిగిన గ్రాండ్ స్లామ్ విజేతల పోరులో ప్రపంచ నంబర్ వన్ అరినా సబలెంకా 6-2, 6-4 తేడాతో మాజీ ఛాంపియన్ నవోమి ఒసాకాను ఓడించి ఇండియన్ వెల్స్ క్వార్టర్ ఫైనల్స్కు చేరుకుంది. ఎనిమిది ఏస్లతో 31 మంది విజేతలను కొట్టిన సబలెంకాకు ఇది మరో సూటిగా, వరుస సెట్ల విజయం. "మొత్తం మీద నేను ఆమెపై చాలా ఒత్తిడి తెచ్చినందుకు సంతోషంగా ఉంది, ఈ రోజు నేను కోర్టులో వైవిధ్యాన్ని తీసుకువచ్చాను" అని సబలెంకా చెప్పింది, ఆమె తన విజృంభణ గ్రౌండ్‌స్ట్రోక్లను నెట్లోకి ప్రభావవంతమైన ఫోరేలతో కలిపింది. "కీలక క్షణాల్లో ఆమె కొంచెం గందరగోళానికి గురైందని నేను భావిస్తున్నాను మరియు దానిని చూసి నేను సంతోషంగా ఉన్నాను" అని సబలెంకా అన్నారు. "నా సర్వ్ బాగా పనిచేసినందుకు నేను సంతోషంగా ఉన్నాను, తిరిగి వచ్చినప్పుడు నేను నిజంగా గొప్ప టెన్నిస్ ఆడాను." ఒసాకా తన లయను కనుగొనడం ప్రారంభించే ముందు సబలెంకా మొదటి సెట్ను రెండు బ్రేక్లతో ముగించింది. కానీ జపాన్ స్టార్ సబలెంకా సర్వీస్ను ఛేదించలేకపోయింది, ఆమె రెండవ సెట్లో ఎదుర్కొన్న రెండు బ్రేక్ పాయింట్లను సేవ్ చేసి, ఫోర్హ్యాండ్ విజేతల జతతో 4-3కి బ్రేక్ తీసుకుంది. నాలుగుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్లుగా నిలిచిన వీరిద్దరి మధ్య ఇది కేవలం రెండవ సమావేశం. 2018లో ఒసాకా తన తొలి ప్రధాన టైటిల్ను యుఎస్ ఓపెన్కు చేరుకునే మార్గంలో మొదటి బ్యాక్ను గెలుచుకుంది."ఇది నిజంగా పిచ్చిగా ఉంది," అని సబలెంకా వారు తరచుగా కలవలేదని చెప్పింది. కానీ ఇప్పుడు 16వ స్థానంలో ఉన్న ఒసాకా, 2023 మొత్తాన్ని కైవసం చేసుకుని, ఆ సంవత్సరం జూలైలో కుమార్తె షాయ్ను కన్న తర్వాత టూర్లో తన ఊపును తిరిగి పొందడంతో వారి భవిష్యత్తులో మరిన్ని ఘర్షణలు ఉంటాయని ఆమె అంచనా వేసింది. 2023 మరియు 2025లో ఇండియన్ వెల్స్లో రన్నరప్గా నిలిచిన సబలెంకా, ప్రతిష్టాత్మక డబ్ల్యూటీఏ మరియు ఏటీపీ మాస్టర్స్ 1000 ఈవెంట్లో ఆరో సీడ్ అమెరికన్ అమండా అనిసిమోవా లేదా 10వ సీడ్ కెనడియన్ టీన్ విక్టోరియా ఎంబోకోతో తలపడి తన మొదటి టైటిల్ కోసం తన ప్రయత్నాలను కొనసాగిస్తుంది. 'పూర్తిగా మాటలు లేనిది' కాలిఫోర్నియా ఎడారిలో ఆస్ట్రేలియన్ క్వాలిఫైయర్ తాలియా గిబ్సన్ కలల పరుగు కొనసాగింది, ఆమె ఏడవ ర్యాంక్ ఇటాలియన్ జాస్మిన్ పావోలినిపై 7-5, 2-6, 6-1 తేడాతో 42 విజేతలను ఓడించింది. టాప్-10 క్రీడాకారిణిపై 21 ఏళ్ల ఆమె తొలి విజయం ఆమెను తన తొలి డబ్ల్యూటీఏ క్వార్టర్-ఫైనల్కు నడిపించింది, అక్కడ ఆమె చెక్ లిండా నోస్కోవా లేదా ఫిలిప్పీన్స్కు చెందిన అలెగ్జాండ్రా ఈలాను ఎదుర్కొంటుంది. 112వ ర్యాంక్లో ఉన్న గిబ్సన్, లేట్ బ్రేక్ ఉపయోగించి మొదటి సెట్ను జేబులో వేసుకుంది, ప్రారంభ ఫ్రేమ్లో తన 18వ విజేతతో దాన్ని ముగించింది. గిబ్సన్ తప్పిదాలు పెరగడంతో పావోలిని రెండవ సెట్లో 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది మరియు రెండుసార్లు గ్రాండ్స్లామ్ ఫైనలిస్ట్ అయిన అనుభవజ్ఞురాలైన ఇటాలియన్ నియంత్రణను చేజిక్కించుకున్నట్లు అనిపించింది. కానీ గిబ్సన్ మూడవ దానిలో విజేతల దాడిని విరమించుకుంది, మ్యాచ్ పాయింట్పై ఫోర్హ్యాండ్ సర్వీస్ రిటర్న్తో సహా.

## ల్యాండ్ మార్క్ కోసం

# కింగ్ ఆరాటం?



అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రం కోసం సిద్ధమవుతున్నాడు. తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కింగ్ 100 అనే వర్కింగ్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. యాక్షన్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలో నాగార్జున లుక్ గురించి దర్శకుడు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నాడు. 'శివ', 'రక్షకుడు' సినిమాల్లోని స్టైలిష్ నాగార్జునను ఈ చిత్రంలో మళ్లీ చూడవచ్చని, ఆయన మూడు విభిన్నమైన గెటప్స్‌లో కనిపిస్తారని రా కార్తీక్ తెలిపాడు. తన 100వ సినిమాకు ఒక తమిళ దర్శకుడిని ఎంచుకోవడం వెనుక నాగార్జునకు కథపై ఉన్న నమ్మకమే కారణమని ఆయన పేర్కొన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో సీనియర్ నటి టబూ కీలక పాత్ర పోషిస్తుండగా, 'నాట్యం' ఫేమ్ సుస్మితా భట్ మరో హీరోయిన్‌గా నటిస్తుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను 2026 దసరా కానుకగా విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది.

## న్యూ అవతార్‌లో రెడీ అవుతోన్న 'డేవిడ్ రెడ్డి'





రియల్ స్టంట్ మోడ్‌లో ట్రాన్స్‌ఫర్మేషన్‌మంచు మనోజ్.. వైవిధ్యమైన సినిమాలు, పాత్రలతో తనదైన గుర్తింపు సంపాదించుకున్న సంగతి తెలిసిందే. ఎప్పటికప్పుడు కొత్తదనంతో ప్రేక్షకులను ఆయన ఆకట్టుకుంటుంటారు. తాజాగా మరోసారి సోషల్ మీడియాలో ఆయన చేసిన పోస్ట్ ఫ్యాన్స్ సహా ప్రేక్షకులను, సినీ వర్గాలను ఆకర్షిస్తున్నాయి. మనోజ్ తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ గురించిన అప్‌డేట్‌ను ఆయన షేర్ చేసుకున్నారు. రాబోయే సినిమాల కోసం గత మూడు వారాలుగా కఠినంగా శ్రమిస్తున్నానని ఆయన ఈ పోస్ట్‌లో వెల్లడించారు. అలాగే ఆయన పోస్ట్ చేసిన వర్కవుట్ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. నటుడిగా మనోజ్ చూపిస్తోన్న పట్టుదల, కృషిని అందరూ అభినందిస్తున్నారు. ఆ పోస్ట్‌లో మనోజ్ తన తీసుకున్న నిర్ణయం గురించి చాలా నిజాయితీగా మాట్లాడారు. సౌకర్యంగా ఉండటానికి సాకులు వెతకకుండా వాటిని పక్కకు పెట్టేసి కష్టపడాలని నిర్ణయించుకున్నానని ఆయన పేర్కొన్నారు. "మూడు వారాల క్రితం నేను ఒక నిర్ణయం తీసుకున్నాను. ఇక సౌకర్యంతో రాజీ పడటం లేదు. ఇక సాకులు చెప్పాలని అనుకోవటం లేదు. కేవలం కష్టం మాత్రమే," అని ఆయన రాశారు. ఇదే క్రమంలో యాక్షన్ సినిమాలు చేయడం ఎంత కష్టమో కూడా ఆయన వివరించారు. "యాక్షన్ సినిమాలో మీ కోసం ఎవరూ నటించలేరు. ప్రతి పంచ్, దెబ్బ తగిలినప్పుడు పడిపోవటం, ప్రతి దెబ్బకు మీ శరీరం సిద్ధంగా ఉండాలి. లేకుంటే వెంటనే బయటపడుతుంది. కెమెరా ఎప్పుడూ అబద్ధం చెప్పదు," అని ఆయన అన్నారు. ఇకపై కేవలం లుక్ కోసం కాకాకుండా..శక్తి, సహనాన్ని పెంచుకోవడంపైనే తాను దృష్టి పెట్టానని ఆయన చెప్పారు. తన లక్ష్యం "ధృడమైన వ్యక్తి"లా తయారవడం అని పేర్కొన్నాడు.

## మార్చి 26న గోట్



హాస్య కథానాయకుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం గోట్. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోన్న ఈ చిత్రం మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఇప్పటి వరకు ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు మంచి స్పందన వస్తోంది. త్వరలోనే ఈ చిత్రం ట్రైలర్‌ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ... ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది.

## బాక్సాఫీస్ వద్ద శ్రీ విష్ణు సందడి





ఆడియెన్స్ ఫస్ట్ ఛాయిస్‌గా 'మృత్యుంజయ్' కంటెంట్ కింగ్ శ్రీ విష్ణు, హుస్సేన్ షా కిరణ్ కాంబోలో తెరకెక్కిన 'మృత్యుంజయ్' చిత్రం గత వారం థియేటర్లోకి వచ్చింది. మార్చి 6న విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. గత వారం విడుదలైన చిత్రాల్లో ఆడియెన్స్ ఫస్ట్ ఛాయిస్‌గా నిలిచింది. అంతే కాకుండా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల పరంగానూ 'మృత్యుంజయ్' సత్తా చాటుకుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ అయిన మృత్యుంజయ్ ప్రస్తుతం భారీ విజయంతో దూసుకుపోతోంది. లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు.మార్చి 6న విడుదలైన 'మృత్యుంజయ్' మంచి మౌత్ టాక్‌తో, రివ్యూలతో ఆడియెన్స్‌లోకి బలంగా దూసుకు వెళ్లింది. ఈ సినిమాలోని కథ, కథనం అన్నీ కూడా కొత్తగా ఉండటం, సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించడంతో ఆడియెన్స్ ఫిదా అయ్యారు. డే వన్ నుంచి కూడా కలెక్షన్స్ నిలకడగానే ఉన్నాయి. వీకెండ్‌లో సత్తా చాటిన మూవీ.. వీక్ డేస్‌లోనూ మెప్పిస్తోంది. అలా గడిచిన వారం రోజుల్లో ఆడియెన్స్‌కి ఫస్ట్ ఛాయిస్‌గా 'మృత్యుంజయ్' నిలిచింది. సింగిల్ స్క్రీన్, మల్టీ ప్లెక్స్ అన్న తేడా లేకుండా అన్ని చోట్లా హౌస్ ఫుల్ బోర్డులతో సినిమా నడుస్తోంది. బలమైన ఆక్యుపెన్సీతో ఈ మూవీ సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. టాలీవుడ్ నుంచి సైతం 'మృత్యుంజయ్'కి మంచి రివ్యూలు వచ్చిన సంగతి తెలిసిందే. సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్, నేచురల్ స్టార్ నాని ఇచ్చిన రివ్యూలు సైతం సినిమా సక్సెస్‌లో భాగమయ్యాయి. ఈ వారం కూడా 'మృత్యుంజయ్' దూసుకుపోయేలా కనిపిస్తోంది.

## ప్యారడైజ్ ఆయా షేర్ సాంగ్ రికార్డ్ బ్రేకింగ్ రెస్పాన్స్

**లిరిక్ రైటర్ కాసర్ల శ్యామ్‌నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్ ది ప్యారడైజ్ ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ వరల్డ్ వైడ్ సంచలనం సృష్టించింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. ప్రస్తుతం ఆయా షేర్ ప్రపంచవ్యాప్తంగా టాప్ లో ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంటుంది. ది ప్యారడైజ్ చిత్రం ఆగస్టు 21న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆయా షేర్ సాంగ్ లిరిక్ రైటర్ కాసర్ల శ్యామ్ విలేకరలు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.**



**ఆయా షేర్ సాంగ్‌కి వస్తున్న రెస్పాన్స్ ఎలా అనిపిస్తోంది ?**
ఆయా షేర్ పాట ప్రోమో విడుదలైనప్పటి నుంచి మంచి బజ్ క్రియేట్ చేసింది. పాట రిలీజ్ అయిన తర్వాత అన్ని రికార్డ్స్ బద్దలు కొట్టుకుంటూ అందరికీ నచ్చింది. అనిరుధ్ గారు నేను ఇచ్చిన పదాలు తీసుకొని జనాలకి రీచ్ అయ్యే విధంగా ట్యూన్ చేశారు. మట్టి వాసన తెలిసిన జానపద గాయకులు జంగిరెడ్డి, దేవయ్య అద్భుతంగా పాడారు.

**ఇంత ఫిరోషియస్ సాంగ్‌లో లిరిక్స్ గురించి ప్రత్యేకంగా మాట్లాడం చాలా ఆనందాన్ని ఇచ్చింది?**
నా కెరీర్లో ఈ పాట ఇచ్చినంత కిక్కు మరి ఏ పాట ఇవ్వలేదు. నేను ఉపయోగించిన భాష, యాసకి సోషల్ మీడియాలో చాలా అద్భుతమైన ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ పాట విన్న తర్వాత నాకు చాలా మెసేజుల వచ్చాయి. జీవితంలో సర్వస్వం కోల్పోయానని బాధపడే ఓ వ్యక్తి.. ఈ పాట విని ఒక కొత్త స్ఫూర్తి పొందానని చెప్పాడు. అలాంటి మెసేజ్లు చాలా వచ్చాయి. ఈ స్పందన నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.ఈ సినిమాలో నాని క్యారెక్టర్‌లో ఒక అద్భుతమైన ఎమోషన్ ఉంటుంది. ఆ జడల్ వెనుక మంచి కథ ఉంటుంది. ఇప్పుడు అందరూ ఆ జడలు గురించి మాట్లాడుకుంటున్నారు. సినిమా చూసిన తర్వాత వాటికి అద్భుతమైన జస్టిఫికేషన్ ఉంది అనుకుంటారు. ఇప్పుడు అందరు కూడా జడలు వేసుకుని రీల్స్ చేస్తున్నారు. ఆ కల్చర్‌ని గుర్తు చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. **అనిరుద్ పాట చేస్తున్నప్పుడే పెద్ద హిట్ కొడుతున్నాం అని చెప్పారు.**

ఈ పాట సక్సెస్‌కి ముఖ్య కారణం డైరెక్టర్ శ్రీకాంత్. జనం నుంచి పుట్టిన ఒక వీరుడు ఆ జనాలకు స్ఫూర్తిని ఇచ్చే క్రమంలో వచ్చిన పాట ఇది. అందరి నుంచి అద్భుతమైన రెస్పాన్స్ అందుకుంటుంది. ఈ పాట రాయడానికి వారం రోజులు పట్టింది. కొన్ని వెర్షన్స్ డెవలప్ చేసు కుంటూ చివరికి దీనిని ఫిక్స్ చేశాం. కాకపోతే సాంగ్ సెంట్రల్ ఐడియా మాత్రం ఇమ్మిడియట్‌గా లాక్ చేశాం.-ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ చెప్పడానికి ఒక ప్రత్యేకమైన పల్లవి ఉంటే బాగుంటుంది అనుకున్నాను. ఆ ఆలోచన శ్రీకాంత్ గారికి నచ్చింది.

**సోషల్ మీడియాలో అదే పల్లవి గురించి మాట్లాడుతున్నారు.తెలంగాణ మండలికంలో పాటంటేనే మీ పేరు గుర్తొస్తుంది కదా ఎలా అనిపిస్తుంది?**
చాలా ఆనందంగా ఉంది. సీనియర్ కవులని స్ఫూర్తిగా తీసుకునే ముందుకు సాగుతున్నాను. కొసరాజు గారు, జాలాది గారు ఈ యాసతో ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. నేను రాసిన ఎక్కువ పాటలు తెలంగాణ యాసలో వచ్చాయి. దాదాపు అన్ని రకాల పాటలు రాశాను.-డైరెక్టర్ గారు ఈ పాట గురించి పూర్తిగా వివరించారు. ఒక ఒక జాతి కష్టం నుంచి పుట్టే ఒక యోధుడు ఆ జాతికి స్ఫూర్తి నింపే నేపథ్యంలో వచ్చే పాటిది. 80 దశకాల్లో జరిగే నేపథ్యం కాబట్టి అప్పుడు ఉర్దూ ప్రభావం ఉంటుంది. అందుకే ఇందులో చాలా వరకు ఉర్దూ పదాలు ఉపయోగించడం జరిగింది.

**బలగం సినిమాకి నేషనల్ అవార్డ్ అందుకోవడం ఎలా అనిపించింది?**
పల్లె భాషను నమ్ముకుని పరిశ్రమకు వచ్చాను. ఆ పల్లె భాష ఈ రోజు దేశవ్యాప్తంగా మోగడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. మరుగునపడిన భాష పదాలు నా ద్వారా మళ్ళీ వెలుగులోకి రావడం, ఈ జనరేషన్ యువత కూడా ఆ పదాల్ని వాడుకోవడం నాకు రచయితగా చాలా ఆనందాన్నిస్తోంది.
-నేను గురువుగా భావించే మా చంద్రబోస్ గారు నేషనల్ అవార్డు రాగానే నాకు ఫోన్ చేసి మీరు చాలా తక్కువ సమయంలో అచీవ్ చేశారు తమ్ముడు అన్నారు. అది నాకు చాలా ఆనందాన్నిచ్చింది.

**మీ జర్నీ ఎలా అనిపిస్తోంది?**
నా మొదటి సినిమా చంటిగాడు. నీలపూరి గాజులు అనే పాటతో నాకు ఫస్ట్ బ్రేక్ వచ్చింది. ఆ తర్వాత చాలా సినిమాలు రాశాను. అయితే లై సినిమాతో మళ్లీ నాకు ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చింది. తర్వాత ఇస్మార్ట్ శంకర్, రాములో రాములా, డిజె టిల్లు.. వరుసగా విజయవంత మైన పాటలు వచ్చాయి.డైరెక్టర్ శ్రీకాంత్ గారితో ఇది రెండో సినిమా కదా..

## బాపు బొమ్మ విశ్వ మహిళ అవార్డ్స్ ప్రదానోత్సవం!!

బాపుబొమ్మగా తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకుని, సామాజిక - రాజకీయ రంగాల్లోనూ తన ప్రత్యేకత చాటుకుంటున్న ప్రముఖ నటీమణి దివ్యవాణి చౌదరి... అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపు బొమ్మ విశ్వ మహిళ పేరిట 2026 వ సంవత్సరానికిగాను అవార్డ్స్ ప్రదానం చేశారు. మెగా బాపు బొమ్మ శ్రీమతి కొణిదెల అంజనీదేవి, రెబెల్ స్టార్ కృష్ణంరాజు సతీమణి శ్రీమతి శ్యామలాదేవి, యాంకర్ స్వప్న, జనేతా కంచర్ల (యు.ఎస్.ఎ), డాక్టర్ వెన్నెల గద్దర్, డాక్టర్ పద్మజా చంద్రకాంత్, సమీరా భరద్వాజ్, రేఖారాణి, డి. జ్యోతిరెడ్డి (యు.ఎస్.ఎ) తదితర ప్రముఖ మహిళామణులు పురస్కారాలు అందుకున్నవారిలో ఉన్నారు.

తెలంగాణ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు సౌజన్యంతో హైదరాబాద్, దసపల్లా హోటల్ లో అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, తెలుగు వన్ అధినేత కంఠంనేని రవిశంకర్, ప్రముఖ నటుడు - రచయిత హర్షవర్ధన్, డిప్యూటీ కలెక్టర్ ఇ. వెంకటాచారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎమ్. కిరణ్ కుమార్ తదితరులు అతిధులుగా పాల్గొన్నారు.



## గోదారి గట్టుపైన బంగారు బొమ్మ సాంగ్



మార్చి 13న రిలీజ్‌మేమ్ ఫేమస్‌తో విజయాన్ని అందుకున్న సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా గోదారి గట్టుపైనతో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఫస్ట్ బ్రీజ్ గ్లింప్స్, చూడు చూడు, ఓ మై గాడ్ సాంగ్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ థర్డ్ సింగిల్ బంగారు బొమ్మ సాంగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ పాట మార్చి 13న రిలీజ్ కానుంది. సాంగ్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ లవ్లీ కెమిస్ట్రీ ఆకట్టుకుంది.

## వదలా ఖచ్చితంగా హిట్ కొడతామనే

గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ లో హీరో జగపతి బాబుజగపతి బాబు, లయ, ఆకెళ్ళ వి. కృష్ణ, కిషోర్ నాయుడు చిరుమామిళ్ళ, తమ్మారెడ్డి భరద్వాజ్, చరిత చిత్ర ప్రొడక్షన్ వదలా గ్రిప్పింగ్ గ్లింప్స్ లాంచ్‌వెర్సటైల్, కమాండింగ్ స్క్రీన్ ప్రజెన్స్ తో అదరగొట్టే జగపతి బాబు, బలమైన కుటుంబ భావోద్వేగాలతో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ వదలాతో రాబోతున్నారు. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారు. అకెళ్ళ వి కృష్ణ దర్శకలో కిషోర్ నాయుడు చిరుమామిళ్ళ, తమ్మారెడ్డి భరద్వాజ్ చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. మేకర్స్ గ్రిప్పింగ్ గ్లింప్స్ లాంచ్ చేశారు. గ్లింప్స్ ప్రారంభంలో జగపతిబాబు కలవరపరిచే ఆలోచనల్లో మునిగిపోయినట్లు కనిపిం చారు. ఆ తర్వాత లయ ఎంట్రీ ఇస్తుంది. ఆమె ముఖంలో కనిపించే ఆందోళన, టెన్షన్ కథలోని పరిస్థితులను సూచిస్తుంది. కథ ఒక్కసారిగా మరింత డార్క్ టోన్‌లోకి మారుతుంది. ఒక మహిళా వాయిస్ ఓవర్ వినిపిస్తూ నీ ఫ్యామిలీలో ఒకరిని తీసేసుకుంటా అని చెప్పడం షాకింగ్ అల్టిమేటమ్‌ను రివిల్ చేస్తుంది. ఇది వెంటనే ప్రేక్షకులను కథలోకి తీసుకెళ్తుంది.షార్ప్ కట్స్‌తో యాక్షన్ సన్నివేశాలు, ఎమోషనల్ మూమెంట్స్ "రేస్ అగైనెస్ట్ టైమ్" అనిపించే టెన్షన్ ని సృష్టిస్తాయి. దర్శకుడు ఆకెళ్ళ వి కృష్ణ సస్పెన్స్‌ను హ్యాండిల్ చేసిన తీరు ప్రత్యేకంగా నిలుస్తుంది.జగపతి బాబు కొన్ని కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న పాత్రలో కనిపించారు. మరోవైపు లయ కూడా ఇంటెన్స్ వున్న పాత్రలో కనిపిస్తూ కథకు బలాన్ని ఇస్తుంది. సినిమాటోగ్రాఫర్ చోటా కే నాయుడు అందించిన డైనమిక్ విజువల్స్ సినిమాకు ప్రత్యేక టోన్ సెట్ చేతోంది. సంగీత దర్శకుడు కార్తిక్ అందించిన పల్సేటింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వదలా థీమ్ థ్రిల్‌ను మరింత పెంచుతుంది. ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు చేసిన క్రిస్ప్ ఎడిటింగ్ గ్రిప్పింగ్ గా వుంది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం చోటా కె నాయుడు. తన ఎనర్జీ అందరికీ పంచాడు. ఒక చిన్న ప్రాబ్లం వచ్చి ఈ సినిమా చేయమని నేనే రిక్వెస్ట్ చేశాను. మరో ఆలోచన లేకుండా సినిమా చేశారు. అందరూ ఇష్టపడి చేసిన సినిమా ఇది. ఈ సినిమా భోపాల్ లో చేశాం. అక్కడి ప్రభుత్వానికి ధన్యవాదాలు. భరద్వాజ గారు నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇప్పటికీ 24 గంటలు పనిచేస్తున్నారు.ఆయన్ని అభినందించాలి. ఆయన ఆలోచనలు చాలా మోడరన్ గా ఉన్నాయి. అలాంటి ప్రొడ్యూసర్స్ ఉండడం చాలా హ్యాపీగా ఉంది. సినిమా పనిచేస్తున్న అందరూ నటీనటులు టెక్నీషియన్స్ చాలా సపోర్ట్ చేశారు. కార్తిక్ సూపర్ మ్యూజిక్ ఇచ్చాడు. తన నుంచే వదలా అనే టైటిల్ కూడా వచ్చింది. లయ నా డియర్ ఫ్రెండ్. మనోహరం సినిమా చేసినప్పుడు తను చాలా చిన్న పిల్ల. తర్వాత హనుమాన్ జంక్షన్ చేశాం. వదలాలో కూడా అద్భుతమైన పర్ఫామెన్స్



ఉంది.ఆముద పాత్రలో హ్రితిక కూడా చాలా టెర్రిఫిక్ పెర్ఫార్మన్స్ ఇచ్చింది. సినిమా మీద చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాము. ఆడియన్స్ అందరు కూడా ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను. సునీల్ నారంగ్ గారు వున్నారు కాబట్టి చాలా మంచి రిలీజ్ ఉంటుంది. కచ్చితంగా మంచి హిట్ కొట్టగలమనే నమ్మకం ఉంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044